


'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 50

శనివారం 4-11-2023



అఫ్గాన్... అదే జోరు


వరల్డ్‌కప్‌లో 4వ విజయం.. నెదర్లాండ్స్‌పై ఏడు వికెట్ల తేడాతో గెలుపు - 13లో



వారం గరిష్టానికి సూచీలు

282 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్.. 19,200 స్థాయిపైకి నిఫ్టీ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



యూపీలో అత్యాచారం, హత్య

యూపీలో దళిత మహిళపై దుండగులు అత్యాచారానికి పాల్పడి, దారుణంగా హత్య చేసి.. మృతదేహాన్ని 3 ముక్కలు చేశారు. వివరాలు 6లో ▸



కాలుష్యం కోరల్లో ఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా పడిపోగా..శుక్రవారం అది 'తీవ్రమైన ప్లస్' కేటగిరీకి చేరింది. వివరాలు 6లో ▸



భూపేశ్‌కు 508 కోట్ల ముడుపులు

ఛత్తీస్‌ఘడ్ సీఎం భూపేశ్ బఘేల్‌కు ఓ బెట్టింగ్ సంస్థ నుంచి రూ.508 కోట్ల ముడుపులు అందినట్లు ఈడీ ప్రకటించింది. వివరాలు 6లో ▸



32 మంది మృత్యువాత

ఇరాన్‌లో గిలాన్ ప్రావిన్స్‌లోని పునరావాస కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదంలో 32 మంది మృత్యువాత పడ్డారు. వివరాలు 6లో ▸

సంపూర్ణ సాధికారత

అణగారిన వర్గాల అభ్యున్నతికి సమగ్ర కులగణన

సీఎం జగన్ అధ్యక్షతన కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం

ఈనెల 20వ తేదీ తర్వాత రాష్ట్రంలో కులగణన ప్రక్రియ ప్రారంభం

- కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆయా సామాజిక వర్గాల అభిప్రాయాల సేకరణ
- ఐదు ప్రాంతాల్లో రౌండ్ టేబుల్ సమావేశాల నిర్వహణ
- ప్రభుత్వ ఉద్యోగులకు 3.64 శాతం డీఏ
- అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీకి గ్రీన్ సిగ్నల్
- ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా వైద్య సేవలపై పౌరులకు అవగాహన
- జనవరి నుంచి ప్రతి మండలంలో నాలుగు ఆరోగ్య సురక్ష క్యాంపులు
- 7న రైతు భరోసా, 15న అసైన్డ్‌దారులకు యాజమాన్య హక్కులు
- 28న విద్యా దీవెన, 30న కళ్యాణమస్తు, షాదీ తోఫా పంపిణీ
- తూర్పు గోదావరి, శ్రీసత్యసాయి జిల్లాల్లో 2 రవాణా శాఖ యూనిట్లు
- ప్రభుత్వ సర్వీసుల్లో భాగంగా 4 జోన్లు ఇకపై ఆరు జోన్లుగా మార్పు
- వీటితో పాటు కొత్తగా రెండు మల్టీజోన్ల ఏర్పాటు
- పూడిమడకలో రూ.95 వేల కోట్లతో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్
- అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేనికి గ్రూప్-1 ఉద్యోగం
- పోలవరం ముంపు బాధితులకు ఇళ్ల పట్టాలు, భూముల రిజిస్ట్రేషన్
- కర్నూలులో లా యూనివర్సిటీకి అదనంగా భూ కేటాయింపులు
- ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్ నియామకం
- పరిశ్రమలకు సేల్ డీడ్ ద్వారా కొత్త భూ కేటాయింపుల పాలసీ

2లో



"అణగారిన వర్గాల అభ్యున్నతికి కుల గణన మరింత దోహదం చేస్తుంది. ఆర్థిక, సామాజిక సాధికారత దిశగా చేయూత అందిస్తుంది. ఇంకా ఎవరైనా అర్హులు ప్రభుత్వ పథకాలు అందకుండా మిగిలి పోయినా కూడా ఈ గణన ద్వారా తెలుస్తుంది. తద్వారా వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుంటుంది."

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్



నాటి ఉచిత ఇసుక విధానం..

పేదల కోసం కాదు.. పెద్దల కోసం

- అప్పట్లో టీడీపీ ప్రభుత్వ చర్యను తీవ్రస్థాయిలో ఆక్షేపించిన ఎన్జీటీ
- ఇసుకను ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించడం అవివేకమైన చర్య అంటూ వ్యాఖ్య
- దాని దోపిడీని అరికట్టకుండా ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించింది.. ఖజానాకు తీవ్ర నష్టం చేస్తుంటే ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరించింది
- అడ్డగోలుగా ఇసుక తవ్వకాల వల్ల పర్యావరణంతో పాటు ప్రజారోగ్యంపైనా తీవ్ర ప్రభావం
- తక్షణమే ఇసుక అక్రమ తవ్వకాలను ఆపేయాలని 2019, ఏప్రిల్ 4న నాటి టీడీపీ సర్కార్‌కు అల్టిమేటం జారీ
- పర్యావరణాన్ని దెబ్బతీసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి రూ.100 కోట్ల జరిమానా విధింపు

10లో

పల్నాడు జిల్లా మాచర్లలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం




బడుగులకు రాజ్యాధికారం సాకారమైంది

5లో

- ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఫలం
- చంద్రబాబు ఒక్క మైనార్టీకీ మంత్రిగా అవకాశం ఇవ్వలేదు
- జగన్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం, నలుగురేసి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు.. ఓ మైనార్టీ మహిళను మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌గా చేశారు
- మాచర్ల సామాజిక సాధికార సభలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా

ర్యాలీలు అంటే.. బెయిల్ ఇచ్చే వాళ్లమా?



- చంద్రబాబు బహిరంగ ర్యాలీలు నిర్వహించడం, పాల్గొనడం చేయరాదు
- బహిరంగ సభల్లో కూడా పాల్గొనరాదు
- కేసుకు సంబంధించి బహిరంగ ప్రకటనలు చేయకూడదు
- మేం ఇచ్చింది కేవలం మెడికల్ బెయిల్ మాత్రమే.. కస్టోడియల్ బెయిల్‌తో సమానంగా పరిగణించడానికి వీల్లేదు
- అదనపు షరతులు అవసరం లేదన్న బాబు వాదనను తిరస్కరించిన హైకోర్టు

5లో

సీఎంని రుషికొండకు వెళ్లొద్దంటారా?



- పిటిషనర్‌కు సుప్రీంకోర్టు చీవాట్లు
- మీరు వేసిన పిల్‌లో ప్రజా ప్రయోజనం ఏముంది?
- రాజకీయ పరిష్కారాలకు కోర్టుకు ఎందుకొస్తారని ఆగ్రహం
- రుషికొండ నిర్మాణాలపై జోక్యం చేసుకోబోమని స్పష్టీకరణ.. లింగమనేని పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

5లో

కర్ణాటక సీఎం కుర్చీపై పోటీ

కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు పెరుగుతోంది. ఎవరికి వారు వర్గాలుగా మారి సీఎం కుర్చీపై టార్గెట్ పెట్టారు. ఇందులో ముఖ్యంగా సిద్ధరామయ్య వర్గం, డీకే శివకుమార్ వర్గం పేర్లు కీలకంగా వినిపిస్తున్నాయి. ఈ సమయంలో హోసపేట నగరంలో సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ రానున్న ఐదేళ్ల పాటు తానే సీఎంగా కొనసాగుతానని వ్యాఖ్యలు చేయడంతో డీకే శివకుమార్ వర్గం నోటిలో పచ్చి వెలక్కాయ పడ్డట్లయ్యింది. రెండున్నరేళ్ల తర్వాత అధికార మార్పిడితో తాను సీఎం అవుతానని ఆశలు పెట్టుకున్న డీకే శివకుమార్‌కు ఈ వ్యాఖ్యలు మింగుడు పడడం లేదు. ముఖ్యమంత్రిగా ఆరు నెలలు పూర్తి చేసుకున్న సిద్ధరామయ్య రానున్న ఐదేళ్ల పాటు తానే సీఎంగా కొనసాగుతానని నర్మగర్భంగా వ్యాఖ్యలు చేయడంపై రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

6లో



30శాతం మందికి సురక్షిత నీరు 'కరువు'

2030 నాటికి కరువు కోరల్లో 700 మిలియన్ ప్రజలు

- భవిష్యత్తులో నీటి కొరత కారణంలో ఆర్థిక వృద్ధిలోనూ ఆరు శాతం తగ్గుదల
- రాబోయే రోజుల్లో పంట ఉత్పత్తిలో 12 శాతం వరకూ క్షీణత ఖాయం
- వర్షపు నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాల పెంపు అత్యంత అవశ్యం
- 'సాక్షి'తో అంతర్జాతీయ వాటర్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ మార్క్ స్మిత్



సాక్షి, విశాఖపట్నం: కరువు కారణంగా 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 700 మంది మిలియన్ ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో చిక్కుకుంటారని.. ఇప్పటికే నీటిఎద్దడి ఉన్న ప్రాంతాల్లో 2.3 బిలియన్ల మందికి పైగా ఉన్నారని అంతర్జాతీయ నీటి నిర్వహణ సంస్థ డైరెక్టర్ జనరల్ డా. మార్క్‌స్మిత్ వెల్లడించారు. 30 శాతం మందికి ఇంకా సురక్షిత మంచినీరు అందడంలేదన్నారు. 1998 నుంచి 2017 వరకూ 1.5 బిలియన్ల మంది కరువు కోరల్లో చిక్కుకున్నారని.. ఇవన్నీ భయపెట్టే గణాంకాలే కాబట్టి.. ఇప్పటి నుంచే అందరూ మేల్కొనాలని ఆయన పిలుపునిచ్చారు. 25వ అంతర్జాతీయ కాంగ్రెస్, ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ 74వ అంతర్జాతీయ సమావేశాల్లో మార్క్‌స్మిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ పలు అంశాలను వెల్లడించారు. ఆయన ఏమన్నారంటే..

ఆర్థిక వృద్ధిపైనా తీవ్ర ప్రభావం..

వాతావరణ మార్పుల్లో నీటి కొరత కూడా భాగమే. వాతావరణ పరిరక్షణకు ఏ విధంగా చర్యలు తీసుకుంటున్నామో నీటి కొరతను అధిగమించేందుకూ అదే పద్ధతిలో ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉంది. నీటి సంక్షోభం ఏర్పడితే.. ఏ దేశమైనా కోలుకోలేని పరిస్థితికి చేరుకోవడమే కాదు.. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపైనా ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. నీటి కొరత కారణంగా 2050 నాటికి ప్రపంచ ఆర్థిక వృద్ధిలో 6 శాతం తగ్గుదల కనిపిస్తుంది. ఇది చాలా ప్రమాదకరమైన అంశంగా అన్ని దేశాలు గుర్తించాలి.

అగ్రి వాటర్ మేనేజ్‌మెంట్ అవసరం

ఈ నేపథ్యంలో.. ప్రపంచంలోని అన్ని దేశాలు అగ్రికల్చర్ వాటర్ మేనేజ్‌మెంట్‌ను అమలుచేయాల్సిన అవసరముంది. ఫుడ్ ప్రొడక్షన్ సిస్టమ్, జీవ వైవిధ్యం, ఎకోసిస్టమ్, వాతావరణంలో మార్పులపై నిరంతర అధ్యయనం జరగాలి. ఉజ్బెకిస్తాన్‌లో ఇదే తరహాలో కర్షి లిఫ్ట్ ఇరిగేషన్ విధానాన్ని ఇప్పటికే అమలుచేస్తూ అత్యుత్తమ ఫలితాల్ని సాధిస్తున్నారు. పంట దిగుబడులు పెంచడం, నీటి నిల్వల పెంపుతో పాటు కర్బన ఉద్గారాల నియంత్రణని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మిగిలిన దేశాల్లోనూ ఇదే తరహా ప్రయోగాలు జరిగితే.. భవిష్యత్తులో నీటి కొరత రాకుండా ఉంటుంది. వర్షపు నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాల పెంపుదల అనేది అత్యంత కీలకపాత్ర పోషించనున్నాయి. దీనికి ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ సహకారం పూర్తిగా అందిస్తుంది.

పంటల ఉత్పత్తి తగ్గుతుంది..

నీటి లభ్యత లేకపోతే.. పంటలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ప్రపంచవ్యాప్తంగా 72 శాతం వరకూ మంచినీటిని వ్యవసాయానికి వినియోగించేస్తున్నాం. 2050 నాటికి నీటి కొరత కారణంగా పంట భూములు ధ్వంసమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈ కారణంగా రాబోయే రోజుల్లో పంట ఉత్పత్తిలో 12 శాతం వరకూ తగ్గుదల కనిపిస్తుంది. వరదలు, అనావృష్టి కారణంగా వ్యవసాయ రంగంలో నష్టాలు పెరగబోతున్నాయి.



ఇదే పార్టీలో ఉంటే ఎప్పటికీ టికెట్ రాదనే..వేరే పార్టీలోకి జంప్ అయ్యి.. మళ్లీ ఈ పార్టీలోకి మారితే టిక్కెట్టిచ్చారు

క్లుప్తంగా...

లోకో పైలట్ కుటుంబానికి రూ.10 లక్షలు అందజేత



లోకో పైలట్ భార్యకు చెక్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు, ఆర్డీవో జయరాం

కోటవురట్ల(అనకాపల్లి జిల్లా): విజయనగరం జిల్లా కంకటాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాదంలో మృతిచెందిన లోకో పైలట్ సింగంపల్లి మధుసూదనరావు కుటుంబ సభ్యులను పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు శుక్రవారం పరామర్శించారు. తంగేడులోని మధుసూదనరావు ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మధుసూదనరావు భార్య సూర్యలతను ఎమ్మెల్యే ఓదార్చి రాష్ట్ర ప్రభుత్వం తరపున పరిహారంగా రూ.10 లక్షల చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్‌ఎస్ సీతారామరాజు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, పైల నాని పాల్గొన్నారు.

ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు కర్నూలు ఉల్లి

- 10 టన్నులు కొనుగోలు చేసిన మార్కెటింగ్ శాఖ



ఉల్లిపాయలను కాటా వేయిస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లిపాయల ధర పెరిగి వినియోగదారులు ఇబ్బందిపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ అధికారులను అప్రమత్తం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా తక్కువ ధరకు ఉల్లిపాయలను సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు ప్రభుత్వం తరపున ఉల్లిపాయలను తరలించేందుకు మార్కెటింగ్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఏడీ నారాయణమూర్తి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం 10 టన్నుల ఉల్లిపాయలను కిలో రూ.36 చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని ప్రకాశం జిల్లాకు 5 టన్నులు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు 5 టన్నుల చొప్పున సరఫరా చేయనున్నట్లు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వీటిని ఆయా జిల్లాల్లో 'నోలాస్, నో ప్రాఫిట్' కింద రైతుబజార్లలో వినియోగదారులకు విక్రయిస్తామని చెప్పారు. బాపట్ల, గుంటూరు జిల్లాకు సరఫరా చేసేందుకు శనివారం కర్నూలు మార్కెట్‌లో ఉల్లిపాయలు కొనుగోలు చేస్తామన్నారు. ఉల్లిపాయల ధర పెరగడం వల్ల రైతులకు ఉపశమనం కలుగుతోందని, ఇదే సమయంలో వినియోగదారులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అసైన్డ్ భూముల సేకరణ పరిహారంపై కొత్త నిబంధన

సాక్షి, అమరావతి : అసైన్డ్ భూముల భూసేకరణకు సంబంధించి ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. ఈ మేరకు ఇటీవల ఆర్డినెన్స్ జారీ చేసింది. అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ చట్ట సవరణ చేసిన రాష్ట్ర ప్రభుత్వం, అందులో స్వల్ప మార్పులు చేస్తూ ఈ ఆర్డినెన్స్ ఇచ్చింది. అసైన్డ్ భూములను ప్రజా ప్రయోజనాల కోసం సేకరించినప్పుడు వాటికి అక్కడి మార్కెట్ విలువకు సమానమైన పరిహారాన్ని మాత్రమే చెల్లిస్తారు. ఆ ప్రాంతంలోని ఇతర భూముల యజమానులు సంప్రదింపులు లేదా కోర్టును ఆశ్రయించడం ద్వారా పొందుతున్న పరిహారం ఈ భూములకు వర్తించదని ఈ చట్టంలో స్పష్టం చేశారు. అలాగే అసైన్డ్ భూముల యాజమాన్య హక్కులకు సంబంధించి అసైన్‌దారుల హక్కులకు భంగం కలగకుండా స్వల్ప మార్పు చేశారు. తమకు వ్యవసాయం కోసం ఇచ్చిన భూములను సంబంధిత రైతులు 20 సంవత్సరాల వ్యవధిలో ఎవరికీ బదలాయించకూడదని, ఆ భూముల కొనుగోళ్లు, బహుమతి, లీజు, తనఖా వంటి ఎటువంటి వ్యవహారాలు చేయకూడదని స్పష్టం చేశారు. అలా ఎవరికీ బదలాయింపు జరగని భూములపై 20 సంవత్సరాల తర్వాత సంబంధిత అసైన్‌దారులు లేకపోతే వారి వారసులకు చట్టపరంగా యాజమాన్య హక్కులు లభిస్తాయని పేర్కొన్నారు. 20 సంవత్సరాల కాలవ్యవధి ముగిసిన తర్వాత ఆ భూములకు సంబంధించిన అసైన్‌దారులు లేదా వారి వారసులకు ప్రభుత్వ సూచనలతో నిమిత్తం లేకుండా హక్కులు వస్తాయని తెలిపారు.

95.76 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



గుంటూరు ప్రగతినగర్‌కు చెందిన రామాంజమ్మకు దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీరు నాగలక్ష్మి



ఒంగోలు నగరంలోని రాజీవ్‌నగర్‌లో వృద్ధురాలు ఆరిగల పద్మావతికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ విజయలక్ష్మి

సాక్షి,అమరావతి : రాష్ట్రంలో ఈ నెలకు సంబంధించి 95.76 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. అక్కడక్కడ రెండు మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నప్పటికీ..అవ్వాతాతలకు చిన్న ఇబ్బంది కూడా కలగకుండా గ్రామ, వార్డు వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి శుక్రవారం సాయంత్రానికి 62,76,797 మందికి రూ.1,730.05 కోట్లు పంపిణీ చేశారు.ఈ నెలలో అవ్వాతాతలతోపాటు వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళ, వివిధ చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు 65.54 లక్షల మందికి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.1,806.90 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. కాగా, ఇంకా పింఛన్లు అందుకోని వారికి శని, ఆదివారాల్లో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఇవ్వనున్నారని అధికారులు వెల్లడించారు.



శ్రీకాకుళంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సోంపేటకు చెందిన సత్యనారాయణకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ శిరీష



నెల్లూరు వెంగమాంబ వీధికి చెందిన వృద్ధురాలు పాపమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మౌనిక



నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన సుబ్రమణ్యంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అల్లాసాధిక్



కాకినాడ జిల్లా తుని రూరల్ మండలంలోని డి.పోలవరానికి చెందిన దివ్యాంగ బాలిక లలిత రాజేశ్వరికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జోగిరాజు



విజయనగరం జిల్లా రేగిడి మండలం వన్నలిలో వృద్ధుడు గంట్యాన గౌరునాయుడుకు పింఛన్ ఇచ్చేందుకు ఐరిస్ తీసుకుంటున్న డిజిటల్ అసిస్టెంట్ రవి, పక్కన వలంటీర్ సత్యన్నాయుడు

సంపూర్ణ సాధికారత

సామాజిక అసమానతలను రూపుమాపేందుకు సమగ్ర కులగణన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం

ఈ నెల 20వ తేదీ తర్వాత రాష్ట్రంలో కుల గణన ప్రక్రియ ప్రారంభం





మంత్రి మండలి సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: సంపూర్ణ సామాజిక సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుల గణనకు శ్రీకారం చుడుతోంది. సమాజంలో అణగారిన వర్గాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఆరోగ్య, విద్యా ఫలాలు అందేందుకు వీలుగా ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దాదాపు శతాబ్దం తర్వాత రాష్ట్రంలో కుల గణన ద్వారా మరిన్ని పేదరిక నిర్మూలన పథకాలు, మానవ వనరుల అభివృద్ధితోపాటు తారతమ్యాలు, అసమానతలను రూపు మాపేలా ప్రణాళిక రూపొందించింది. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి కీలక సమావేశంలో ఈమేరకు కుల గణన నిర్ణయానికి ఆమోదం లభించింది. సమాచార, పౌర సంబంధాలు, బీసీ సంక్షేమ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మంత్రి మండలి నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. ఈ నెల 20వ తేదీ తర్వాత కుల గణన ప్రక్రియ చేపడతామని తెలిపారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆయా సామాజిక వర్గాల నాయకులతో సమావేశాలు, ఐదు ప్రాంతాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి అభిప్రాయ సేకరణ చేపడతామన్నారు. కుల గణన చేపట్టాలని కోరుతూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపినా స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో బీసీల ఆత్మ బంధువుగా సీఎం జగన్ చేపడుతున్న కుల గణనను 'సామాజిక సాధికార సురక్ష'గా అభివర్ణించారు. సంక్షేమ ఒరవడిలో భాగంగా నవంబరు 7వతేదీన వైఎస్సార్ రైతు భరోసా సాయం పంపిణీతో పాటు 15వతేదీన భూమిలేని నిరు పేదలకు అసైన్డ్ భూముల పంపిణీ, 22-ఏ జాబితా నుంచి ఈనామ్ భూముల మినహాయింపు, ఎస్సీ కార్పొరేషన్ రుణాల ద్వారా భూమి కొనుగోలు చేసిన వారికి రుణాలను మాఫీ చేయడంతో పాటు వాటిపై పూర్తి హక్కులు కల్పిస్తామన్నారు. ఎస్సీ శ్మశాన వాటికల కోసం భూములు, లంక భూములకు పట్టాల పంపిణీ చేపడతామన్నారు. 28వ తేదీన జగనన్న విద్యా దీవెన, 30న పేదింటి ఆడబిడ్డలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా అందజేస్తామన్నారు. జర్నలిస్టుల చిరకాల వాంఛ, విజ్ఞప్తిని గౌరవిస్తూ అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసేందుకు సీఎం జగన్ సారథ్యంలోని మంత్రి మండలి అంగీకారం తెలిపిందని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లకు 3.64 శాతం డీఏ (01-07-2022 నుంచి) ఇవ్వనున్నట్లు చెప్పారు. మంత్రి మండలి నిర్ణయాలపై మంత్రి ఏమన్నారంటే..

ఆస్పత్రికి వెళ్లేందుకు రూ.500 ప్రయాణ ఖర్చులు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయి. ప్రభుత్వం గ్రామ స్థాయిలో ఇంటింటికీ వెళ్లి పేదల ఆరోగ్యంపై ఆరా తీస్తోంది. ఇప్పటి వరకు 11,710 క్యాంపులను నిర్వహించింది. సుమారు 60 లక్షల మంది శిబిరాల వద్ద వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇంటి వద్దే 6.40 కోట్ల ర్యాపిడ్ టెస్టులు చేశారు. 8,72,212 మందికి కంటి పరీక్షలు చేయగా 5,22,547 మందికి కంటి అద్దాలు అందజేశారు. మిగిలిన వారికి మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు సిఫారసు చేశారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య పరీక్షల్లో అనారోగ్య సమస్యలను గుర్తిస్తే చికిత్స విషయంలో సమగ్రంగా ఫాలో అప్ చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. గతంలో ఆరోగ్యశ్రీ చికిత్సలు చేయించుకున్న వ్యక్తులు, శిబిరాల ద్వారా ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోవాల్సిన వారు, తీవ్ర వ్యాధులతో బాధపడుతున్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్దేశించారు. మెరుగైన వైద్యం కోసం రిఫరెల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా/ఆస్పత్రికి పంపించాలన్నారు. వారికి ప్రయాణ ఖర్చులు కింద రూ.500 అందించాలని ఆదేశించారు. చికిత్స సమయంలో, అనంతరం కూడా సకాలంలో మందులు అందించడంతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని దిశానిర్దేశం చేశారు.

ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా అవగాహన

ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సహాయం పొందేందుకు వీలుగా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుంది. ఇందుకోసం ఆరోగ్యశ్రీ యాప్ రూపొందించింది. ఆరోగ్యశ్రీ యాప్‌లో ఎంప్యానెల్ ఆస్పత్రులు, చికిత్స వివరాలు పూర్తిగా అందుబాటులో ఉంటాయి. జనవరి 1వతేదీ నుంచి ప్రతి నెలా ప్రతి మండలంలో నాలుగు వైద్య క్యాంపులు నిర్వహిస్తాం. ఇందులో నలుగురు స్పెషలిస్టు డాక్టర్లు, ఇద్దరు ఫ్యామిలీ డాక్టర్లు పాల్గొంటారు. ప్రతి వారం ఒక మండలంలోని గ్రామ సచివాలయంలో వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలు అందజేస్తాం. గ్రామాల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనత సమస్యను పారదోలేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నాం. మార్కాపురం వైద్య కళాశాలలో 21 పోస్టులతో నెఫ్రాలజీ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేస్తున్నాం. పలాస తరహాలో తీవ్రమైన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారికి ఇక్కడ మెరుగైన చికిత్స అందిస్తాం. ఇందులో భాగంగా కిడ్నీ పరిశోధనా కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

కొత్తగా రెండు రవాణా శాఖ యూనిట్లు

తూర్పు గోదావరి జిల్లా నల్లజెర్ల, గోపాలపురం, తాళ్లపూడి మండలాలతో కలిపి దేవరాపల్లిలో రవాణా శాఖకు యూనిట్ ఆఫీసు ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో ఒక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక టెక్నికల్ సపోర్ట్ ఇంజనీర్, ఒక హోంగార్డు నియామకానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో 6 మండలాలు (ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, రామగిరి, కనగానపల్లె, సీకే పల్లె)తో కలిపి రవాణా శాఖకు కొత్తగా యూనిట్ ఆఫీసు నెలకొల్పి ఒక మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక టెక్నికల్ ఇంజనీరు, ఇద్దరు సెక్యూరిటీ గార్డులు, ముగ్గురు హోం గార్డులను నియమించనున్నాం.

స్కూళ్లలో టెక్నాలజీ వినియోగం

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగైన విద్య అందించే చర్యల్లో భాగంగా 6,790 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్ నియామకానికి మంత్రి మండలి ఆమోదించింది. ఫ్యూచర్ స్కిల్స్‌పై బోధన కోసం సమీపంలోని ఇంజనీరింగ్ కాలేజీలను మ్యాపింగ్ చేసింది. ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ట్యాబ్‌లు, డిజిటల్ పరికరాలు, యాప్‌లు, ఐఎఫ్‌పీ ప్యానళ్ల వినియోగంపై శిక్షణ ఇస్తారు. వీటిల్లో ఎక్కడైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే సరిదిద్దుతారు.

భూ కేటాయింపులపై కొత్త పాలసీ

భారీ ప్రాజెక్టుల్లో భాగంగా ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్ బస్ అండ్ ట్రక్ కాంప్లెక్స్, డీజిల్ బస్ రిట్రో ఫిటింగ్, బ్యాటరీ ప్యాక్ అసెంబుల్డ్ చేసే పెప్పర్ మోషన్ సంస్థకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించింది. ఈ సంస్థ రూ.4,640 కోట్ల పెట్టుబడితో 8,080 మందికి ఉపాధి కల్పించనుంది. పరిశ్రమలకు భూ కేటాయింపులపై కొత్త పాలసీ 'న్యూ ల్యాండ్ అలాట్‌మెంట్'కి ఆమోదం లభించింది. ఇకపై లీజు విధానం స్థానంలో సేల్ డీడ్ ద్వారా కేటాయింపులు జరుగుతాయి. పరిశ్రమల కోసం మాత్రమే ఆ భూమిని వినియోగించేలా తగిన షరతులతో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.

జోనల్ వ్యవస్థలో మార్పులు..

ఉద్యోగుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ సర్వీసులకు సంబంధించి లోకల్ కేడర్స్ అండ్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ డ్రాఫ్ట్ ఆర్డర్ 2023కి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. జోనల్ వ్యవస్థలో మార్పులు తెచ్చింది. ప్రస్తుతం ఉన్న నాలుగు జోన్లను ఆరు జోన్లకు మారుస్తూ నిర్ణయం తీసుకుంది. వీటితో పాటు రెండు మల్టీ జోన్లను ఏర్పాటు చేసింది. జిల్లా కేడర్‌గా టీచర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సమాన స్థాయి, అంతకంటే దిగువ ఉద్యోగులు ఉంటారు. ఇక జోనల్ కేడర్‌గా జూనియర్ అసిస్టెంట్ పై కేడర్‌లు ఉంటాయి. మల్టీజోన్ పరిధిలో సెకండ్ లెవల్ గెజిటెడ్ సమాన స్థాయి, డిప్యూటీ కలెక్టర్ సమాన స్థాయి వారు ఉంటారు. స్టేట్ లెవల్ కేడర్ అంతా మల్టీజోనల్ కిందకు (ఏపీ సెక్రటేరియట్, హెచ్ఓడీలు, స్టేట్ లెవల్ ఇనిస్టిట్యూషన్స్, కేపిటల్ ఏరియాలో పోలీస్ కమిషనరేట్ మినహాయిస్తే) వస్తుంది. జోనల్ వ్యవస్థలో మార్పులతో 95 శాతం పోస్టులు స్థానికులకే చెందుతాయి. స్థానిక వ్యక్తులకు కనీస విద్యార్హత స్థాయి 10 నుంచి 7కి తగ్గించడంతో మేలు జరుగుతుంది.

విద్యుత్ రంగంలో..

- అనకాపల్లి జిల్లా పూడిమడకలో ఎన్టీపీసీకి థర్మల్ పవర్ ప్రాజెక్టు కోసం గతంలో ఏపీఐఐసీ 1,200 ఎకరాలు కేటాయించింది. ఇందులో ఎన్టీపీసీ రూ.95 వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటు చేయడంతో పాటు దీన్ని సబ్ లీజ్‌కు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదించింది.
- ఏపీ ఫెర్రో అల్లాయిస్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు వివిధ రకాల విద్యుత్ డ్యూటీలలో ప్రభుత్వం మినహాయింపులు ఇచ్చింది. తద్వారా సుమారు రూ.766 కోట్ల భారాన్ని ప్రభుత్వం భరించనుంది. ఈ పరిశ్రమలపై 50 వేల మంది ఆధారపడటంతో ఈమేరకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.
- 902 మెగావాట్ల సామర్థ్యం ఉన్న సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఎకోరన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు నంద్యాల, వైఎస్సార్ జిల్లాలలో 5,400 ఎకరాలు లీజు ప్రాతిపదికన కేటాయింపు. ఈ కంపెనీ ఎకరానికి ఏడాదికి రూ.31 వేలు చెల్లించనుంది.
- కర్నూలు జిల్లాలో 800 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఎకోరన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అనుమతి.

మంత్రి మండలి ఆమోదించిన మరిన్ని అంశాలు

- పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ 2023–24 ధాన్యం సేకరణకు మార్క్‌ఫెడ్ ద్వారా రూ.5 వేల కోట్ల రుణ సేకరణకు సంబంధించి ప్రభుత్వ గ్యారంటీలకు, రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అనుమతినిస్తూ గత నెల 30వతేదీన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశం ప్రతిపాదనలకు, రెండు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు స్పెషల్ ప్యాకేజీ ఇవ్వాలన్న ఎస్ఐపీబీ నిర్ణయానికి ఆమోదం లభించింది.
- రహదారుల, భవనాల శాఖలో వసతి గృహాల మెరుగైన నిర్వహణకు అవుట్ సోర్సింగ్ విధానంలో 467 పోస్టుల భర్తీ.
- పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మున్సిపాల్టీలో పురపాలకశాఖ భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు.
- 50 ఎకరాల లోపు ఏపీఐఐసీ ద్వారా 285 భూ కేటాయింపులకు ఆమోదం.
- తిరుపతి జిల్లా పేరూరులో ఎంఆర్‌కేఆర్ గ్రూపు హోటల్ నిర్మాణానికి అదనంగా మరో 2 ఎకరాలు, వైఎస్సార్ జిల్లా గండికోటలో, విశాఖపట్నంలో మే ఫెయిర్ గ్రూపులకు గతంలో కేటాయించిన భూములు కాకుండా కొత్త సర్వేనెంబర్లలో భూ కేటాయింపులు.
- విశాఖపట్నానికి చెందిన అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేని గ్రూప్–1 అధికారిగా నియామకానికి ఆమోదం.
- కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు 4.12 ఎకరాల భూమి కేటాయింపు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లెలో ఏపీఐఐసీకి 2.92 ఎకరాల భూమి కేటాయింపు.
- శ్రీకాకుళం, విశాఖపట్నం, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లో వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు.
- నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం రావూరులో 39.08 ఎకరాల భూమి రామాయపట్నం నాన్ మేజర్ పోర్టు నిర్మాణం కోసం ఏపీ మారిటైమ్ బోర్డుకు కేటాయింపు.
- రాష్ట్రంలో 100 ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ. ఇందులో 45 పోస్టులు అప్‌గ్రేడేషన్, 55 సూపర్ న్యూమరీ పోస్టులు. ఏపీ స్టేట్ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీలో విజయవాడతో పాటు విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు, కర్నూలులో 22 పోస్టుల భర్తీకి ఆమోదం.
- కర్నూలులో సెకండ్ నేషనల్ లా యూనివర్సిటీ, స్టేట్ క్వాజీ జ్యుడీషియల్ అండ్ లీగల్ ఇనిస్టిట్యూషన్స్ ఏర్పాటుకు అవసరమైన మరో 100 ఎకరాల భూమి కేటాయింపు. ఇప్పటికే వీటి కోసం 50 ఎకరాల భూమిని కేటాయించిన ప్రభుత్వం.
- దేవదాయ శాఖలో సిబ్బంది బలోపేతానికి దేవదాయశాఖ కమిషనర్ పరిధిలో ఒక డిప్యూటీ కమిషనర్ పోస్టు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం.
- దేవాలయాలు ఆర్జించే ఆదాయాల ఆధారంగా ఏర్పాటు చేసే పోస్టులకు సంబంధించిన ఆదాయ పరిమితుల పెంపు. గతంలో డిప్యూటీ కమిషనర్ పరిధిలో రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటే ఇప్పుడు దానిని రూ.7 కోట్ల నుంచి రూ.12 కోట్లకు, జాయింట్ కమిషనర్ పరిధిలో గతంలో రూ.కోటి పైన ఉంటే దానిని రూ.12 కోట్లు కంటే ఎక్కువ పరిమితి పెంచారు.
- విశాఖపట్నం జిల్లాలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు, యూజర్ చార్జీల నుంచి మినహాయింపు.
- పోలవరం ముంపు గ్రామాల పునరావాసంలో భాగంగా ఏలూరు జిల్లా పరిధిలో పోలవరం, వేలేరుపాడు, కుకునూరు మండలాల పరిధిలో 12,984 కుటుంబాలకు, తూర్పు గోదావరి జిల్లాలో దేవీపట్నం, కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లో 3,823 కుటుంబాలకు కేటాయించిన ఇళ్ల పట్టాలకు, భూమి కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ భూమి కేటాయింపునకు సంబంధించి ఉచితంగా రిజిస్ట్రేషన్.
- విశాఖ జిల్లా పెందుర్తి మండలం నరవలో ప్రముఖ జానపద కళాకారుడు, దివంగత వంగపండు ప్రసాదరావు సతీమణి వంగపండు విజయలక్ష్మికి 1,000 గజాల ఇంటి స్థలం కేటాయింపు.

నీటి కాలుష్యం వల్లే ముప్పు

విశాఖలో రెండో రోజు ఐసీఐడీ సదస్సులో వక్తలు

సాక్షి, విశాఖపట్నం: నీటి కాలుష్యం వల్లే సకల జీవరాశులకు, మానవ మనుగడకు తీవ్రంగా ముప్పు వాటిల్లుతున్నదని పలువురు వక్తలు పేర్కొన్నారు. విశాఖపట్నంలో జరుగుతున్న ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ (ఐసీఐడీ) 25వ సదస్సు శుక్రవారానికి రెండో రోజుకు చేరుకుంది. సదస్సులో 12 ప్రత్యేక సెషన్లు, నాలుగు సైడ్ ఈవెంట్లు జరిగాయి. సాగునీటి సరఫరా, డిమాండ్ నిర్వహణ, భూగర్భ జలాలను పెంపొందించడం, సాగునీటి వనరులను పొదుపుగా వినియోగించడం, పరిశ్రమల అవసరాలను తీర్చడం తదితర అంశాలను సమగ్రంగా చర్చించారు. వివిధ దేశాలు, రాష్ట్రాల ప్రతినిధులు తమ ప్రాంతాల్లో అమలు చేస్తున్న సుస్థిర సాగునీటి విధానాలు, తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ పంటల దిగుబడులు సాధించడం, మురికి నీటిని శుద్ధి చేయడం వంటి అంశాలను ప్రస్తావించారు. తైవాన్ యూనివర్సిటీ



సదస్సులో పాల్గొన్న విదేశీ ప్రతినిధులు


ప్రొఫెసర్ రువె బికావో నీటి కొరత, నీటి కాలుష్య నివారణ, కాలుష్యం నుంచి రక్షణ, నదుల్లో నీరు కలుషితం కావడం వల్ల పంటలకు వాటిల్లే ముప్పు, అవసరానికి మించి నీటి వినియోగం తదితర అంశాలను విశదీకరించారు. యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏవో), ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, ఇండియన్ నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ, ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్, నార్వే గ్లోబల్ పలు ప్రత్యేక అంశాలపై సైడ్ ఈవెంట్స్ నిర్వహించాయి. అనంతరం సదస్సుకు హాజరైన దేశ, విదేశాల ప్రతినిధులు విశాఖ నగర పరిధిలోని పర్యాటక కేంద్రాలు, పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లారు.

ఖరీఫ్ దిగుబడులు... 144 లక్షల టన్నులు

ధాన్యం దిగుబడులు 67.43 లక్షల టన్నులు

- చెరకు 24.43 లక్షల టన్నులు, పామాయిల్ 22.87 లక్షల టన్నులు
- పత్తి 12.85 లక్షల టన్నులు, మొక్కజొన్న 4.88 లక్షల టన్నులు

మొదటి ముందస్తు అంచనా నివేదిక విడుదల



సాక్షి, అమరావతి: ప్రతికూల పరిస్థితులు ఉన్నా ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు దిగుబడులపై ఆశాజనకంగా ఉన్నారు. వ్యవసాయ శాఖ విడుదల చేసిన మొదటి ముందస్తు అంచనా నివేదిక ప్రకారం ఈసారి 144 లక్షల టన్నుల దిగుబడులు వస్తాయని అధికారులు వెల్లడించారు. దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది రాష్ట్రంలో ఖరీఫ్ సాగు లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ఖరీఫ్ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం 84.98 లక్షల ఎకరాలు కాగా, గత ఏడాది 89.68 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. దిగుబడులు 164 లక్షల టన్నులు వచ్చాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 74 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలు సాగయ్యాయి. దిగుబడులు 144 లక్షల టన్నులు వస్తాయని అంచనా వేశారు. అయితే, రెండో ముందస్తు అంచనా నివేదికలో దిగుబడులు కొంతమేర పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

పంటల అంచనాలు ఇలా..

మొదటి ముందస్తు అంచనా దిగుబడుల నివేదిక ప్రకారం ఈ ఏడాది ఆహార పంటలు 47లక్షల ఎకరాల్లో సాగు చేయగా, 73.89లక్షల టన్నుల దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. ప్రధానంగా వరి గత ఏడాది 40 లక్షల ఎకరాల్లో సాగు చేయగా, 74.81 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయి. ఈ ఏడాది 36.55 లక్షల ఎకరాల్లో సాగు చేయగా, 67.43 లక్షల టన్నుల దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. చెరకు 24.43లక్షల టన్నులు, పామాయిల్ 22.87లక్షల టన్నులు, మొక్కజొన్న 4.88లక్షల టన్నులు, వేరుశనగ 2.32లక్షల టన్నులు, అపరాలు 2.17లక్షల టన్నులు చొప్పున దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. ప్రతికూల వాతావరణంలో సైతం మిరప రికార్డు స్థాయిలో 6 లక్షల ఎకరాలకు పైగా సాగవగా, 12 లక్షల టన్నులకు పైగా దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. కాగా, పత్తి 12.85లక్షల టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేశారు.

■ జూలైలో అధిక, సెప్టెంబర్‌లలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవగా, జూన్, ఆగస్టు నెలల్లో కనీస వర్షపాతం నమోదుకాక రైతులు ఇబ్బందిపడ్డారు. సగటున 593 మిల్లీ మీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, 493.8 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. ఈ ప్రభావం ఖరీఫ్ పంటల సాగుపై పడింది. ఫలితంగా సాగు విస్తీర్ణం తగ్గింది. అయితే, దిగుబడులు మాత్రం ఆశాజనకంగా ఉంటాయని రైతులు అంచనా వేస్తున్నారు.

ఈ-క్రాప్‌కు వందనం

- చిత్తూరు జిల్లాలో ఈ-క్రాప్ నమోదు పూర్తి
- లెక్క పక్కాగా ఉండేందుకు ప్రతి ఎకరాకు సామాజిక తనిఖీ

దేశానికి అన్నం పెట్టేది రైతు. ఆ అన్నదాతను అన్ని విధాల ఆదుకుని సేద్యం పండగలా సాగాలని ప్రభుత్వం భావించింది. అందుకు పలు పథకాలు అమలు చేసింది. ఆ పథకాల రాయితీలు మొదలుకుని ప్రకృతి వైపరీత్యాల సమయంలో అందజేసే నష్టపరిహారం వరకు ఈ-క్రాప్ వివరాలు ఎంతో కీలకం. పంట రుణాలు పొందేందుకు ఈ ప్రక్రియ ఎంతో దోహదపడుతుంది. ఇలాంటి పంట నమోదు చిత్తూరు జిల్లాలో వందశాతం పూర్తి చేశారు. ఇది అన్నదాతకు వరం కానుంది.

సాక్షి, చిత్తూరు: జిల్లాలో 2023 ఖరీఫ్ పంట సాగుకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు పూర్తి అయ్యింది. రైతులు సాగు చేసిన ప్రతి సెంటు పంటకు పారదర్శకంగా ఈ-క్రాప్ నమోదు చేసి, ప్రభుత్వం లెక్క పక్కాగా రికార్డు చేసింది. రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు ఎంత మేరకు అవసరం అవుతాయని అంచనా వేసింది. ఏఏ పంటలు, ఏఏ ప్రాంతాల్లో ఎంత సాగు చేశారు, ఎంత దిగుబడి రావచ్చన్న వివరాలు సర్కారు సేకరించింది. ఇకపోతే ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో పంటకు నష్టం కలిగితే రైతులను ఆదుకునేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసింది. జిల్లాలో చిరుధాన్యాల సాగు కూడా పెరుగుతోంది. 2,155.26 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగవుతుండగా, ఇందులో అండు కొర్రలు 0.11 ఎకరాలు, కొర్రలు 12.84 ఎకరాలు, జొన్న 74.15 ఎకరాలు, రాగి 2,155.26 ఎకరాలు, వరిగలు 0.5 ఎకరాలు, సజ్జలు 1,343.49 ఎకరాలు, సామలు 224.44 ఎకరాలు సాగవుతున్నాయి. అపరాలు 5,983.9 2 ఎకరాల్లో సాగవుతోంది. ఇందులో అనుములు 230 ఎకరాలు, అలసందలు 445.78 ఎకరాలు, ఉల వలు 4,069.55 ఎకరాలు, కందులు 1,071.92 ఎకరాలు, పెసలు 46.13 ఎకరాలు, మినుములు 116.1 ఎకరాలు, శనగలు రెండు ఎకరాలు, ఇతర అపరాల పంట 2.44 ఎకరాలు సాగవుతున్నాయి. వీటితోపాటు ఈ ఖరీఫ్ సీజన్‌లో నువ్వులు 17.204 ఎకరాలు, పొద్దుతిరుగుడు 2.64 ఎకరాలు, సోయాబీన్స్ 1.24 ఎకరాల్లో సాగు అవుతున్నాయి. ఆహారేతర నూనె గింజలు 28.21 ఎకరాలలోసాగు అవుతుండగా.. ఇందులో ఆముదం 1.75, గోగు నార 0.04, జనుం 0.36 ఎకరాలు, పత్తి 27.21 ఎకరాలలో సాగు చేస్తున్నారు. అలాగే జిల్లాలు వాణిజ్య పంటల కింద మొత్తం 15231.28 ఎకరాలు సాగు చేశారు. ఇందులో అవిశెలు 0.3 ఎకరాలు, చెరుకు నాటు 2,880.54, చెరుకు మర్దాం 12,350 ఎకరాలు సాగులో ఉంది. వేరుశనగ కూడా 36,224.75 ఎకరాల్లో సాగవుతోంది.



పంట వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

సిబ్బంది సమన్వయంతో..

జిల్లాలో సాగు చేసిన అన్ని రకాల పంటలను ఆర్బీకే సిబ్బందితోపాటు రెవెన్యూ సిబ్బంది, అధికారులు సమష్టి సహకారంతో ఈ-క్రాప్ నమోదు చేశారు. మండల వ్యవసాయాధికారులు, డివిజనల్ వ్యవసాయాధికారులు పర్యవేక్షణలో ఈ-క్రాప్ నమోదు జరిగింది. ఆ జాబితాలు రైతుల పరిశీలన కోసం రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించారు. రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన తరువాత పంట వివరాలు ప్రకటించారు.

ఆహార పంటల విస్తీర్ణం పెరగాలి

- 2050 నాటికి ప్రస్తుతం ఉన్న ఆహార ఉత్పత్తి రెట్టింపు కావాలి
- భూమిని చేరే వర్షపు నీటిని ఒడిసిపట్టాలి
- 'సాక్షి'తో ప్రపంచ బ్యాంక్ గ్రూప్ గ్లోబల్ మిషన్ లీడర్ అమల్ తాల్బి



సాక్షి, విశాఖపట్నం: నీటి కొరత పెరిగే కొద్దీ ప్రజల జీవన ప్రమాణాల్లో అనేక మార్పులు వస్తాయని ప్రపంచ బ్యాంక్ గ్రూప్ గ్లోబల్ మిషన్ లీడర్ అమల్ తాల్బి తెలిపారు. ముఖ్యంగా ఆహార కొరత వేధిస్తుందని చెప్పారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆకలి కేకలు తప్పవన్నారు. 2030 నాటికి 670 మిలియన్ల మంది ఆకలితో అలమటిస్తారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార పంటల విస్తీర్ణాన్ని పెంచాల్సి ఉందన్నారు. 2050 నాటికి ప్రస్తుతం ఉన్న ఆహార ఉత్పత్తి రెట్టింపయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అభివృద్ధి చెందిన దేశాల్లో 500 మిలియన్లకు పైగా ఉన్న వ్యవసాయ క్షేత్రాల నుంచి 80% వరకూ ఆహారం ఉత్పత్తవుతోందని తెలిపారు. పేదరికాన్ని జయించేందుకు ప్రపంచ బ్యాంక్ అత్యంత కీలక నిర్ణయాలను అమలు చేస్తోందన్నారు. విశాఖలో 25వ అంతర్జాతీయ కాంగ్రెస్, ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ 74వ అంతర్జాతీయ సమావేశాల్లో అమల్ తాల్బి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం 'సాక్షి'తో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. గత 50 ఏళ్లలో వర్షపాతం గణనీయంగా 233% పెరిగింది. అయితే.. భూమికి చేరుతున్న వర్షపు నీటిని ఒడిసి పట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నాం. ఈ కారణంగానే నీటి ఎద్దడి పెరుగుతోంది. వాతావరణంలో తలెత్తుతున్న 10 మార్పుల్లో 8 నీటికి సంబంధించినవే ఉంటున్నాయి. దీన్నిబట్టి చూస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది.

సుస్థిర లక్ష్యాలు నిర్దేశించుకున్నాం..

వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు ప్రపంచ బ్యాంక్ మిషన్ మొదలైంది. ప్రపంచవ్యాప్తంగా నీటి ఉత్పాదకత-సంరక్షణ, ఆహార ఉత్పత్తిని పెంపొందించడం తదితర అంశాలపై ప్రపంచ బ్యాంక్ సుస్థిర లక్ష్యాల్ని నిర్దేశించుకుంది. ఫార్మర్ లెడ్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ పేరుతో నీటిపారుదల రంగంలో స్థితిస్థాపకత, సాగునీటి నిర్వహణలో ఖచ్చితత్వం, నీటివనరుల అభివృద్ధి, మురుగు నీటి నిర్వహణ, సాగులో అత్యాధునిక పద్ధతులు, యాంత్రీకరణ తదితర అంశాలపై ఈ మిషన్ పనిచేస్తోంది. తొలి విడతలో ఆఫ్రికా దేశాల్లో 450 మిలియన్ యూఎస్ డాలర్లు ఖర్చు చేస్తున్నాం. ఈ మిషన్‌లో భాగంగా 77 మిలియన్ల మంది రైతులకు లబ్ధి చేకూరుస్తున్నాం. అక్కడ విధానాల్లో అనేక మార్పుల్ని తీసుకొచ్చాం. భవిష్యత్తులో మిగిలిన దేశాల్లోనూ ప్రపంచ బ్యాంక్ మిషన్‌ని అమలు చేస్తాం. తద్వారా నీటి ఎద్దడి, ఆహార సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాం.



దేహధారికి బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం ఎలా కలుగుతాయో, అలాగే మరో దేహం లభించడం కూడాను.
– హైందవ ధర్మం

సాక్షి
శనివారం, 4 నవంబర్ 2023

కృత్రిమ మేధపై మథనం!

సృష్టిలో నూతనత్వాన్ని ఆహ్వానించటం, హత్తుకోవటం, తలకెత్తుకోవటం మనిషి సహజ లక్షణం. అదే లేకుంటే ప్రపంచంలో ఇంత అభివృద్ధి సాధ్యమయ్యేది కాదు. కానీ కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ) విషయంలో మొదటినుంచీ అనుమాన దృక్కులు తప్పడం లేదు. ఆరంభంలో టెక్ సిబ్బందిని మాత్రమే వణికించిన ఏఐ ఇప్పుడు సమస్త జీవన రంగాల్లోకి చొచ్చుకొస్తూ అందరినీ భయపెడుతోంది. ఈ వారం చోటుచేసుకున్న రెండు పరిణామాలు ఈ భయసందేహాలు కేవలం అపోహల పర్యవసానం మాత్రమే కాదనీ, చేదు వాస్తవమనీ రుజువు చేస్తున్నాయి. వ్యూహాత్మకమైన అణుబాంబుల వ్యవస్థలోకి కూడా అది చొరబడితే ఏమవుతుందన్న ఆందోళనలు మొదలయ్యాయి. ఏఐకి కళ్లెం బిగించేందుకు ఉద్దేశించిన ఉత్తర్వులపై ఈ వారం మొదట్లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతకం చేయగా, బ్రిటన్‌లో ఈ విషయమై అమెరికా, చైనా, భారత్ సహా 28 దేశాలు పాల్గొన్న రెండు రోజుల శిఖరాగ్ర సదస్సు గురువారం ముగిసింది. ఇందులో ప్రభుత్వాల ప్రతినిధులతోపాటు కంప్యూటర్ శాస్త్రవేత్తలు, టెక్ దిగ్గజాల ప్రతినిధులు కూడా పాల్గొనటం సమస్య తీవ్రతను తెలియజెబుతోంది. ఏఐతో ఏర్పడే అవకాశాలతోపాటు, అందులో చోటుచేసుకుంటున్న నూతన ఆవిష్కరణలు మానవాళికి పెనుముప్పు కలిగించే ఆస్కారం ఉందన్న అంశంలో అన్ని దేశాల మధ్యా ఏకాభిప్రాయం కుదిరింది. శిఖరాగ్ర సదస్సుకు ఎంచుకున్న బ్లెచ్లీ పార్క్ చరిత్రాత్మకమైనది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో జర్మనీ రూపొందించి, దేశదేశాల్లోని తన సైనిక బలగాలకూ పంపే 'నిగూఢ సంకేతాన్ని' ఛేదించింది అక్కడే. అది పంపే సందేశాలేమిటో తెలియక కాకలు తీరిన నిపుణులే తలలు పట్టుకున్న తరుణంలో ఈ పరిణామం జర్మనీ కట్టడికి, రెండో ప్రపంచ యుద్ధ ముగింపునకు కారణమైంది.

'ముందొచ్చిన చెవుల కన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి' అన్న చందంగా ఏఐ తయారవటం వాస్తవం. అంతక్రితం మాటెలావున్నా ఏడెనిమిది నెలల క్రితం రంగంలోకొచ్చిన చాట్‌జీపీటీ అందరినీ ఒక్కసారి దిగ్భ్రమపరిచింది. దాన్నుంచి తేరుకునే లోగానే చాట్‌జీపీటీ–4 కూడా అందుబాటులోకొచ్చింది. దాని సాయంతో పాఠశాల, కళాశాలల విద్యార్థులు గణిత శాస్త్ర సమస్యలను క్షణాల్లో ఛేదిస్తున్నారనీ, మెదడుకు పదును పెట్టడం మానేశారనీ మొదట్లో వినగా... అమెరికావంటి దేశాల్లో ఏఐని ఉపయోగించి పరిశోధక పత్రాలు కూడా తయారు చేశారని తర్వాత బయటపడింది. లక్షల మంది బుర్రలు బద్దలుకొట్టుకునే జటిలమైన సమస్యకు ఏఐ క్షణంలో పరిష్కారం చూపుతుందనీ, దాని సాయంతో భారీ సొరంగాల తవ్వకాల్లో ఎదురయ్యే కష్టాలను అవలీలగా అధిగమించవచ్చనీ రుజువవుతూనే వుంది. ప్రయోజనాల సంగతి తేలినా పూర్తి స్థాయిలో వినియోగంలోకొస్తే ఏమవుతుందోనన్న బెంగ అందరిలోనూ గూడుకట్టుకుని వుంది. ఆ మధ్య స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులను సర్వే చేయగా, వారిలో మూడోవంతుకు మించి ఏఐ వల్ల అనర్థాలున్నాయని అభిప్రాయపడ్డారు. మొన్న మార్చిలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ వాజ్నిక్ సహా 1,300 మంది ఏఐ పరిశోధనలను ఆర్నెల్లపాటు నిలిపివేయాలని పిలుపునిచ్చారు. ఎవరు ఏం చెప్పినా వేలంవెర్రి ఆగదు. ఏఐ విషయంలో జరిగింది అదే. దానివల్ల కలిగే ముప్పేమిటో దాదాపు అన్ని దేశాల్లోనూ రుజువవుతూనే వుంది. క్షణాల్లో ఉన్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా చూపి మాయ చేయటం ఏఐకి చాలా సులభమని తేలిపోయింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ రష్యా అధ్యక్షుడు పుతిన్ సేనలకు దాసోహమంటున్న వీడియో కొన్నాళ్లు హల్‌చల్ చేసింది. 'నన్ను అడగకుండా, నా ప్రమేయం లేకుండా, నాకు అసలు తెలియకుండా ఏదో ఒకరోజు నన్ను ఏఐ ద్వారా దృశ్యబద్ధం చేసే ప్రమాదమున్నద'ని పేర్కొంటూ బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ న్యాయస్థానం తలుపుతట్టాడు. ఉత్తర్వులు కూడా పొందాడు.

దేనికైనా అనుకూల, ప్రతికూల అంశాలు రెండూ వుంటాయి. సాంకేతికత అనేది ఎప్పుడూ రెండువైపులా పదునున్న కత్తి. ఏఐతో ఒక మనిషికి జీవం పోయొచ్చు. వేలాదిమంది కుత్తుకలు తెగ్గొట్టవచ్చు. తులనాత్మకంగా చూస్తే మొదటి అంశంలో ఏఐ పురోగతి నత్తనడకన వుండగా... ఉద్దేశపూర్వకంగా, సమాజానికి నష్టం కలిగించే రీతిలో దాన్ని ఉపయోగించుకునే ధోరణులు వేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వాల నియంత్రణలు సృజనాత్మకతకు అవరోధమవుతాయని, కట్టడిలో మనుగడ సాగించే సమాజాలు ఎదగవని ఒకప్పుడు నమ్మేవారు. సామాజిక మాధ్యమాల రాకతో కాలం మారింది. ఇప్పుడు ప్రభుత్వాలే చడీచప్పుడూ లేకుండా వాటి సాయంతో జనంలో ఆమోదాన్ని సృష్టించుకుంటూ బతకనేరుస్తున్న వైనాన్ని చూస్తున్నాం. లాభార్జనే తప్ప మరేం పట్టని కార్పొరేట్ సంస్థల తీరు కూడా కళ్లముందే వుంది. కనుక ఏఐ నియంత్రణలో పాటించాల్సిన ధర్మాలేమిటో, పౌరుల గోప్యత పరిరక్షణకు ఏం చేయాలో, స్వీయభద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో నిర్ణయించటం అంత సులభం కాదు. అమెరికా వరకూ తీసుకుంటే బైడెన్ ఉత్తర్వులిచ్చారుగానీ, వాటిని పెద్దగా బలంలేని ప్రతినిధుల సభలో ఆమోదింపజేసుకోవటం కష్టమే. బ్రిటన్ కూడా సొంతానికి ఒక నిబంధనావళి రూపొందించుకుంది. చైనా, యూరోపియన్ యూనియన్‌లు సైతం అంతే. మన దేశం ఇంకా ఆ దిశగా నిర్ణయం తీసుకోలేదు. ఏదేమైనా అల్లావుద్దీన్ అద్భుత దీపం నుంచి బయటికొచ్చిన భూతాన్ని తెలివిగా వినియోగించుకోవటమెలాగో, అదుపు చేయటమెలాగో గ్రహించటం ప్రపంచానికి పెను సవాలే. దీన్ని మానవాళి ఎలా అధిగమిస్తుందో చూడాలి.

వాయు కాలుష్యానికి విరుగుడు

ఢిల్లీ మహానగరం ఇప్పటికే వాయుకాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతోంది. చలిని తట్టుకోవడానికి చలిమంటలు వేయడం, పంట పూర్తయిన తర్వాత కొయ్యకాళ్లను కాల్చడం, రవాణా వాహనాల నుంచి వచ్చే పొగ, అవి నిరంతరం లేపే ధూళి... ఇవన్నీ వాయు నాణ్యతను దారుణంగా తగ్గిస్తున్నాయి. పైగా రానున్నది దీపావళి పండుగ కావడంతో ఈ ఆందోళన మరింత పెరుగుతోంది. వాయు కాలుష్య సమస్య ఢిల్లీలో తీవ్రంగా ఉన్నప్పటికీ, దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లోనూ ఇది పట్టించుకోవాల్సిన అంశమే. ఈ తీవ్ర సమస్యను ఎదుర్కోవడానికి, ఉద్గారాల జాబితా అని చెబుతున్న కారకాల పరిమాణంపై కేవల సమాచారం సరిపోదు. ఈ ఉద్గారాల మూలాలపై డేటా అందుబాటులోకి వచ్చినప్పుడు మాత్రమే ప్రభావవంతమైన వ్యూహాలను అభివృద్ధి చేయవచ్చు. ప్రాథమికంగా ఉన్న సమాచారంతో కొన్ని సమర్థవంత మార్గాలనైతే చేపట్టవచ్చు.

మనం దీపావళికి దగ్గరవుతున్న కొద్దీ, గాలి నాణ్యత గురించిన ఆందోళన 'జాతీయ రాజధాని ప్రాంతం'(నేషనల్ క్యాపిటల్ రీజియన్ – ఢిల్లీ)లో ఊపందుకుంటుంది. ఈ ఏడాది కూడా అదే జరుగుతోంది. చలిని తట్టుకోవడానికి కలపను కాల్చడం, తదుపరి పంటకు నేలను సిద్ధం చేయడం కోసం పంట కోతల తర్వాత మిగిలిన చెత్తను తగులబెట్టడం, రవాణా వాహనాల నుంచి ఉద్గారాలు వెలువడటం, అనేక మూలాధారాల నుండి వచ్చే ధూళి కలిసి ఒక ప్రాణాంతక మిశ్రమాన్ని సృష్టిస్తాయి. కొన్నేళ్లుగా ప్రజలు తమ నివాసాల నుంచి బయటకు రావడం కూడా క్షేమకరం కాని పరిస్థితి. స్పష్టంగా చెప్పాలంటే, ఇది కొనసాగకూడదు. పరిష్కారాన్ని కనుగొనడానికి, ఢిల్లీ ప్రభుత్వం గాలి నాణ్యతా నిర్వహణ కోసం ఒక కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది.



ఈ తీవ్ర సమస్యను ఎదుర్కోవటానికి వ్యూహాలను రూపొందించడం కోసం, ఉద్గారాల జాబితా అని చెబుతున్న కాలుష్య కారకాల పరిమాణంపై కేవలం సమాచారం సరిపోదు. ఈ ఉద్గారాల మూలాలపై డేటా అందుబాటులోకి వచ్చినప్పుడు మాత్రమే ప్రభావవంతమైన వ్యూహాలను అభివృద్ధి చేయవచ్చు. వాటి కాలానుగుణమైన వైవిధ్యాలతోపాటు, ఈ ప్రతి ఒక్క మూలాధారం నుండి ఉద్గారాల వాటా ఎంత అనేది కీలకం. గాలి నాణ్యతా నిపుణులు దీనినే మూల విభజనగా సూచిస్తారు. సరళంగా చెప్పాలంటే, మనం ఎదుర్కొనే కాలుష్య స్థాయికి వివిధ కార్యకలాపాలు ఎలా కారణం అవుతున్నాయనేది ఇది మనకు తెలియజేస్తుంది.

ఈ ప్రతి మూలాధారం నుండి వచ్చే మొత్తం ఉద్గారాల వాటా ఏడాది పొడవునా లేదా రోజంతా కూడా స్థిరంగా ఉండదు. ఇంకా, అవి నగరంలోని వివిధ ప్రాంతాలలో కూడా మారుతూ ఉంటాయి. అందువల్ల, రోజులో ఏ సమయంలో లేదా సంవత్సరంలో ఏ కాలంలో, లేదా నగరంలోని ఏయే ప్రదేశాలలో కాలుష్యానికి దోహదపడుతున్నవి ఏమిటన్నది అర్థం చేసుకోవడం ముఖ్యం.

పనికొచ్చే అధ్యయనాలు

నిపుణులు మూలాలను కనుగొనడానికి ప్రయత్నించినప్పుడు సాధారణంగా నాలుగు ముఖ్యమైన అధ్యయనాలను సూచిస్తుంటారు. అవి: ఒకటి, ఢిల్లీ కోసం... ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కాన్పూర్ సమర్పించిన కాలుష్య మూలాల విభజన, మూలాల జాబితా (2015); రెండు, ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (తేరి) అధ్యయనం (2018); మూడు, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యయనం (2018); ఇక నాలుగవది, సిస్టమ్ ఆఫ్ ఎయిర్–క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రీసెర్చ్(సఫర్) అధ్యయనం (2018).

గాలి కాలుష్యానికి వివిధ కారకాలు అందిస్తున్న సాపేక్ష సహకారంలో గణనీయ స్థాయిలో సీజన్ పరమైన తేడాలు ఉన్నట్లు ఈ అధ్యయనాలు చూపుతున్నాయి. వేసవిలో, ధూళి ప్రభావం దాదాపు 31–34 శాతం వరకు పెరుగుతుంది. శీతాకాలంలో దాని వాటా 6–15 శాతం వరకు తగ్గుతుంది. వాహనాలు, పరిశ్రమలు, బయోమాస్ దహనం తోడ్పాటు శీతాకాలంలో దాదాపు 85–94 శాతం వరకు పెరుగుతుంది. ముఖ్యంగా ద్వితీయ కణాల వాటా (సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, అమ్మోనియా, అస్థిర కర్బన సమ్మేళనాలు వంటి దహన మూలాల నుండి వాతావరణంలో ఏర్పడేవి) శీతాకాలంలో 26–30 శాతంగా, వేసవిలో 15–17 శాతంగా ఉంటుంది.

స్పష్టంగా, రవాణా, రహదారిపై ధూళి అనేవి సంవత్సరం పొడవునా గాలి కాలుష్యానికి ముఖ్యమైన దోహదకారులు. అయితే, అధ్యయనాలు జరిగిన సమయంలో కొయ్యకాళ్ల దహనం ప్రధాన సమస్యగా లేదు. అందువల్ల దాని ప్రభావం గురించి తగినంత సమాచారం లేదు. అయినప్పటికీ, గాలి కాలుష్యానికి అధికంగా దోహదం చేస్తున్న కొయ్యకాళ్ల దహనం ఒక నెల వ్యవధిలో మాత్రమే జరుగుతుంది.

ఆకుపచ్చటి రోడ్లు

రహదారిపై ధూళిని తగ్గించడానికి, మోటారు వాహనాల నుండి ఉద్గారాలను తగ్గించడానికి తీసుకోగల చర్యలు దీర్ఘకాలికమైనవి. రహదారి దుమ్ముతో వ్యవహరించడానికి రోడ్డు పక్కలను పచ్చగా మార్చడం లేదా వాటిపై నీటిని చిలకరించడానికి గట్టి ప్రయత్నం అవసరం. ఢిల్లీ ప్రభుత్వం దీన్ని తప్పనిసరి చేయాలి.

రవాణా రంగం నుండి ఉద్గారాలను తగ్గించడానికి అనేక విధాలుగా ప్రయత్నించవచ్చు. వాటిలో ముఖ్యమైనది వ్యక్తిగత మోటారు వాహనాల నుండి ప్రజా రవాణాకు మారేలా గణనీయంగా ప్రభావితం చేయడం. ఢిల్లీ నగరంలో ఇప్పటికే 400 కిలోమీటర్ల మెట్రో రైలు నెట్‌వర్క్ పనిచేస్తుండగా, చిట్టచివరి గమ్యం వరకూ అనుసంధానం లేకపోవడం వల్ల దాని వినియోగానికి ఆటంకం ఏర్పడుతోంది. మెట్రో రైలు వ్యవస్థను పూర్తి చేయడానికి, పబ్లిక్ బస్సు వ్యవస్థలను విస్తృతంగా పెంచడం, మెరుగుపరచడం ఎంతగానో అవసరం. వ్యక్తిగత మోటారు వాహన వినియోగదారులు కూడా ఆకర్షితులయ్యేలా అధిక నాణ్యతా సేవలను అందించే స్థానిక బస్సు సేవలను నిర్వహించడం అవసరం.

ఇరుగుపొరుగు వారికి సేవ చేయడానికి స్థానిక సర్క్యులేటర్ సేవలను నిర్వహించడం కూడా సరైన దిశలో ఒక అడుగు. అత్యధికంగా ట్రాఫిక్ ఉండే రహదారులను గుర్తించడం ద్వారా వాటిని వన్‌వేలుగా మార్చడం, ట్రాఫిక్ ప్రవాహాన్ని సులభతరం చేయడానికి, పనిలేకుండా ఉన్న వాహనాల నుండి ఉద్గారాలను తగ్గించడానికి దోహదపడుతుంది. ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్‌ను (ఐటీఎంఎస్) పరిచయం చేయడం కూడా ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరచడానికీ, నిష్క్రియాత్మక ఉద్గారాలను తగ్గించడానికీ మరొక మార్గం. ఇటీవల ప్రతిపాదించిన ప్రీమియం బస్ అగ్రిగేటర్ పథకం సరైన దిశలో ఒక అడుగు.

పార్కింగ్ రుసుములను పెంచడంతోపాటు, రద్దీ సమయంలో అధికంగా వసూలు చేసే వ్యవస్థను ప్రవేశపెట్టడం వలన ప్రజలు వారి వ్యక్తిగత మోటారు వాహనాలను ఉపయోగించకుండా నిరోధించవచ్చు. ఎలక్ట్రిక్ చలనశీలతకు ఇటీవల ఏర్పడుతున్న ప్రాధాన్యత కూడా సరైన దిశలో మరొక అడుగు అని చెప్పాలి. ఎందుకంటే ఎలక్ట్రిక్ వాహనాలు వాస్తవంగా ఎటువంటి కాలుష్యాన్నీ విడుదల చేయవు.

చలికాలంలో పేదలకు ఆశ్రయాలు

మరొక ముఖ్యమైన కాలుష్య సహకారి ఏదంటే, ముఖ్యంగా చలికాలంలో వెచ్చగా ఉండటానికి పేద పౌరులు కట్టెలను కాల్చడం. ఈ సమస్యను తగ్గించడానికి, నిరాశ్రయులైన వారి కోసం పెద్ద సంఖ్యలో ఆశ్రయాలను ఏర్పర్చేందుకు అవకాశాలను అన్వేషించాలి. ఈ ఆశ్రయాలను స్వచ్ఛమైన శక్తి రూపాలను ఉపయోగించి వెచ్చగా ఉంచవచ్చు. ఇటువంటి ఆశ్రయాలు పేదలకు మరింత సౌకర్యవంతమైన గూడును అందించడంతోపాటు వాయు కాలుష్యాన్ని తగ్గించడం అనే ద్వంద్వ ప్రయోజనాలకు కూడా చక్కగా ఉపయోగపడతాయి. అనేక ఫ్లై ఓవర్ల కింద ఉన్న స్థలాన్ని దీని కోసం ప్రయోజనకరంగా ఉపయోగించవచ్చు.

ఇంకా, దీన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించడం కోసం రోజులో, సీజన్‌లలో, లొకేషన్లలో మూలాల విభజన డేటాను సేకరించే వ్యవస్థ అవసరం. ఢిల్లీలోని గాలి నాణ్యత సమస్యలను మరింత శాశ్వత ప్రాతిపదికన అంతం చేసేందుకు ఈ రకమైన సాధారణ డేటా ఉపయోగపడుతుంది. 'బిగ్ డేటా'కు ప్రాధాన్యత ఉంటున్న ఈ యుగంలో, ఇది ఎంతమాత్రమూ సమస్య కాకూడదు.

– అనిల్ బైజల్, ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్
– ఓపీ అగర్వాల్, ఇండియన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డీన్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బాబోయ్!



అఫ్గానిస్తాన్–పాకిస్తాన్ సరిహద్దులో జరుగుతున్న దాని విస్తృతి అర్థం కావడానికి మాత్రమే ఇది చెబుతున్నాను. విషాదాలను పోల్చడం లేదు. సంఖ్యలు సరైన దృక్కోణం ఇవ్వగలవు. గాజా మొత్తం జనాభా 22 లక్షలు. ఒక్క రాత్రిలో పాకిస్తాన్ స్థానభ్రంశం చేసిన అఫ్గాన్ శరణార్థుల సంఖ్య 17 లక్షలు.
– ఐమున్, కరాచీ వ్యాఖ్యాత

కొత్త సంపత్తి



కొందరు బెంగాలీ బ్లూ–కాలర్ వర్కర్ల (శ్రామికులు)తో మాట్లాడిన తర్వాత నాకొకటి అర్థమైంది... ఆర్థికంగా తక్కువ అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఇప్పుడు హిందీ అనేది అదనపు ఆశల భాష! హిందీ రావడం సమర్థతకూ, సంపత్తికీ చిహ్నంగా భావిస్తున్నారు... మధ్యతరగతి వాళ్లు ఇంగ్లీషు గురించి అనుకుంటున్నట్టుగానే.
– అనింద్యో చక్రవర్తి, జర్నలిస్ట్

పెద్దల దీవెన



కొన్ని వారాలుగా ఇండియాకు చెందిన ఒక పెద్దావిడ నా క్లినిక్‌కు వస్తోంది. ఇవ్వాళ నా కుటుంబం, పిల్లల గురించి అడిగింది. నాకు ఎనిమిదేళ్ల అబ్బాయి ఉన్నాడని చెప్పాను. 100 దిర్హామ్ తీసి, 'బేటా, నా తరఫున పిల్లాడికి ఇవ్వు' అంది. ఇది నాకు ఒకింత కల్చర్ షాక్! అయినా, 'అమ్మా, మీ ఆశీర్వాదం' అన్నాను.
– ఇద్రీస్ ముబారిక్, దుబాయి ఎండోక్రైనాలజిస్ట్

బతుకుతామా?



కాలుష్యపు నెలల్లో సెలవులు ప్రకటించడం లేదా ఇంటి నుంచి పనిచేసే వీలు కల్పించడం ఢిల్లీ ప్రభుత్వానికి ఎంత సాధ్యమో తెలీదుగానీ నేనైతే చచ్చిపోయేలా ఉన్నా.
– జె. గరిమ, వ్యాఖ్యాత

అసలైన సంతోషం



పీఈటీ స్కాన్ ప్రకారం, నాకు క్యాన్సర్ పోయిందని నిర్ధారణ కావడం సంతోషంగా ఉంది. అంటే నేను అవయవ దానం చేయొచ్చు. జుట్టును కూడా ఇచ్చే అవకాశం ఉన్నందుకు మరీ సంతోషం.
– నవజోత్ సిద్ధు, మాజీ ఎమ్మెల్యే

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

రష్యా సోషలిస్ట్ విప్లవం – ఎన్నికలు

అక్టోబర్ అనగానే 1917 (అక్టోబర్ 25) రష్యా సోషలిస్ట్ విప్లవం, దాని నాయకులు కామ్రేడ్ లెనిన్, కామ్రేడ్ స్టాలిన్‌లు గుర్తుకు వస్తారు. రష్యా విప్లవం ప్రపంచ శ్రామిక వర్గానికి గొప్ప ఉత్సాహం, ధైర్యం, ప్రేరణలను కలిగించింది. సోషలిస్ట్ విప్లవం విజయవంతం అయిన వెంటనే కింది నుండి శ్రామిక ప్రజాస్వామ్య వ్యవస్థ 'సోవియట్' వ్యవస్థను ప్రజల ప్రభుత్వ వ్యవస్థగా మార్చింది. కార్మిక వర్గ నాయకత్వంలో పీడిత వర్గాల కోసం ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా నూతన సోషలిస్ట్ రాజ్యాంగం ఏర్పాటు అయింది. సోషలిజం కమ్యూనిస్ట్ సమాజానికి తొలి దశ మాత్రమే. సోషలిజంలో శక్తి కొద్దీ పనీ, పనిని బట్టి ఫలితమూ ఉంటాయి. ఆ తరువాత 'శక్తి కొద్దీ పనీ, అవసరం మేరకు ఫలితం' అనే సూత్రం ప్రకారం పంపిణీ జరుగుతుంది. సామ్యవాద రష్యాలోనూ అదే జరిగింది.

వ్యక్తిగత ఆస్తిగా ఉన్న ఉత్పత్తి సాధనాలైన వ్యవసాయ భూమి, గనులు, యంత్రాలు వంటివి జాతీయం అయ్యాయి. పెట్టుబడిదారుల ఆస్తినీ, భూస్వాముల ఆస్తినీ మొదటగా జాతీయం చేశారు. చిన్న ఉత్పత్తి దారులు అయిన రైతులు, చిన్న పరిశ్రమలు నడిపే వారి ఆస్తులను రద్దు చేయడం కాకుండా క్రమంగా చైతన్య వంతం చేస్తూ వ్యక్తిగత ఆస్తి నుండి జాతీయం అయ్యే విధంగా మార్పునకు శ్రీకారం చుట్టారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ప్రభుత్వ క్షేత్రాలు, సమష్టి క్షేత్రాలు, వ్యక్తి గత ఆస్తి ఉన్నాయి. సమష్టి వ్యవసాయ క్షేత్రాల లోకి రాకుండా ఉండే చిన్న రైతులూ, చిన్న పరిశ్రమలు నడుపుకునే వారూ తమ ఇష్టాన్ని బట్టి వ్యవహరించడానికి అనుమతి ఇచ్చారు. ఏ రూపంలోనైనా ఆధిపత్య భావజాలాన్ని వ్యతిరేకిస్తూ సమానత్వ సంస్కృతిని అభివృద్ధి పరిచినారు.

బూర్జువా ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థకూ, సోషలిస్ట్ ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థకూ మధ్య తేడా ఉంటుంది. బూర్జువా ప్రజాస్వామ్య ఎన్నికలలో కోట్లు డబ్బును ఎరగా వేయడానికి అవకాశం ఉంది. కుల మత రాజకీయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. సోవియట్ ఎన్నికలలో వేల కోట్ల ప్రజల డబ్బును వృధా చేయడం కానీ; కుల, మత రాజకీయాలు కానీ లేకుండా ఎన్నికలు జరిగేవి. కింది నుంచీ విప్లవ కమిటీలూ, ప్రజా సంఘాలూ సోవియట్ (శ్రామిక ప్రభుత్వం)లను ఎన్నుకుంటాయి. కింది యూనిట్ తన పై యూనిట్ నూ, అది దాని పై యూనిట్‌నూ... ఇలా క్రమంగా కేంద్ర స్థాయి వరకూ ఈ ఎన్నిక విధానం కొనసాగేది. రైతాంగం, మహిళలు, కార్మికుల ప్రాతినిధ్యం తప్పనిసరిగా సోవియట్‌లలో ఉండే విధంగా ఎన్నికలు ఉండేవి. అలాగే కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుల ప్రాతినిధ్యం కూడా విధిగా ఉండేది.

ప్రజల నుండి ఎన్నికయ్యే సోవియట్ ఎన్నికల విధానం శ్రామిక ప్రజల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విధానాల అభివృద్ధికి ఉపయోగ పడింది. అదే నిజమైన శ్రామిక ప్రజాస్వామ్యం. ప్రపంచ జనాభాలో నాలుగవ వంతు సోషలిస్ట్ రాజ్యాలు నెలకొన్న గొప్ప అనుభవం నుండి ప్రపంచ వ్యాపితంగా వుండే కమ్యూనిస్టులు గుణపాఠాలు తీసుకోవడం తిరిగి పురోగమించడం తప్పనిసరిగా జరిగి తీరుతుంది.

– జంపన్న, మార్క్సిస్ట్ లెనినిస్ట్ నాయకుడు

మన సాంఘిక జీవనం సర్దుబాటు కోసం...

అభిప్రాయం




జాన్సన్ చోరగుడి

చిన్నతనంలో సాంఘిక శాస్త్రంలో 'అశోకుడు రోడ్ల పక్కన చెట్లు నాటించెను' అని చదివేవాళ్ళం. అది నిజమేకానీ, అశోకుడు నాటించింది చెట్లు కాదు– మొక్కలు. 'లీడర్' కేవలం 'పొలిటీషియన్' మాత్రమే కాకుండా – 'స్టేట్స్ మేన్' కూడా అయితే, అతడి ఆలోచనలు ఇలా రాబోయే తరాల కోసం ఉంటాయి. ఏపీ రెండవ సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికే 26 జిల్లాల్లో పట్టణాలు–గ్రామాలకు విస్తరిస్తున్నాయి. అభివృద్ధి అన్నప్పుడు... ఇది సముద్రతీర రాష్ట్రం కనుక, క్రమంగా 'కాస్మోపాలిటిన్'గా మారుతున్న మన జీవనశైలి వైపు 'రాజ్యం' ప్రత్యేక నిఘా దృష్టి కనుక పెట్టకపోతే, మనదైన సహజ సాంఘిక ప్రత్యేకతను మనం కోల్పోతాం. ఇప్పటికే అటువంటి క్షీణత మొదలయింది.

అభివృద్ధి తెస్తున్న – 'కాస్మోపాలిటన్' జీవనం దేశమంతా అన్ని ఆర్థికస్థాయి సమాజాల్లోకి ముంచుకొస్తుంటే, వాటిని ఎదుర్కోవడానికి ఆ యా సమాజాల పక్షంగా ప్రభుత్వాలూ, పౌరవేదికలూ అప్రమత్తం అవుతూనే ఉన్నాయి. అయితే, ఆర్థిక సంస్కరణల అమలును 1995 నాటికే ఆహ్వానించిన తెలుగునాట పరిస్థితి మిగతా వాటికి భిన్నమైనది. అప్పట్లో ఇక్కడ తొలివేటు సామాజిక శాస్త్రాల చదువుల మీద పడింది. నిజానికి 80వ దశకం మధ్యలోనే అన్ని గ్రూపులకు డిగ్రీ స్థాయిలో కొత్తగా మొదలయిన– 'కల్చర్ అండ్ హెరిటేజ్' పేపర్‌తో సహా 'సోషల్ సైన్సెస్' చదువుల్ని ప్రభుత్వం నీరుగార్చింది.

వీటి స్థానాల్లోకి పిల్లలు ఫీజులు కట్టి చదివే 'హైటెక్' కోర్సులు వచ్చాయి. అలా కొత్త తరాలకు క్లాస్ గదిలోనే – 'పౌరశాస్త్రాల స్పృహ' లేకుండా చేయడం జరిగింది. ఇది కేవలం సోయలేనితనంతో జరిగిందని చెప్పొచ్చు. ఎందుకంటే, అప్పట్లో– 'టూరిజం తప్ప మరే ఇజం లేదు' అని సాక్షాత్తూ ముఖ్యమంత్రి అనేవారు.

సరే, మరి తప్పిన దారిని సరిచేయడం ఎక్కడ మొదలెట్టాలి? అప్పట్లో 'మైక్రో ఫైనాన్స్' వ్యాపారం చేసే చీకటిశక్తులు గ్రామీణ కుటుంబ ఆర్థిక వ్యవస్థలోకి జొరబడి క్రమంగా అది – 'కాల్ మనీ' రాకెట్‌గా జుగుప్సాకరమైన రీతిలోకి రూపాంతరం చెందింది. ఇక బడుగుల నివాసాల మధ్య 'బెల్ట్ షాపులు' మాట అయితే సరేసరి. ఇటువంటివి ఊళ్లల్లోకి ఏ ఒక్క రోజో వచ్చినవి కాదు. అలాగే,



వీటి మూలాలను కుదుళ్లకంటా పెకలించడానికి అంతకంటే ఎక్కువ సమయం పడుతుంది. అయినా ఇవి ఒక ఐదేళ్ల కాలంలో పైకి కనిపించి, మరో ఐదేళ్ల కాలంలో అదృశ్యమయేవి అంతకంటే కాదు.

రెండున్నర ఏళ్ల 'కరోనా' కాలాన్ని దాటుకుని పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలుతో నాలుగో ఏడాదికి చేరిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ వ్యాసంలో పైన చర్చించిన కంటికి కానని రుగ్మతలను గుర్తించి వాటిని 'అడ్రెస్' చేయడానికి అడుగులు వేస్తున్నది.

'లీజర్ మేనేజ్మెంట్' అనేది ఆరోగ్యకర సమాజాల్లో అత్యవసరమైన ప్రక్రియ. అందుకు పార్కుల నిర్మాణం వంటివి సాధారణంగా మనకు పైకి కనిపించేవి. అయితే, నైపుణ్యాభివృద్ధి, నివాస ప్రాంతాల సమీపాల్లోనే ఉపాధి లభ్యత ఆర్థిక అంశం అయితే, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు వంటివి ఊళ్ళల్లో ఆబాల గోపాలానికి ఉత్సాహం నింపుతూ ఒక బృందం (టీమ్) పాటవ నిర్మాణానికి దారి తీసే అంశాలు. ఇందుకోసం రాష్ట్ర క్రీడా, సాంస్కృతిక శాఖ– 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో నవంబర్ 15 నుండి డిసెంబర్ 21 వరకు రాష్ట్ర వ్యాప్తంగా– క్రికెట్, కబడి, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడల్లో అన్ని వయసుల యువతీ యువకులకు పెద్ద ఎత్తున పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో గ్రామ స్థాయినుంచి రాష్ట్ర స్థాయి వరకు మూడు లక్షల మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఇందుకోసం గ్రామాల్లోని ప్రభుత్వ స్కూళ్ల కాలేజీల గ్రౌండ్స్ సిద్ధం చేస్తున్నారు. అందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది.

అలాగే రంగస్థల కళలను ప్రోత్సహిస్తూ 'ఏపీ ఫిల్మ్ థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్' ఈ ఏడాది చివర ఉత్తమ నాటకాలకు – 'నంది అవార్డులు' ప్రదానం చేయబోతోంది. మన రాష్ట్రంలో షూటింగులు జరిగే సినిమా యూనిట్లకు స్థానికంగా నటులు కనుక అవసరమైతే, వారి వివరాలతో ఈ సంస్థ – 'టాలెంట్ డాటా బ్యాంక్'ను సిద్ధం చేసింది. ఉదాహరణకు నెల్లూరు కృష్ణపట్నం పోర్టు వద్ద పనిచేస్తున్న సినిమా యూనిట్‌కు సబ్ ఇన్‌స్పెక్టర్ పాత్రకు ఒక జూనియర్ నటుడు కావాలనుకోండి. ఈ సంస్థ 'వెబ్ సైట్'లోని 'డేటా బ్యాంక్'లో వెతికితే, ఆ యూనిట్‌కు దగ్గర్లో ఆ పాత్ర పోషించే నటుల వివరాలు దొరుకుతాయి. ఈ ఆగస్టు నుంచి ఈ నటులకు సంస్థ 'ఐ.డి. కార్డు'లను జారీ చేస్తున్నది. ఇలా కొత్తవారికి అవకాశాలు అనేది మొదలయింది.

వ్యాసకర్త అభివృద్ధి, సామాజిక అంశాల వ్యాఖ్యాత

ఆఖరు క్షణం

రహస్యాలలో కెల్లా పెద్ద రహస్యం మృత్యువు. ఆ మృత్యువు గురించి నిజం తెలిసినవారు అరుదుగా ఉంటారు. వేదోపనిషత్తుల్లో అక్కడక్కడ దీని గురించిన ప్రస్తావన కానవస్తుంది. ముఖ్యంగా కఠోపనిషత్తులో 'నాచికేతోపాఖ్యానం' ఈ విషయం మీదే నడుస్తుంది. 'లిజన్, హ్యుమానిటీ' (మానవులారా, వినండి) అనే గ్రంథంలో మెహెర్‌బాబా మృత్యువు గురించిన చర్చ చేశారు.

చనిపోయే క్షణం ఎలా ఉంటుందో అని కొందరు వ్యక్తులు విపరీతంగా భయపడుతుంటారు. ఎందుకంటే, ఆ క్షణంలో భరించలేనంతగా బాధ కలుగుతుందని వారు అనుకొంటారు. వాస్తవం ఏమిటంటే, జబ్బుతో ఉన్నప్పుడుగానీ, మరెప్పుడైనా గానీ, అనుభవించిన దైహిక బాధలు ఏవైనా ఉంటే, అవి అన్నీ,



చనిపోయే ఆఖరు క్షణానికి ముందు పూర్తిగా అంతరించిపోతాయి. అందువల్ల మృత్యు సమయంలో మనిషి నరకయాతన అనుభవిస్తాడని అనటం ఒక మూఢ నమ్మకం. నిజం ఏమిటంటే, మనిషి శరీరాన్ని విడిచిపెట్టడం అనే ప్రక్రియ చాలా సులువుగా, ఏ మాత్రం నొప్పి లేకుండా జరుగుతుంది.

అయినప్పటికీ, ఈ భౌతిక ప్రపంచంతో ఆ వ్యక్తికి ఉన్న మానసిక ఉద్వేగభరితమైన బంధనాలను తెంచుకోవడం అంత తేలికగా జరిగే పని కాదు. వ్యక్తి చనిపోయాక మతపరమైన వివిధ కర్మకాండలను ఎందుకు నిర్వహిస్తారు? వాటి ప్రయోజనం ఏమిటి? అంటే, ఆ కర్మకాండలు చనిపోయిన వ్యక్తిని భౌతిక ప్రపంచంతో అతనికి వున్న బంధనాల నుండి విడిపించుతాయని.

ఉదాహరణకు, భగవంతుని నామాన్ని పునశ్చరణ చేయటమో, మత గ్రంథాన్ని పఠించటమో, చనిపోయిన వ్యక్తి బంధువులు చేస్తుంటారు. ఇలా చేయటం, మరణించిన వ్యక్తి మీదనే కాకుండా, అతడి బంధువుల మీద కూడా మంచి ప్రభావాన్ని కలుగజేస్తుందంటారు. ఎలాగంటే, అది వారి మధ్య ఉన్న సంస్కారాల బంధాన్ని తొలగించుకోవటంలో సహాయ పడుతుంది. అలా కాకుండా ఏడ్చి, పెడబొబ్బలు పెడితే వారి మధ్య గల బంధనాలను వదులు చేసే బదులు మరింతగా బిగుసుకుపోయేట్టు చేస్తాయవి. చనిపోయే ముందు క్షణంలో ఆ వ్యక్తికి ఉన్న ఆలోచన భగవంతుని గురించి గానీ, గురువు గురించి గానీ అయితే, ఆ వ్యక్తి మోక్షం పొందుతాడు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.సప్తమి రా.1.34 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** పునర్వసు ఉ.9.40 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** సా.6.22 నుండి 8.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.04 నుండి 7.33 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.06 నుండి 8.48 వరకు, తిరిగి తె.4.47 నుండి 6.31 వరకు (తెల్లవారితే ఆదివారం); **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.04, **సూర్యాస్తమయం:** 5.26.

జగనన్న ఆరోగ్య సురక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష

26 వ రోజు

నిర్వహించిన మొత్తం శిబిరాలు	11,845
నమోదైన ఓపీలు	56,58,982
నిర్వహించిన వైద్య పరీక్షలు	6,41,25,603
మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రెఫర్ చేసినవారి సంఖ్య	84,593


కాకినాడ జిల్లా సామర్లకోటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య సేవలు పొందుతున్న ప్రజలు


శ్రీకాకుళం జిల్లా మందస మండలం బెల్లుపటియాలో జగనన్న ఆరోగ్యసురక్షలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు


గుంటూరు జిల్లా తెనాలిలోని సుల్తానాబాద్‌లో టీబీ రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ మహిత


కర్నూలు నగరంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పోలీసులు

క్లుప్తంగా...

జీడీసీసీ బ్యాంక్‌లో మైక్రో ఏటీఎం వ్యవస్థ

ప్రారంభించిన మంత్రి కాకాణి



కొరిటిపాడు (గుంటూరు): నగదు రహిత చెల్లింపులతో రైతులకు ఆర్థిక లావాదేవీలు మరింత సులభతరం చేయడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని సహకార బ్యాంకుల్లో మైక్రో ఏటీఎం సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోకి వచ్చే అన్ని సంఘాల్లో మైక్రో ఏటీఎం వ్యవస్థకు మంత్రి శ్రీకారం చుట్టారు. శుక్రవారం బ్రాడీపేటలోని జీడీసీసీ బ్యాంకు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో భాగంగా తొలి దశ కింద నాబార్డ్, ఆప్కాబ్ సంయుక్త సహకారంతో ప్రయోగాత్మకంగా 65 మైక్రో ఏటీఎం సెంటర్లను ఆయన ప్రారంభించారు. బ్యాంక్ సీఈవో కృష్ణవేణి, బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, ఎమ్మెల్యే మద్దాళి గిరి పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పుల్లయ్య ప్రమాణం


పుల్లయ్య ప్రమాణస్వీకారోత్సవంలో ప్రసంగిస్తున్న భూమన కరుణాకర్‌రెడ్డి

సాక్షి, అమరావతి : అట్టడుగు వర్గాలకు అగ్రపీఠం వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నారని, ఆయనకు మనమంతా అండగా నిలుద్దామని టీటీడీ పాలక మండలి చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా తొండమల్ల పుల్లయ్య శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భూమన పాల్గొని ప్రసంగించారు. శాసన మండలి ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమన్వయ కర్త పుత్తా ప్రతాప్‌రెడ్డి, టీటీడీ పాలక మండల సభ్యుడు యానాదయ్య పాల్గొన్నారు.

విశాఖ నుంచి పాలన హర్షణీయం

బహుజన పరిరక్షణ సమితి నాయకులు


రిలే నిరాహార దీక్షలలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: డిసెంబర్‌లో విశాఖ కేంద్రంగా పరిపాలనకు సీఎం వైఎస్ జగన్ అడుగులు వేయడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నేతలు సంతోషం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం 1,132వ రోజుకు చేరాయి. నాయకులు మాట్లాడుతూ మరిదిని కాపాడేందుకు పురందేశ్వరి బీజేపీ ముసుగులో ఏపీ టీడీపీ అధ్యక్షురాలి అవతారం ఎత్తారని మండిపడ్డారు. సమితి నేతలు మాదిగాని గురునాథం, పులి దాసు, ఈపూరి ఆదాం, పెరికే వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బుద్దా వెంకన్నకు సీఐడీ నోటీసులు

న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యల కేసు

సాక్షి, అమరావతి: స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబుకు రిమాండ్ విధించిన న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో సీఐడీ వేగం పెంచింది. అలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు కార్యాచరణకు ఉపక్రమించింది. అందులో భాగంగా హైదరాబాద్‌లో ఉన్న టీడీపీ నేత బుద్దా వెంకన్నకు సీఐడీ శుక్రవారం నోటీసులు ఇచ్చింది. బుద్దా వెంకన్న, టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో సహా 23 మంది సోషల్ మీడియాలో న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్టుగా గుర్తించిన సీఐడీ వారందరినీ విచారించాలని నిర్ణయించింది. బుచ్చయ్య చౌదరికి కూడా ఒకట్రెండురోజుల్లో నోటీసులు జారీ చేయనుంది. నిందితులతో పాటు ఫేస్‌బుక్, ట్విట్టర్(ఎక్స్), గూగుల్ సంస్థలకు నోటీసులు జారీ చేసి విచారిస్తామని హైకోర్టుకు తెలిపింది.

'విజయ'ను అమూల్‌కు ఇవ్వడం సరికాదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

చిత్తూరు కార్పొరేషన్ : రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. ఆమె శుక్రవారం చిత్తూరులో బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. పురందేశ్వరి మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి ఎంతో సహకారం అందిస్తోందన్నారు. విజయ డెయిరీని ప్రభుత్వ సహకారంతో పునఃప్రారంభించకుండా అమూల్‌కు లీజుకు ఇవ్వడం సరికాదన్నారు.

ర్యాలీలు అంటే.. బెయిల్ ఇచ్చే వాళ్లమా?

- చంద్రబాబు బహిరంగ ర్యాలీలు నిర్వహించడం, పాల్గొనడం చేయరాదు
- అదనపు షరతులు అవసరం లేదన్న బాబు వాదనను తిరస్కరించిన హైకోర్టు



సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో నిందితుడు నారా చంద్రబాబు నాయుడుకు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యంతర బెయిల్ మంజూరు సందర్భంగా విధించిన షరతులకు అదనంగా ఎలాంటి షరతులు విధించాల్సిన అవసరం లేదన్న చంద్రబాబు వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. ఎక్కడా బహిరంగ ర్యాలీలు నిర్వహించడం గానీ, అందులో పాల్గొనడం గానీ చేయరాదని చంద్రబాబును హైకోర్టు ఆదేశించింది. అలాగే బహిరంగ సభల్లో కూడా పాల్గొనరాదని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించి ఎలాంటి బహిరంగ వ్యాఖ్యలు చేయకూడదని కూడా ఆయన్ను ఆదేశించింది. చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ మంజూరు సమయంలో విధించిన షరతులకు అదనంగా తాజా షరతులు వర్తిస్తాయని స్పష్టం చేసింది. కోర్టు షరతులను ఉల్లంఘించకుండా చంద్రబాబు కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఇద్దరు డీఎస్పీలను అనుమతించాలన్న సీఐడీ అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తెల్లాప్రగడ మల్లికార్జునరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సహేతుక ఆంక్షలే..

స్కిల్ స్కామ్ కేసులో అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించిన చంద్రబాబుకు కంటి శస్త్రచికిత్స నిమిత్తం హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా విధించిన షరతులకు అదనంగా మరిన్ని షరతులు విధించాలని కోరుతూ సీఐడీ అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. చంద్రబాబుకు కేవలం ఆరోగ్య పరిస్థితి ఆధారంగానే మధ్యంతర బెయిల్ మంజూరు చేసినట్లు తాజా ఉత్తర్వుల్లో న్యాయమూర్తి పునరుద్ఘాటించారు. ఆరోగ్య పరిస్థితి ఆధారంగా ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను కస్టోడియల్ బెయిల్‌తో సమానంగా పరిగణించడానికి వీల్లేదని ఉత్తర్వుల్లో స్పష్టతనిచ్చారు. 'చంద్రబాబును చూడకుండా ప్రజలను నియంత్రిస్తూ ఈ కోర్టు ఆదేశాలు జారీ చేయజాలదు. మధ్యంతర బెయిల్ పిటిషన్‌లో చంద్రబాబు ఎక్కడా ర్యాలీలు, బహిరంగ సభల నిర్వహణకు అనుమతినివ్వాలని కోరలేదు. మెడికల్ బెయిల్‌కు అదనంగా బహిరంగ సభలు, ర్యాలీల నిర్వహణకు చంద్రబాబు అనుమతి కోరి ఉంటే ఆ పరిస్థితులకు అనుగుణంగా ఈ కోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చేదా? అనే ప్రశ్న తలెత్తుతోంది. మా ముందున్న ఆధారాలను పరిశీలించిన తరువాత రాజకీయ ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించకుండా చంద్రబాబును ఆదేశించేందుకు ఈ కోర్టు సుముఖత చూపుతోంది. ఇది చంద్రబాబు ప్రాథమిక హక్కులను హరించడం కాదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. ఇది కోర్టు విధిస్తున్న సహేతుక ఆంక్ష మాత్రమే. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న తరువాత మధ్యంతర బెయిల్ మంజూరు సమయంలో ఈ నెల 31న విధించిన షరతులకు అదనంగా ఈ షరతులు విధిస్తున్నాం' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఎంని రుషికొండకు వెళ్లొద్దంటారా?

- పిటిషనర్‌కు సుప్రీం కోర్టు చీవాట్లు
- లింగమనేని పిటిషన్‌ను కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం



సాక్షి, న్యూఢిల్లీ : విశాఖలోని రుషికొండ నిర్మాణాలపై జోక్యం చేసుకోవడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. ముఖ్యమంత్రిని రుషికొండకు వెళ్లొద్దంటారా అంటూ పిటిషనర్‌ను నిలదీసింది. రాజకీయ పరిష్కారాలకు కోర్టుకు ఎందుకు వస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. రుషికొండలో సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటుకు వ్యతిరేకంగా లింగమనేని శివరామ ప్రసాద్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)తో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా పిటిషనర్‌కు పలు ప్రశ్నలు వేసింది. ముఖ్యమంత్రిని రుషికొండకు వెళ్లొద్దంటారా అంటూ సీజేఐ ఘాటుగా స్పందించారు. ఇందులో ప్రజా ప్రయోజనం ఏముందని ప్రశ్నించారు. రాజకీయ పరిష్కారాలకు కోర్టు వేదిక కారాదని వ్యాఖ్యానించారు. రుషికొండ నిర్మాణాలపై జోక్యం చేసుకోబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టు, జాతీయ హరితట్రిబ్యునల్ ఆదేశాలపై సీజేఐ ఆరా తీశారు. ఈ తరహా కేసులను హైకోర్టు తేల్చగలదని అన్నారు. హైకోర్టు లేదా ఎన్జీటీలకు వెళ్లాలని పిటిషనర్‌కు సూచించారు. హైకోర్టుకు వెళ్తామని పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. అనంతరం కేసు డిస్మిస్ చేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

బడుగులకు రాజ్యాధికారం సాకారమైంది

ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఫలం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను వృద్ధిలోకి తెస్తున్న సీఎం జగన్
- చంద్రబాబు ఒక్క మైనార్టీకీ మంత్రిగా అవకాశం ఇవ్వలేదు
- జగన్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం, నలుగురేసి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు
- ఓ మైనార్టీ మహిళను మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌గా చేశారు
- నాలుగున్నరేళ్లలో మైనార్టీలకు రూ.23,176 కోట్ల లబ్ధి చేకూర్చారు
- మాచర్ల సామాజిక సాధికార సభలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా
- బడుగు, బలహీనవర్గాలకు సీఎం జగన్ అధిక శాతం పదవులిచ్చారు : ఎమ్మెల్యే అనిల్


సామాజిక సాధికార యాత్రలో భాగంగా మాచర్లలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా. వేదికపై ప్రజాప్రతినిధులు, నేతలు


సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

సాక్షి, నరసరావుపేట: భారత దేశ చరిత్రలో నినాదాలుగానే మిగిలిపోయిన సామాజిక సాధికారత, బడుగులకు రాజ్యాధికారాన్ని సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా చెప్పారు. ఇది బడుగు, బలహీనవర్గాలకు సీఎం జగన్ అందించిన ఫలమని అన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం సాయంత్రం పల్నాడు జిల్లా మాచర్లలోని పార్క్ సెంటర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు ఎలా మేలు చేసిందో వివరించారు. 70 శాతం ఉన్న బడుగు, బలహీన వర్గాలను ఓటు బ్యాంక్‌గా చూసిన సీఎంలను గతంలో చూశామని, సీఎం వైఎస్ జగన్ మాత్రమే ఈ వర్గాలకు సామాజికంగా, ఆర్థికంగా అవకాశాలు కల్పించి వృద్ధిలోకి తెస్తున్నారని అన్నారు. చంద్రబాబు పాలనలో ఒక్క మైనార్టీకి మంత్రిగా అవకాశం ఇవ్వలేదని, ఈ ప్రభుత్వంలో తనను డిప్యూటీ సీఎంగా చేశారని, నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు, ఓ మైనార్టీ మహిళను మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌గా చేసిన ఘనత జగనన్నదేనని తెలిపారు. నాలుగున్నరేళ్లలో మైనార్టీలకు రూ.23,176 కోట్ల లబ్ధి కలిగించారని చెప్పారు. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలను రాజ్యాధికారం వైపు నడిపిస్తున్న సీఎంకు అండగా నిలవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేయాలన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాస్ట్ కాదని, వెన్నెముక వంటి బ్యాక్‌బోన్ క్లాస్ అని సీఎం వైఎస్ జగన్ బీసీలను అక్కున చేర్చుకొని, అన్నింటా పెద్దపీట వేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు డిప్యూటీ సీఎం పదవులతో పాటు పూర్తి అధికారాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారన్నారు. ఎంపీ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్, నామినేటెడ్ పదవుల్లో చరిత్రలో మరే సీఎం చేయని విధంగా అధిక శాతం పదవులు ఇచ్చారన్నారు. నలుగురు బీసీలను సీఎం జగన్ రాజ్యసభకు పంపడం విశేషమన్నారు. నందిగం సురేష్ వంటి పేదింటి వ్యక్తిని పార్లమెంట్‌కు పంపిన ఘనత జగనన్నదేనని అన్నారు. బీసీలకు జడ్జి పోస్టులు వద్దని లేఖ రాసిన ఘనుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. సీఎం జగన్ పేదింటి పిల్లలను అంతర్జాతీయ స్థాయి ఇంగ్లిష్ మీడియం చదువులు చదివిస్తున్నారని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. రాజధాని ప్రాంతంలో బడుగు, బలహీనవర్గాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, వారికి గూడు కల్పించాలని జగనన్న కలలు కన్నారన్నారు. వీటన్నింటినీ ఓర్వలేని చంద్రబాబు కోర్టులకు వెళ్లి వాటిని అడ్డుకోవాలని కుట్రలు పన్నుతున్నారన్నారు. చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తరతరాలుగా ద్వితీయ శ్రేణి మనుషులుగా బతుకుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను నా వాళ్లు అంటూ ఆప్యాయంగా పిలిచి, వారి ఉన్నతికి పాటు పడుతున్న సీఎం వైఎస్ జగన్ అని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు చెప్పారు. చంద్రబాబు సీఎంగా ఉండగా ఎస్టీలకు ఒక్క మంత్రి పదవీ ఇవ్వలేదన్నారు. జగన్ డిప్యూటీ సీఎం ఇవ్వడంతోపాటు, ట్రైబల్ కమిషన్ ఏర్పాటు చేశారని, ఎస్టీలకు ఎమ్మెల్సీ పదవీ ఇచ్చారన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా రాష్ట్రంలో ఏకంగా 3.26 లక్షల ఎకరాల భూమిని ఈ ప్రభుత్వం గిరిజనులకు అందజేసిందన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కేంద్రంలోని ప్రభుత్వాలు కుల గణన చేస్తామని కాకమ్మ కథలు చెప్పాయని, సీఎం జగన్ దాన్ని ఆచరణలో పెడుతున్నారని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. సీఎం జగన్ పల్నాడుకు మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నారని, వరికపూడిసెలకు అనుమతులు సాధించారని, రూ.3 వేల కోట్లతో హైలు అభివృద్ధి చేయించారని, కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. మరోసారి అవకాశం ఇస్తే పల్నాడు రూపురేఖలే మారుస్తామని చెప్పారు.


పల్నాడు జిల్లా మాచర్లలో సామాజిక సాధికార యాత్ర సందర్భంగా భారీ బైక్ ర్యాలీ

వెల్లివిరిసిన సామాజిక చైతన్యం

ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నేతృత్వంలో పల్నాడు జిల్లా మాచర్లలో జరిగిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రలో సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. సాయంత్రం 5 గంటలకు రెంటచింతల నుంచి వందలాది వాహనాలతో బైక్ ర్యాలీ ప్రారంభమైంది. రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, నందిగం సురేష్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. యాత్రకు వేలాది ప్రజలు పూల వర్షంతో స్వాగతం పలికారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మాచర్ల శివారు నుంచి పాదయాత్రగా పట్టణంలోని పార్క్ సెంటర్ వద్దకు చేరుకున్నారు. మాచర్ల నేతలు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం భారీ జన సందోహం మధ్య సభ ప్రారంభమైంది. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, ఇతర వర్గాల పేదలకు చేస్తున్న మేలును నేతలు వివరిస్తున్నప్పుడు ప్రజలు పెద్దపెట్టున జై జగన్ అంటూ నినాదాలు చేశారు. 'మా నమ్మకం నువ్వే జగన్.., జగన్ రావాలి– జగనే కావాలి' 'వై నాట్ 175 ' అంటూ నినదించారు.

నేడు సత్యసాయి, గుంటూరు, విజయనగరం జిల్లాల్లో సామాజిక సాధికార యాత్ర

సాక్షి, అమరావతి: గత 53 నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును వివరించడానికి వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఈ యాత్ర ఏడో రోజు శనివారం సత్యసాయి జిల్లా ధర్మవరం, గుంటూరు జిల్లా గుంటూరు తూర్పు, విజయనగరం జిల్లా శృంగవరపుకోట నియోజకవర్గాల్లో జరుగుతుంది.

బీజేపీని టీడీపీకి తాకట్టు పెడుతున్న పురందేశ్వరి

వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి/రెంటచింతల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పదవుల కోసమే బీజేపీలో చేరి, ఆ పార్టీని టీడీపీకి తాకట్టు పెట్టడానికి పని చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమెకు బీజేపీపై ప్రేమ లేదన్నారు. నాలుగుసార్లు పార్టీలు మారిన చరిత్ర పురందేశ్వరిది అని ఎద్దేవా చేశారు. ఎయిర్ ఇండియా ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా కేంద్రంలో బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఆ విమానయాన సంస్థ అమ్మకంలో మధ్యవర్తిత్వం చేసి ఆమె ముడుపులు తీసుకున్నది వాస్తవం కాదా.. అని ప్రశ్నించారు. ఆమె నిజాయితీని నిరూపించుకోవడానికి సీబీఐ విచారణకు సిద్ధమేనా, ఆ మేరకు కేంద్రానికి లేఖ రాయగలరా.. అని నిలదీశారు. 'ఏపీలో మద్యం స్కాం అంటూ ఆరోపణలు చేస్తున్న మీరు.., మీ భర్త వెంకటేశ్వరరావు, కుమారుడు హితేష్, గీతం భరత్ మద్యం సిండికేట్ బ్రోకర్లతో బేరాలాడి ముడుపులు తీసుకున్నది నిజం కాదా..' అని ప్రశ్నించారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అత్యంత ఖరీదైన విల్లాను ఎలా నిర్మిస్తున్నారని, దానికి సొమ్ములు పెడుతున్నది ఎవరని ప్రశ్నించారు.

వెనుకబడిన వర్గాలకే మొదటి ప్రాధాన్యం

రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు మంచి జరగాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని విజయసాయిరెడ్డి చెప్పారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రలో భాగంగా శుక్రవారం పల్నాడు జిల్లా రెంటచింతలలో డ్వాక్రా సభ్యులు, వివిధ వ్యాపార వర్గాలు, రైతులు, నర్సరీ నిర్వాహకులకు, ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు, కాంట్రాక్టు అధ్యాపకులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు పాల్గొన్నారు.

మిరియం.. ఆదాయం ఘనం

- కాఫీ తరువాత గిరి రైతుకు ప్రధాన ఆధారం
- అంతర పంటగా లక్ష ఎకరాల్లో సాగు
- గతేడాది కిలో రూ.400 ధర
- ఈ ఏడాది పిందెలతో పాదులు కళకళ

జిల్లాలో ప్రధాన పంట అయిన కాఫీలో అంతరపంటగా సాగు చేస్తున్న మిరియం పాదులు ఈ ఏడాది విరగ్గాశాయి. మార్కెట్ పరిస్థితులు కూడా అనుకూలంగా ఉన్నందున మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని గిరి రైతులు ఆశిస్తున్నారు. స్పైసెస్ బోర్డు కూడా వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తోంది.



సాక్షి,పాడేరు : పాడేరు డివిజన్ పరిధిలో కాఫీ మాదిరిగానే అంతర పంటగా సాగు చేస్తున్న మిరియం కూడా గిరి రైతులకు మంచి ఆదాయ వనరు. పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో సుమారు 2.10 లక్షల ఎకరాల్లో కాఫీ సాగు అవుతోంది. ఇందులో 1.56 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు ఫలసాయం ఇస్తున్నాయి. ఈ తోటల్లో అంతర పంటగా సుమారు లక్ష ఎకరాల్లో మిరియంను సాగు చేస్తున్నారు. కాఫీ తోటకు నీడనిచ్చే సిల్వర్ ఓక్ వృక్షాలకు మిరియం పాదులను ఎక్కించి పండిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉన్నందున పాదులు పిందెలతో కళకళలాడుతున్నాయి. మరో రెండు నెలల్లో పక్వానికి వస్తాయి.

జనవరి నుంచి సేకరణ..

జనవరి నుంచి పచ్చి మిరియా సేకరణ ప్రారంభమవుతుంది. ఎకరా విస్తీర్ణంలో సుమారు 50 వరకు పాదులు ఉంటాయి. ప్రతి పాదుకు నాలుగు కిలోల చొప్పున ఎండిమిరియాలు దిగుబడి వస్తాయి. గతేడాది కిలో మిరియం రూ.400కు గిరి రైతులు విక్రయించారు. ఈ ఏడాది కూడా అదే ధర ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్పైసెస్ బోర్డు కూడా రైతులకు అవసరమైన స్థాయిలో సహకారం అందించి ప్రోత్సహిస్తోంది.

నాణ్యమైన ఉత్పత్తి లక్ష్యంగా..

నాణ్యమైన మిరియాల ఉత్పత్తులను సాధించే దిశగా రైతులకు శుద్ధీకరణ యంత్రాలను అందజేస్తోంది. శుద్ధీకరణ యంత్రం ఖరీదు రూ.31,700 కాగా ఇందులో 75 శాతం రాయితీ పోగా మిగతా మొత్తాన్ని రైతులు చెల్లించారు. గతేడాది పాడేరు డివిజన్‌లో 82 యూనిట్లను రైతులకు పంపిణీ చేశారు. యంత్రాల వినియోగం, మిరియాల శుద్ధీకరణకు సంబంధించి గత మూడేళ్లలో 3వేల మంది రైతులకు శిక్షణ ఇచ్చారు.

మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తాం

మిరియం రైతులు ఇప్పుడిప్పుడే మంచి ఫలితాలు సాధిస్తున్నారు. నాణ్యమైన ఉత్పత్తులు సాధించడంతో మన్యం మిరియానికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. లాభదాయకమైన ధర పొందేందుకు అవసరమైన మార్కెటింగ్ సదుపాయంపై అవగాహన కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది కూడా యంత్రాలు పంపిణీ చేస్తాం.

– కల్యాణి, స్పైసెస్ బోర్డు ఫీల్డు ఆఫీసర్, పాడేరు

గిట్టుబాటు ధర కల్పిస్తాం

పాడేరు ఐటీడీఏ పరిధిలోని కాఫీ తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్న మిరియాల పాదులు పిందెలతో ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఏడాది మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. స్పైసెస్ బోర్డు ద్వారా రైతులకు సహకారం అందించి ప్రోత్సహిస్తున్నాం. మిరియంకు గిట్టుబాటు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

–వి.అభిషేక్, పీవో, ఐటీడీఏ, పాడేరు

క్లుప్తంగా...



తారీఖ్ పే తారీఖ్
వాయిదాలపై చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఆవేదన

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో న్యాయమూర్తులు పదేపదే కేసు వాయిదాలు కోరుతుండటంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ శుక్రవారం తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. అత్యున్నత న్యాయస్థానం 'తారీఖ్ పే తారీఖ్ (వాయిదాల మీద వాయిదా)'కోర్టుగా మారకూడదన్నదే తన ఉద్దేశమన్నారు. పదేపదే కేసుల వాయిదా కోరొద్దని న్యాయవాదులకు సూచించారు. ''సెప్టెంబర్, అక్టోబర్లలో కలిపి కేవలం రెండు నెలల్లోనే లాయర్లు ఏకంగా 3,688 వాయిదా కోరారు. ఈ ఒక్క రోజే (శుక్రవారం) మా ముందు ఏకంగా 178 వాయిదా విజ్ఞప్తులున్నాయి! ఏమిటిది?''అంటూ ప్రశ్నించారు. ''అత్యవసరమైతే తప్ప ఇలా వాయిదాలు కోరకండి. లేదంటే కోర్టులపై ప్రజలకు నమ్మకమే పోయే ప్రమాదముంది''అని ఆవేదన వెలిబుచ్చారు. తారీఖ్ పే తారీఖ్ బాలీవుడ్ హిట్ సినిమా దామినిలోని పాపులర్ డైలాగ్. అందులో హీరో సన్నీడియోల్ లాయర్. తను వాదిస్తున్న కేసు వాయిదాలపై వాయిదాలు పడుతుంటే ఆక్రోశంతో అతను చెప్పే ఈ డైలాగ్ సీజేఐ నోట రావడం విశేషం.

మహిళా రిజర్వేషన్ బిల్లు...
ఆ భాగాన్ని కొట్టేయలేం: సుప్రీం

న్యూఢిల్లీ: ఇటీవలే పార్లమెంటు ఆమోదం పొందిన మహిళల రిజర్వేషన్ బిల్లులో 'జనగణన అనంతరం అమల్లోకి వస్తుంది'అని పేర్కొంటున్న భాగాన్ని కొట్టేయడం చాలా కష్టమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు కేంద్రానికి నోటీసులిచ్చేందుకు తిరస్కరించింది. నారీ శక్తి వందన్ అధినియమ్ పేరుతో తెచ్చిన మహిళా బిల్లును రానున్న సాధారణ ఎన్నికల్లోపే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ నాయకురాలు జయా ఠాకూర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టి ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ జరిపింది. దీన్ని ఈ అంశంపై దాఖలైన మరో పిటిషన్‌తో పాటు నవంబర్ 22న విచారిస్తామని పేర్కొంది. లోక్‌సభలోనూ, అసెంబ్లీల్లోనూ మూడో వంతు స్థానాలను మహిళలకు రిజర్వు చేస్తూ కేంద్రంలో బీజేపీ సర్కారు సెప్టెంబర్ 21న ఈ బిల్లు తేవడం తెలిసిందే. దానికి పార్లమెంటుతో పాటు రాష్ట్రపతి ఆమోదముద్ర కూడా లభించింది. ఇక మెజారిటీ రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదమే మిగిలింది. ఇది నిజంగా మంచి ముందడుగని ధర్మాసనం అభిప్రాయపడింది.

రాజ్యసభ చైర్మన్‌కు క్షమాపణ చెప్పండి
ఆప్ ఎంపీ ఛద్దాకు సుప్రీం నిర్దేశం

న్యూఢిల్లీ: సెలెక్ట్ కమిటీ వివాదంలో రాజ్యసభ చైర్మన్‌కు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని సస్పెండైన ఆప్ ఎంపీ రాఘవ్ ఛద్దాకు సుప్రీంకోర్టు సూచించింది. ఆయన క్షమాపణలను చైర్మన్ సానుభూతితో పరిశీలించగలరని ఆశాభావం వెలిబుచ్చింది. రాజ్యసభ నుంచి తనను నిరవధికంగా సస్పెండ్ చేయడాన్ని సవాలు చేస్తూ ఛద్దా పెట్టుకున్న పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఛద్దాకు సభ గౌరవాన్ని తగ్గించే ఉద్దేశం లేదని ఆయన తరఫు న్యాయవాది ధర్మాసనానికి నివేదించారు. ఆయన రాజ్యసభలో అత్యంత పిన్న వయస్కులన్న అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. ఈ అంశంలో రాజ్యసభ చైర్మన్‌కు క్షమాపణలు చెప్పేందుకు ఛద్దా సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. దాంతో ఆ మేరకు ఆయనకు సూచిస్తూ విచారణను వాయిదా వేసింది. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ అపాయింట్‌మెంట్ కోరినట్లు ఎంపీ రాఘవ్ ఛద్దా తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు లోబడి ధన్‌ఖడ్‌ను క్షమాపణ కోరుతానని ఆయన చెప్పారు. తనపై సస్పెన్షన్‌కు సంబంధించిన అంశంపై కలుసుకునేందుకు త్వరగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు ఆయన 'ఎక్స్'లో తెలిపారు.

కల్నల్ నియామకాల్లో మహిళలకు అన్యాయం...
నిబంధనలకు విరుద్ధం: సుప్రీం

న్యూఢిల్లీ: మహిళా అధికారులకు కల్నల్‌గా పదోన్నతి కల్పించేందుకు సైన్యం నిరాకరించడం నిబంధనలకు విరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తమకు కల్నల్‌గా ప్రమోషన్ ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మహిళా సైనికాధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస మనోజ్ మిశ్రా ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. మహిళా సైనికాధికారులు సైనయంలో తమకు న్యాయంగా రావాల్సిన ప్రమోషన్లు, బాధ్యతలను చిరకాలం పాటు పోరాడి మరీ సాధించుకున్నారని అభిప్రాయపడింది. కల్నల్ ప్రమోషన్ల విషయంలో మహిళా అధికారుల రహస్య వార్షిక నివేదిక (సీఆర్)లకు సైన్యం కటాఫ్ తేదీని వర్తింపజేసిన తీరు వారికి అన్యాయం చేసేదిగా ఉందంటూ ఆక్షేపించింది. కనుక కల్నల్ ప్రమోషన్ల ప్రక్రియను 15 రోజుల్లోగా తాజాగా చేపట్టాలని సైన్యాన్ని ఆదేశించింది. లింగ వివక్షకు తావులేకుండా మహిళా సైనికాధికారులకు కూడా కల్నల్ తదితర పదోన్నతులు కల్పించాలంటూ 2020లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించడం తెలిసిందే. నేవీలో కూడా దీన్ని వర్తింపజేయాలంటూ కొద్ది రోజులకే మరో తీర్పు వెలువరించింది. సాయుధ దళాల్లో మహిళల పట్ల వివక్షకు చరమగీతం పాడేందుకు తమ తీర్పులు తోడ్పడతాయని ఆ సందర్భంగా వ్యాఖ్యానించింది.

కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు...
దేవుళ్లం అనుకుంటున్నారు

అహ్మదాబాద్: కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు తమను తాము దేవుళ్లుగా భావించుకుంటున్నారంటూ అలహాబాద్ హైకోర్టు మండిపడింది. వాళ్లు సాధారణ ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నారంటూ ఆవేదన వెలిబుచ్చింది. అహ్మదాబాద్‌లో రాత్రిపూట వెళ్తున్న ఓ జంట నుంచి ట్రాఫిక్ పోలీసులు బెదిరించి డబ్బుల వసూలు చేశారంటూ వచ్చిన వార్తలను కోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, న్యాయమూర్తి జసిస్ అనిరుద్ధ పి.మాయీ ధర్మాసనం దీనిపై శుక్రవారం జరిపింది. ఈ సందర్భంగా తీవ్ర వ్యాఖ్యలు చేసింది. పోలీసులపై ఫిర్యాదు చేసేందుకు ఉద్దేశించిన హెల్ప్‌లైన్‌ను కలెక్టర్ కార్యాలయంలో మాత్రమే ఉంచడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ''పోలీసులపై ఫిర్యాదు చేయాలంటే సామాన్యులు మీ కార్యాలయాల ముందు వరుస కట్టాలా? వారిని లోపలికి అనుమతించేదెవరు? మామూలు జనానికి పోలీస్ స్టేషన్లో కాలు పెట్టడమే కష్టం. ఇక పోలీస్ కమిషనర్, కలెక్టర్ కార్యాలయాల్లోకి వెళ్లడమైతే దాదాపుగా అసాధ్యం! మీ కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు దేవుళ్లలా, రాజుల మాదిరిగా ప్రవర్తిస్తారు. ఇవన్నీ క్షేత్రస్థాయి వాస్తవాలు. ఇంతకుమించి మాట్లాడేలా మమ్మల్ని రెచ్చగొట్టొద్దు''అని జస్టిస్ అగర్వాల్ అన్నారు. పోలీసులపై ఫిర్యాదులకు గ్రీవెన్స్ సెల్‌తో పాటు హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేయాలని, అందరికీ తెలిసేలా దాన్ని ప్రచారం చేయాలని గత విచారణ సందర్భంగా జారీ చేసిన ఆదేశాలు అమలు కాకపోవడంపై ధర్మాసనం అసంతృప్తి వెలిబుచ్చింది.

ఉత్తర భారతదేశంలో భూప్రకంపనలు
నేపాల్‌లో తీవ్ర భూకంపం .. రిక్టర్ స్కేల్‌పై 6.4గా నమోదు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీతోపాటు ఉత్తర భారతదేశంలో శుక్రవారం రాత్రి భూప్రకంపలను సంభవించాయి. నేపాల్‌లో సంభవించిన తీవ్ర భూకంపం ఉత్తర భారతదేశంపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. భయాందోళనకు గురైన జనం ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు తెలియరాలేదు. ఉత్తర ప్రదేశ్, బిహార్, హరియాణా, పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో భూమి కంపించినట్లు తెలిసింది. నేపాల్‌లో భూకంపం రిక్టర్ స్కేల్‌పై 6.4గా నమోదయ్యింది. శుక్రవారం రాత్రి 11.32 గంటలకు నేపాల్‌లో భూకంపం సంభవించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ(ఎన్‌సీఎస్) వెల్లడించింది. భూకంప కేంద్రం భూఉపరితలం నుంచి 10 కిలోమీటర్ల లోతున ఉన్నట్లు తెలియజేసింది. నేపాల్‌లో భూకంపం చోటుచేసుకోవడం గత నెల రోజుల వ్యవధిలో ఇది మూడోసారి. నేపాల్‌లో తాజా భూకంపంలో ఎంతమంది చనిపోయారన్నది తెలియరాలేదు.

చక్రబంధంలో గాజా సిటీ!



హమాస్ అడ్డాను చుట్టుముట్టిన ఇజ్రాయెల్ సైన్యం

మిలిటెంట్లపై కొనసాగుతున్న భూతల, వైమానిక దాడులు ● గాజాలో ఇప్పటివరకు 9,200 మందికిపైగా మృతి

ఖాన్ యూనిస్/జెరూసలేం/న్యూఢిల్లీ: గాజాలో హమాస్ మిలిటెంట్లతో హోరాహోరీ పోరు కొనసాగుతోందని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. తమ పదాతి సేనలు, వైమానిక దళాలు శత్రువులపై ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాయని, ప్రశంసనీయమైన విజయాలు సాధిస్తున్నాయని హర్షం వ్యక్తం చేసింది. మిలిటెంట్ల దాడులను తమ జవాన్లు గట్టిగా తిప్పికొడుతున్నారని పేర్కొంది. శుక్రవారం జరిగిన దాడుల్లో చాలామంది మిలిటెంట్లు హతమయ్యారని, వారి సొరంగాలు నామరూపాల్లేకుండా పోయాయని తెలియజేసింది. గాజా సిటీలో దాడులు ఉధృతం చేయబోతున్నామని ప్రకటించింది. ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణలో మృతుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. శుక్రవారం నాటికి గాజాలో 9,200 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారు. గాజాలో మిలిటెంట్ల అధీనంలో ఉన్న 240 మంది బందీల ఆచూకీ కోసం ఇజ్రాయెల్ సైన్యం ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం అమెరికా డ్రోన్లను ఉపయోగిస్తోంది. ఈ డ్రోన్లు గత వారం రోజులుగా గాజా ఉపరితలంపై చక్కర్లు కొడుతున్న దృశ్యాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి.

గాజాని చుట్టుముట్టాం: ఇజ్రాయెల్

గాజాలో ప్రధాన నగరం, హమాస్ మిలిటెంట్ల ముఖ్యమైన అడ్డా అయిన గాజా సిటీని తమ సేనలు చుట్టుముట్టాయని ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి డేనియల్ హగారీ ప్రకటించారు. భూతల దాడులు ప్రారంభమైన వారం రోజుల తర్వాత గాజా సిటీ చుట్టూ తమ దళాలు పూర్తిస్థాయిలో మోహరించినట్లు తెలిపారు. గాజాలో కాల్పుల విరమణ పాటించాలంటూ ప్రపంచ దేశాల నుంచి తమపై ఒత్తిడి వస్తున్నట్లు వెలువడుతున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు.

నల్ల బ్యాగుల్లో తిరిగి వెళ్తారు: హమాస్

గాజాలో ఇజ్రాయెల్ సైన్యానికి దారుణ పరాజయం ఎదురు కాబోతోందని హమాస్ మిలిటరీ విభాగమైన ఖాసమ్ బ్రిగేడ్స్ స్పష్టం చేసింది. తమ భూభాగంలో అడుగుపెట్టిన ఇజ్రాయెల్ సైనికులు నల్ల బ్యాగుల్లో తిరిగి వెళ్తారని హెచ్చరించింది. తద్వారా వారికి తమ చేతుల్లో చావు తప్పదని పేర్కొంది.

కాల్పుల విరమణ లేదు: నెతన్యాహూ

హమాస్ మిలిటెంట్ల చెరలో ఉన్న బందీలందరినీ విడుదల చేసే దాకా గాజాలో కాల్పుల విరమణ ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ తేల్చిచెప్పారు. మానవతా సాయం గాజాకు చేరవేయడానికి, విదేశీయులను బయటకు పంపించడానికి వీలుగా తాత్కాలికంగా కాల్పుల విరమణ పాటించాలన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అభ్యర్థనపై ఆయన స్పందించారు. నెతన్యాహూ శుక్రవారం అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్‌తో సమావేశమైన అనంతరం మీడియాతో మాట్లాడారు.

పాలస్తీనియన్లను కాపాడండి

గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో సామాన్య పాలస్తీనియన్లు మరణిస్తుండడం పట్ల అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఆందోళన వ్యక్తం చేశారు. గాజాలో ప్రజలను కాపాడడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్‌కు విజ్ఞప్తి చేశారు. లేకపోతే 'శాంతికి భాగస్వాములు' ఎవరూ ఉండరని చెప్పారు. గాజాను శ్మశానంగా మార్చొద్దని పరోక్షంగా తేల్చిచెప్పారు. గాజాకు భారీస్థాయిలో మానవతా సాయం అవసరమని, ఆ దిశగా ఇజ్రాయెల్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించాలని అన్నారు. ప్రపంచ దేశాలు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న మానవతా సాయాన్ని గాజాలోకి విస్తృతంగా అనుమతించాలని, ఈ విషయంలో ఆంక్షలు తొలగించాలని చెప్పారు. ఆంటోనీ బ్లింకెన్ శుక్రవారం ఇజ్రాయెల్‌లో పర్యటించారు.

పవిత్ర యుద్ధం చేస్తున్నాం: హసన్ నస్రల్లా



ఇజ్రాయెల్‌పై దాడుల విషయంలో అమెరికా హెచ్చరికలు తమను భయపెట్టలేవని లెబనాన్‌కు చెందిన షియా మిలిటెంట్ సంస్థ 'హెజ్బొల్లా' అధినేత హసన్ నస్రల్లా పేర్కొన్నారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధానికి హెజ్బొల్లా దూరంగా ఉండాలంటూ అమెరికా చేసిన హెచ్చరికలపై ఆయన శుక్రవారం స్పందించారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం మొదలైన తర్వాత ఆయన మాట్లాడడం ఇదే తొలిసారి. ఇజ్రాయెల్‌పై తొలుత దాడిచేసిన హమాస్‌పై ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. ఇజ్రాయెల్‌పై పవిత్ర యుద్ధంలో త్యాగాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు. మధ్యధరా సముద్రంలో అమెరికా సైనిక బలగాలను చూసి తాము బెదిరిపోవడం లేదని అన్నారు. తమ దగ్గర బలమైన సైన్యం ఉందని, అన్నింటికీ సిద్ధపడే ఇజ్రాయెల్‌పై దాడులు చేస్తున్నట్లు నస్రల్లా పేర్కొన్నారు. నస్రల్లా ప్రస్తుతం ఎక్కడున్నారో తెలియదు. ఆయన ప్రసంగాన్ని టీవీల్లో ప్రసారం చేశారు.



ఇజ్రాయెల్ నుంచి పాలస్తీనా కార్మికులు వెనక్కి

తమ దేశంలో పని చేస్తున్న పాలస్తీనియన్ కార్మికులను వారి సొంత ప్రాంతమైన గాజాకు పంపించాలని ఇజ్రాయెల్ నిర్ణయించింది. శుక్రవారం పదుల సంఖ్యలో కార్మికులను గాజాకు పంపించింది. భారమైన హృదయంతో వారు వెనక్కి వెళ్లిపోయారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య అక్టోబర్ 7 నుంచి ఘర్షణ మొదలైంది. అంతకంటే ముందు 18,000 మంది పాలస్తీనియన్లకు ఇజ్రాయెల్ ప్రభుత్వం వర్క్ పర్మిట్లు జారీ చేసింది. వారిలో చాలామంది ఇజ్రాయెల్‌కు చేరుకొని, వేర్వేరు పనుల్లో కుదురుకున్నారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో పాలస్తీనియన్లు వెనక్కి వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ ఆదేశించింది.

ఛత్తీస్ సీఎంకు రూ. 508 కోట్ల ముడుపులు

- ఓ బెట్టింగ్ యాప్ నుంచి అందాయి: ఈడీ
- క్యాష్ కొరియర్ వాంగ్మూలమిచ్చినట్టు వెల్లడి
- ఫోరెన్సిక్ విశ్లేషణలో విస్తుగొలిపే నిజాలు బయట పడ్డాయన్న దర్యాప్తు సంస్థ
- అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు చిక్కులు
- మోదీ సర్కారు నాటకమంటూ ఎదురుదాడి

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల వేళ ఛత్తీస్‌గఢ్‌లో అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ. ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌కు ఓ బెట్టింగ్ సంస్థ నుంచి ఏకంగా రూ.508 కోట్ల ముడుపులు అందినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం సంచలన ప్రకటన చేసింది. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిమిత్తం సదరు బెట్టింగ్ సంస్థ యూఏఈ నుంచి కాంగ్రెస్ పార్టీకి భారీగా డబ్బులు పంపుతోందని వెల్లడించింది. ''గురువారం అదుపులోకి తీసుకున్న ఓ క్యాష్ కొరియర్ ఈ మేరకు వాంగ్మూలమిచ్చాడు. అతని మొబైల్‌తో పాటు బెట్టింగ్ సంస్థ ఉన్నతోద్యోగి ఈ మెయిల్స్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపగా ఈ విస్తుగొలిపే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి''అని పేర్కొంది. ఛత్తీస్‌లో నవంబర్ 7న తొలి దశ పోలింగ్ జరగనున్న వేళ ఈ ఉదంతం కాంగ్రెస్‌కు తీవ్రంగా నష్టం చేసేలా కనిపిస్తుండటంతో ఆ పార్టీ హుటాహుటిన రంగంలోకి దిగింది. ఇవన్నీ నిరాధార ఆరోపణలని ఖండించింది. ఎన్నికల వేళ తమను ఇబ్బంది పెట్టేందుకే కేంద్రంలోని బీజేపీ ఇలా దర్యాప్తు సంస్థలను తమపైకి ప్రయోగించిందని ఆరోపించింది. తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందని దుయ్యబట్టింది.

ఈడీ ఏం చెప్పిందంటే...

ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో అసీమ్ దాస్ అనే క్యాష్ కొరియర్‌ను గురువారం అదుపులోకి తీసుకునట్టు ఈడీ తన ప్రకటనలో వెల్లడించింది. ''అతని కారులో, నివాసం నుంచి రూ.5.39 కోట్ల నగదు దొరికింది. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల ప్రచార ఖర్చుల నిమిత్తం యూఏఈకి చెందిన మహదేవ్ బెట్టింగ్ యాప్ అనే సంస్థ ప్రమోటర్లు అతని ద్వారా ఈ సొమ్ము పంపిస్తున్నట్టు తేలింది. బఘేల్‌కు అందజేసేందుకే ఈ మొత్తాన్ని తీసుకెళ్తున్నట్టు అతను విచారణలో అంగీకరించాడు. అతని నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్‌ను, శుభం సోని అనే యాప్‌కు చెందిన ఉన్నతోద్యోగి పంపిన ఈ మెయిల్‌ను ఫోరెన్సిక్ పరీక్షకు పంపగా విస్తుగొలిపే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. సీఎం బఘేల్‌కు ఇప్పటికే విడతలవారీగా రూ.508 కోట్ల దాకా సదరు బెట్టింగ్ యాప్ నుంచి అందినట్టు తేలింది'' అని ఈడీ వివరించింది. ఈ ఉదంతంపై, క్యాష్ కొరియర్ స్టేట్‌మెంట్ తదితరాలపై మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉందని తెలిపింది. అలాగే మహదేవ్ యాప్ కంపెనీకి చెందిన బినామీ బ్యాంకు ఖాతాలోని రూ.15.59 కోట్లను జప్తు చేసినట్టు ఈడీ వివరించింది. దీనికి సంబంధించి భీమ్ యాదవ్ అనే పోలీస్ కానిస్టేబుల్‌ను కూడా అరెస్టు చేశారు. ''సదరు కానిస్టేబుల్ గత మూడేళ్లలో పలుమార్లు యూఏఈ వెళ్లి బెట్టింగ్ యాప్ ప్రమోటర్లు రవి ఉప్పల్, సౌరభ్ చంద్రాకర్‌లను కలిశాడు. అతని ప్రయాణ ఖర్చులు తదితరాలను యాప్‌కు చెందిన మనీ లాండరింగ్, ట్రావెలింగ్ కంపెనీయే భరించింది''అని ఈడీ ఆరోపించింది. యాదవ్, దాస్‌లను పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టులో హాజరు పరిచి తదుపరి విచారణ నిమిత్తం ఏడు రోజుల కస్టడీకి తీసుకుంది.

రూ.450 కోట్లకు పైగా జప్తు

మహదేవ్ బెట్టింగ్ యాప్ ప్రమోటర్లు ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. విదేశాల్లో తిష్టవేసి భారత్‌లోని తమ బంధుమిత్రుల ద్వారా బెట్టింగ్ వ్యవహారం నడుపుతున్నట్టు సమాచారం. ఈ ఉదంతంలో ఈడీ ఇప్పటికే నలుగురిని అరెస్టు చేసి ఇప్పటిదాకా రూ.450 కోట్లకు పైగా జప్తు చేసుకుంది. 14 మందిని నిందితులుగా చేరుస్తూ ఇటీవలే చార్జిషీట్ కూడా దాఖలు చేసింది.

> **ప్రతిష్టను దెబ్బతీసేందుకే: బఘేల్**
>
> 
>
> ఈడీ ఆరోపణలపై సీఎం బఘేల్ తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఇదని ఆరోపించారు. అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న వేళ ఈడీ దురుద్దేశపూరిత ఆరోపణలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌ను ఎదుర్కోలేని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. ఈడీ, ఐటీ, సీబీఐల సాయంతో ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలోకి వచ్చేందుకు వీరు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.



శుక్రవారం ఢిల్లీ-గురుగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌వేపై కమ్మేసిన పొగమంచు


కాలుష్యం కోరల్లో ఢిల్లీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా పడిపోయింది. శుక్రవారం ఉదయం 'తీవ్రమైన ప్లస్' కేటగిరీకి చేరిందని అధికారులు వర్గాలు వెల్లడించాయి. మితిమీరిన కాలుష్యంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నగరాన్ని పొగ మంచు కమ్మేసింది. కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. గురువారం ఉదయం ఢిల్లీలో 346గా ఉన్న వాయు నాణ్యత సూచి(ఏక్యూఐ) సాయంత్రం కల్లా 418కు చేరిందని కాలుష్య నియంత్రణ బోర్డు వెల్లడించింది. శుక్రవారం ఉదయం ఏకంగా 450గా నమోదైందని తెలియజేసింది. లోధీ రోడ్, జహంగీర్‌పురి, ఆర్కే పురం, ఇందిరా గాంధీ ఎయిర్‌పోర్టులో వాయు నాణ్యత సూచి 438, 491, 486, 473గా ఉన్నట్లు పేర్కొంది. నగరాన్ని పొగ మంచు కమ్మేసిన డ్రోన్ దృశ్యాలను వార్తా సంస్థ ఏఎన్ఐ ట్విట్టర్‌లో పోస్టు చేసింది. కాలుష్య తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఢిల్లీలో పలు ఆంక్షలు అమలు చేస్తున్నారు. నిర్మాణ పనులపై ఆంక్షలు విధించారు. లైట్ కమర్షియల్ వాహనాలు, డీజిల్ ట్రక్కుల రాకపోకలను నిషేధించారు. భవన నిర్మాణ పనులను, కూల్చివేతలను నిషేధిస్తున్నట్లు ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ ప్రకటించారు.

> **పొరుగు రాష్ట్రాల్లోనూ కాలుష్య భూతం**
>
> కాలుష్యం కేవలం ఢిల్లీకే పరిమితం కావడం లేదు. రాజస్తాన్‌లోని హనుమాన్‌గఢ్, భివాడీ, శ్రీగంగానగర్, హరియాణాలోని హిసార్, ఫతేబాద్, జింద్, రోహ్‌తక్, బహదూర్‌గఢ్, సోనేపట్, కురుక్షేత్ర, కర్నాల్, ఖైతాల్, ఫరీదాబాద్, గురుగ్రామ్, ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్, బాఘ్‌పట్, మీరట్, నోయిడా, గ్రేటర్ నోయిడా తదితర ప్రాంతాల్లోనూ వాయు నాణ్యత దిగజారింది.

కర్ణాటకలో కుర్చీలాట!

- సీఎం, డిప్యూటీ సీఎం వర్గాల మధ్య మాటల యుద్ధం
- ఐదేళ్ల పాటు తానే సీఎం అన్న సిద్ధరామయ్య
- హైకమాండ్‌దే తుది నిర్ణయమన్న డీకే శివకుమార్



సిద్ధరామయ్య



శివకుమార్

సాక్షి, బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు పెరుగుతోంది. ఎవరికి వారు వర్గాలుగా మారి సీఎం కుర్చీపై టార్గెట్ పెట్టారు. ఇందులో ముఖ్యంగా సిద్ధరామయ్య వర్గం, డీకే శివకుమార్ వర్గం పేర్లు కీలకంగా వినిపిస్తున్నాయి. ఈ సమయంలో గురువారం హోసపేట నగరంలో సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ రానున్న ఐదేళ్ల పాటు తానే సీఎంగా కొనసాగుతానని వ్యాఖ్యలు చేయడంతో డీకే శివకుమార్ వర్గం నోటిలో పచ్చి వెలక్కాయ పడ్డట్లయ్యింది. రెండున్నరేళ్ల తర్వాత అధికార మార్పిడితో తాను సీఎం అవుతానని ఆశలు పెట్టుకున్న డీకే శివకుమార్‌కు ఈ వ్యాఖ్యలు మింగుడు పడడం లేదు. ముఖ్యమంత్రిగా ఆరు నెలలు పూర్తి చేసుకున్న సిద్ధరామయ్య రానున్న ఐదేళ్లపాటు తానే సీఎంగా కొనసాగుతానని నర్మగర్భంగా వ్యాఖ్యలు చేయడంపై రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. సీఎం వ్యాఖ్యలపై అనుకూల, ప్రతికూల వ్యాఖ్యానాలను రాజకీయ విశ్లేషకులు చేస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో ఈ వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండున్నరేళ్ల తర్వాత తానే సీఎం అనే ఆశలతో ఉన్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాత్రం తాను కేవలం హైకమాండ్ మాట మాత్రమే వింటానని, ఎవరేమి చెప్పినా పట్టించుకోనని తెలిపారు. ఇదే సమయంలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా అధిష్టాన నిర్ణయమే శిరోధార్యమని బాహాటంగా వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ లోలోపల ఎవరి వర్గానికి వారు మద్దతు ప్రకటిస్తూ వస్తున్నారు. ఈ విషయంపై మంత్రి ప్రియాంక్ ఖర్గే శుక్రవారం మైసూరులో విలేకరులతో మాట్లాడుతూ సీఎం వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని, ఎవరిని కొనసాగించాలి, ఎవరికి అడ్డుకట్ట వేయాలనే విషయం తమ అధిష్టానం చూసుకుంటుందని తెలిపారు. మరో మంత్రి కేఎన్ రాజణ్ణ శుక్రవారం తుమకూరులో మాట్లాడుతూ మాజీ డిప్యూటీ సీఎం, హోం మంత్రి పరమేశ్వరకు కూడా సీఎం అయ్యే అర్హత ఉందని పేర్కొన్నారు. తుమకూరులో హోం మంత్రి పరమేశ్వర మాట్లాడుతూ సీఎం వ్యాఖ్యలపై తాను స్పందించబోనని చెప్పారు. అధికార పంపిణీ కేవలం సీఎం, డీసీఎం మధ్యజరిగిన చర్చ అని, అసలు ఢిల్లీలో ఎలాంటి ఒప్పందం జరిగిందనే విషయంపై వారిద్దరికే స్పష్టమైన అవగాహన ఉందని, అలాంటప్పుడు ఇది సత్యం, ఇది అబద్ధమని తానే వ్యాఖ్యలు చేయడం సరి కాదని అన్నారు. అయితే రామనగర ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ మాత్రం డీసీఎం డీకే శివకుమార్‌కు మద్దతు పలికారు.

> **పోస్టు ఖాళీగా లేదు కదా!**
>
> ఖాళీగా లేని ముఖ్యమంత్రి పదవిపై అవసరంగా చర్చ సాగుతోందని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సోదరుడు, ఎంపీ డీకే సురేశ్ అన్నారు. ఇలాంటి చర్చకు అర్థం లేదని వ్యాఖ్యానించారు. 'ప్రస్తుతం సిద్ధరామయ్య సీఎంగా ఉన్నారు. సీఎం పోస్టు ఖాళీగా లేదు. ఆ పదవి ఖాళీగా ఉన్నప్పుడు మాత్రమే దీనిపై చర్చించాలి. ఇప్పుడు మాట్లాడుకోవడం వల్ల లాభం ఏమిటి?' అని వ్యాఖ్యానించారు.

అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ 97 వేల మంది భారతీయులు పట్టివేత

వాషింగ్టన్: 2022 అక్టోబర్–2023 సెప్టెంబర్ కాలంలో అమెరికాలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన 96,917 మంది భారతీయులు పట్టుబడినట్లు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్(యూసీబీపీ) తెలిపింది. ఇటీవల అక్రమంగా ప్రవేశించిన భారతీయుల సంఖ్య అయిదు రెట్లు పెరిగిందని పేర్కొంది. 2019–20లో 19,883 మంది పట్టుబడగా ఈ సంఖ్య 2020–21లో 30,662కు చేరిందని, 2021–22లో 63, 927కు పెరిగిందని వివరించింది. 2022 అక్టోబర్–2023 సెప్టెంబర్ మధ్యన దొరికిపోయిన వారిలో కెనడా సరిహద్దుల్లో 30,010 మంది, మెక్సికో సరిహద్దుల్లో మరో 41,770 మంది ఉన్నారని తెలిపింది. యువత అత్యధికంగా 84 వేల మంది వరకు ఉన్నట్లు పేర్కొంది. ఒంటరిగా వచ్చి మరో 730 మంది మైనర్లు కూడా ఉన్నట్లు వివరించింది.

ఢిల్లీ మంత్రి నివాసాల్లో 23 గంటలపాటు ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు ఢిల్లీ సామాజిక, ఎస్సీ/ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు రాజ్‌కుమార్ ఆనంద్ నివాసాలు, కార్యాలయాల్లో 23 గంటలపాటు సోదాలు నిర్వహించారు. గురువారం ఉదయం ప్రారంభమైన ఈ సోదాలు శుక్రవారం ఉదయం ముగిశాయి. మంత్రిపై మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద ఈడీ దర్యాప్తు సాగిస్తోంది. ఆయన అంతర్జాతీయ హవాలా లావాదేవీలకు పాల్పడినట్లు, తప్పుడు పత్రాలతో రూ.7 కోట్లకుపైగా పన్ను ఎగ్గొట్టినట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) చార్జిషీట్ దాఖలు చేసింది. ఆ తర్వాత కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తు ఈడీ పరిధిలోకి వచ్చింది. తనను వేధించడమే పనిగా పెట్టుకుందని ఈడీపై మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్ మండిపడ్డారు.

ఇరాన్‌లో ఘోర అగ్ని ప్రమాదం.. 32 మంది మృత్యువాత

టెహ్రాన్: మాదకద్రవ్యాలకు బానిసలుగా మారిన వారి కోసం ఏర్పాటైన పునరావాస కేంద్రంలో సంభవించిన అగ్నిప్రమాదంలో 32 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న లంగ్రాడ్ నగరంలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటన చోటుచేసుకున్న పునరావాస కేంద్రంలో 40 మందికి వసతి కల్పిస్తున్నారు. అయితే, ప్రమాద సమయంలో సిబ్బంది సహా అందులో ఎందరున్నదీ వెల్లడి కాలేదు. ఘటనలో 32 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికార వార్తా సంస్థ తెలిపింది. మంటలను అదుపులోకి తెచ్చినట్లు పేర్కొంది. ఘటనపై ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. భద్రతా ప్రమాణాలను పాటించకపోవడం, కాలం చెల్లిన మౌలిక వసతుల కారణంగా దేశంలో తరచూ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

తమిళనాడు మంత్రి ఇళ్లపై ఐటీ దాడులు

చెన్నై: తమిళనాడు రాష్ట్ర మంత్రి ఈవీ వేలుకు చెందిన ఇళ్లపై ఆదాయ పన్ను(ఐటీ)శాఖ అధికారులు శుక్రవారం దాడులు జరిపారు. చెన్నై, కోయంబత్తూరు, తిరువణ్ణామలై, కరూర్ తదితర ప్రాంతాల్లో సోదాలు జరిగినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. సీఎం ఎంకే స్టాలిన్ ప్రభుత్వంలో వేలు పబ్లిక్ వర్క్స్ మంత్రిగా ఉన్నారు. దాడులను అధికార డీఎంకే ఖండించింది.

పాక్‌లో ఉగ్ర దాడి.. 14 మంది సైనికులు మృతి

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లోని బలోచిస్తాన్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు శుక్రవారం జరిపిన దాడిలో 14 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. గద్వార్ జిల్లాలోని పస్ని నుంచి ఒర్మారా వైపు వస్తున్న రెండు మిలటరీ ట్రక్కులపైకి ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారని అధికారులు తెలిపారు.

దళిత మహిళపై అత్యాచారం, హత్య

బందా(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని బందా జిల్లాలో దారుణం జరిగింది. 40 ఏళ్ల దళిత మహిళపై అత్యాచారానికి పాల్పడి, అనంతరం హత్య చేశారు. ఆమెను ముక్కలు ముక్కలుగా నరికేశారు. బాధిత మహిళ మంగళవారం రాజ్‌కుమార్ శుక్లాకు చెందిన పిండి మిల్లును శుభ్రం చేయడానికి వెళ్లింది. శుక్లాతోపాటు అతడి సోదరుడు, మరో వ్యక్తి కలిసి ఆమెను ఓ గదిలో బంధించి, అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు ప్రతిఘటించడంతో హత్య చేశారు. శరీరాన్ని మూడు ముక్కలుగా నరికారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శనివారం : 4 : నవంబర్ : 2023

ఇష్టారాజ్యంగా గవర్నర్లు

• స్పీకర్ అప్పావు

కొరుక్కుపేట: ప్రస్తుతం బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లోని గవర్నర్లు బిల్లుల విషయంలో జాప్యం చేస్తూనే ఉన్నారు. దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోరు. బిల్లులను అటకెక్కించేస్తున్నారని, దీన్ని కేంద్ర ప్రభుత్వం సైతం పట్టించుకోవడం లేదని స్పీకర్ అప్పావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం తిరునెల్వేలి మణిమూర్తీశ్వరం ప్రాంతంలో డ్రగ్స్ ముఠాల దాడికి గురైన ఇద్దరు యువకులు తిరునెల్వేలి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్పీకర్ అప్పావు స్వయంగా వెళ్లి పరామర్శించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ సిమ్లాలో జరిగిన అఖిల భారత స్పీకర్ల సదస్సుకు సీఎం స్టాలిన్ తనను పంపారన్నారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాల్లో గవర్నర్ల పని తీరు చూసి కేంద్ర ప్రభుత్వం చూసి చూడనట్టు వ్యవహరిస్తోందని అన్నారు.

న్యూస్‌రీల్

అన్నాడీఎంకేలోకి సూర్యశివ

• బీజేపీకి గుడ్‌బై

కొరుక్కుపేట: తాను బీజేపీని వదిలి అన్నాడీఎంకేలో చేరుతున్నట్లు ఆ పార్టీ ఓబీసీ వింగ్ సెక్రటరీ సూర్యశివ సంచలన ప్రకటన చేశారు. తమిళనాడు బీజేపీ మైనారిటీ నేత డైసీ శరణ్, ఓబీసీ వింగ్ సెక్రటరీ తిరుచ్చి సూర్య శివ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ గతేడాది సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈ ఆడియో వివాదానికి కారణమైంది. తిరుచ్చి సూర్య శివ ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడి చంపేస్తానని బెదిరించాడు. ఈ ఆడియో వైరల్‌గా మారింది. బీజేపీ క్రమశిక్షణా కమిటీ డైసీ శరణ్, సూర్య శివలపై విచారణ చేపట్టింది. దీంతో గత ఏడాది నవంబర్ 24 నుంచి 6 నెలల పాటు సూర్యశివను పార్టీ బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రకటించారు. దాదాపు ఏడాది పూర్తి కావడంతో సూర్య శివ తన పదవిలోనే కొనసాగుతారని గురువారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఓ ప్రకటన చేశారు. అయితే ఆయన ప్రకటనను సూర్య శివ తిరస్కరించినట్లు సమాచారం. తాను ఎడప్పాడి పళనిస్వామిని కలుస్తానని, ఆయన ఆశీస్సులతో అన్నాడీఎంకేలో చేరతానని ప్రకటించడం చర్చనీయాంశమైంది.

ఇండియా కూటమి మద్దతు కోరతాం

కొరుక్కుపేట: నీట్‌లో మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఇండియా కూటమి నేతల నుంచి సంతకాలు సేకరిస్తానని మంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రకటించారు. నీట్ రద్దు సంతకాల ఉద్యమానికి మద్దతు కోరుతూ మంత్రి ఉదయనిధి స్టాలిన్ చెన్నైలోని సత్యమూర్తి భవన్‌లో తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు కె.ఎస్. అళగిరిని కలిసి మద్దతు కోరారు. అళగిరి, మాజీ అధ్యక్షుడు కేవీ తంగబాలు, కృష్ణ స్వామి, పీటర్ ఆల్ఫోన్స్, విజయ్ వసంత్ మద్దతు కోరారు

అన్నామలై యాత్రతో పెరిగిన బలం



ప్రసంగిస్తున్న సుధాకర్‌రెడ్డి

సాక్షి, చెన్నై: నామట్టి నా ప్రజలు యాత్రతో తమిళనాడులో బీజేపీ బలం మరింతగా పెరిగిందని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల కో–ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్ తెలిపారు. శుక్రవారం, తమిళనాడు రాష్ట్ర బీజేపీ జాతీయ కో–ఇన్‌చార్జ్ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి తిరుప్పూర్ జిల్లా ఉడుమలైపేటలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక పనుల కోసం 'టీఎన్‌బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్‌ల కోసం' పేరిట నిర్వహించిన వర్క్‌షాప్‌నకు హాజరయ్యారు. వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగిస్తూ నా మట్టి నా ప్రజలు నినాదంతో కె.అన్నామలై నేతృత్వంలో విజయవంతంగా జరుగుతున్న పాదయాత్ర తమిళనాడులో బీజేపీ పాదాన్ని మరింత పెంచిందని వ్యాఖ్యలు చేశారు. ఈ యాత్ర విజయవంతంలో కీలకపాత్ర పోషించిన మొత్తం టీఎన్‌బీజేపీ బృందానికి తన అభినందనలు తెలియజేశారు. బూత్‌స్థాయిలో ప్రజా ప్రచారాన్ని విస్తృతం చేయాలని సూచించారు. బలోపేతం చేయాలని ఉద్బాటించారు. డీఎంకే ప్రభుత్వం తమ కార్యకర్తలపై పెట్టిన తప్పుడు, రాజకీయ ప్రేరేపిత కేసులను ఆయన ఖండించారు. కేశవ వినాయకన్ టీఎన్ బీజేపీ నేతలు ఇతర సీనియర్ ఆఫీస్ బేరర్లు, తిర్పూర్ సౌత్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు మంగళం రవి పాల్గొన్నారు. .

కుమరి డీఎంకేలో రగడ

• కౌన్సిలర్ల వార్

సాక్షి, చెన్నై: కన్యాకుమారి మున్సిపాలిటీ డీఎంకే సభ్యుల మధ్య వివాదం రగిలింది. చైర్మన్‌కు వ్యతిరేకంగా 12 మంది సభ్యులు తిరుగుబావుటాకు సిద్ధమయ్యారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా శుక్రవారం ఆందోళనకు దిగారు. కన్యాకుమారి మున్సిపాలిటీలో 18 వార్డులు ఉన్నాయి. ఇక్కడ డీఎంకేకు చెందిన స్టీఫెన్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. శబరిమలై అయ్యప్ప సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో కన్యాకుమారి సముద్రతీరంలో తాత్కాలిక దుకాణాల ఏర్పాటు వివాదం డీఎంకేలో చిచ్చు రేపింది. గతవారం జరిగిన పాలక మండలి సమావేశంలో ఈ దుకాణాల ఏర్పాటుకు నిర్ణయించారు. అయితే సముద్రతీరంలో దుకాణాల ఏర్పాటుకు కోర్టు అడ్డుకట్ట వేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఈ నిర్ణయాన్ని డీఎంకేకు చెందిన 12 మంది సభ్యులు వ్యతిరేకించారు. దీంతో ఈ సభ్యులు, చైర్మన్ మధ్య వివాదం రగిలింది. చివరకు దుకాణాలను ఏర్పాటు చేయకుండా పాలక మండలి సమావేశంలో తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని మున్సిపాలిటీ గెజిట్‌లో ఇంతవరకు చైర్మన్ ప్రకటించక పోవడాన్ని ఆ సభ్యులు తీవ్రంగా పరిగణించారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. దుకాణాలకు వ్యతిరేకంగా చర్యలను విస్తృతం చేయని పక్షంలో చైర్మన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానానికి సిద్ధమని డీఎంకే సభ్యులు ప్రకటించడం గమనార్హం.

విస్తృతంగా ఐటీ సోదాలు

• ఏవీ వేలు వంతు
• డీఎంకే మంత్రులపై వరుస దాడులతో కలవరం
• పలుచోట్ల విస్తృతంగా సోదాలు



మంత్రి ఏవీ వేలు

సాక్షి, చెన్నై: అధికార డీఎంకేకు చెందిన మంత్రులపై ఈడీ, ఐటీ కన్నెర్ర చేసినట్టుంది. వరుస దాడులు ఆ పార్టీ వర్గాల్లో కలవరాన్ని రేపాయి. శుక్రవారం ప్రజాపనులు, రహదారులశాఖ మంత్రి ఏవీ వేలును టార్గెట్ చేసి ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. చెన్నై, కరూర్, కోయంబత్తూరు, మదురై నగరాలలో పలు బృందాలుగా ఐటీ వర్గాలు సోదాలలో నిమగ్నమైయ్యాయి. డీఎంకే ప్రభుత్వంలో కీలకంగా ఉన్న మంత్రులను, ఎంపీలను టార్గెట్ చేసి ఈడీ, ఐటీ సోదాలు విస్తృతమవుతున్నాయి. ఇప్పటికే మంత్రి సెంథిల్ బాలాజీని మనీల్యాండరింగ్ కేసులో అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. అలాగే, ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి, ఆయన కుమారుడు, ఎంపీ గౌతమ్ శిఖామణిలను టార్కెట్ చేసి ఈడీ సోదాలు జరిగాయి. డీఎంకే ఎంపీ జగద్రక్షకన్‌ను గురిపెట్టి వారం రోజులకుపైగా విస్తృత సోదాలు జరిగాయి. డీఎంకే పార్టీకి చెందిన కీలక నేతల నిర్మాణ సంస్థలు, రియల్ ఎస్టేట్ కార్యాలయాలు, జీస్క్వేర్ వంటి భారీ ప్రాజెక్టులను చేపట్టే కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. అలాగే, ఇసుకాసురులపై గురిపెట్టి విస్తృతంగా ఈడీ సోదాలు కావేరీ డెల్టా జిల్లాల్లో జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో శుక్రవారం ప్రజాపనులు, రహదారుల శాఖా మంత్రి ఏవీ వేలును ఐటీ టార్గెట్ చేసింది. ఆయనకు సంబంధించిన కార్యాలయాలు, విద్యా సంస్థలు, బంధువుల నివాసాలు, సంస్థలు, కార్యాలయాల్లో వందలాది మంది ఐటీ అధికారులతో కూడిన పలు బృందాలు సోదాల్లో నిమగ్నమయ్యాయి.



తిరువణ్ణామలైలో మంత్రి ఏవీ వేలు ఇంజినీరింగ్ కళాశాల గేటును మూసి వేసి తనిఖీలు



కరూర్‌లోని ఏవి వేలు సహాయకుని ఇల్లు



టీనగర్‌లో రెసిడెన్సీ హోటల్

దాడులు..

చెన్నై ఆల్వార్‌పేటలోని ఏవీ వేలు నివాసం, తిరువణ్ణామలైలోని ఇంజినీరింగ్ కళాశాల, వైద్య కళాశాలలతో పాటు మరో ఐదు విద్యా సంస్థల్లో వంద మందికి పైగా అధికారులతో కూడిన 20 బృందాలు ఉదయం ఆరు గంటలకు ఒక్కసారిగా సోదాలు చేపట్టాయి. ఈ సోదాలు పలుచోట్ల కొనసాగుతున్నాయి. అలాగే చెన్నై కేంద్రంగా నిర్మాణ రంగంలో ఉన్న అప్పాస్వామి గ్రూప్ కార్యాలయాలు, కోయంబత్తూరులోని మంత్రి బంధువు మీనా, ఆమె కుమారుడు శ్రీరామ్ నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు జరుగుతున్నాయి. శ్రీరామ్ నివాసంలో సాయంత్రం సోదాలు ముగించారు. సింగానల్లూరులోని మంత్రి మరో బంధువు ఎస్.ఎం. స్వామి, కరూర్ పెరియార్ నగర్‌లోని డీఎంకే నేత, మంత్రి సన్నిహితుడు వాసుకి పద్మ, విల్లుపురంలోని మంత్రి సన్నిహితుడుగా భావిస్తున్న ప్రేమ్ నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేశారు. అలాగే, ప్రముఖ నిర్మాణ సంస్థ కాసాగ్రాండ్‌లో పనిచేస్తున్న కీలక అధికారి ఎస్.ఆర్.దినకరన్‌కు చెందిన చెన్నై పట్టిణంపాక్కంలోని నివాసం, కార్యాలయాల్లో సోదాలు జరుగుతున్నాయి. అలాగే ప్రజా పనుల శాఖ, రహదారుల శాఖలలో ఒప్పందదారులు, కాంట్రాక్టర్లుగా ఉన్న పలువురిని సైతం టార్గెట్ చేసి ఈ సోదాలు విస్తృతంగా జరుగుతున్నాయి.

కీలక రికార్డులు స్వాధీనం..

ఈ సోదాల్లో మంత్రి నివాసం, కార్యాలయాలతో పాటు పలు సంస్థలలో కీలక రికార్డులు, దస్తావేజులు బయటపడ్డట్టు సమాచారం. విద్యా సంస్థలలో ఫీజులకు సంబంధించిన రసీదు పుస్తకాలను అధికారులు సీజ్ చేసి పరిశీలిస్తున్నట్లు సంకేతాలు వెలువడ్డాయి. ఆయా ప్రాంతాల్లో కంప్యూటర్ హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకుని తనిఖీలు జరుపుతున్నారు. అనేక చోట్ల సోదాలు కొనసాగుతుండడం గమనార్హం. ఇదివరకు డీఎంకే నేతలను గురిపెట్టి జరిపిన సోదాలు వారం రోజులపాటు కొనసాగిన విషయం తెలిసిందే. తాజాగా సోదాలు ఎన్ని రోజులో వేచి చూడాల్సిందే.

బీజేపీ అనుబంధ విభాగం..

మంత్రి ఏవీ వేలును టార్గెట్ చేసి ఐటీ సోదాలు జరుగుతుండడంపై డీఎంకే వర్గాలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. పలు చోట్ల కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసుల భద్రత నడుమ సోదాలను చేపట్టాల్సిన పరిస్థితి ఐటీ వర్గాలకు ఏర్పడింది. ఈ సోదాల గురించి క్రీడల శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ స్పందిస్తూ ఈడీ, ఐటీలు ప్రస్తుతం బీజేపీ అనుబంధ విభాగాలుగా మారాయని ధ్వజమెత్తారు. వారి పనిని వారిని చేసుకోనిద్దామని, తాము మాత్రం చట్టపరంగా ఎలాంటి దాడులనైనా, కేసులనైనా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసైసౌందరరాజన్ పేర్కొంటూ లెక్కలు సక్రమంగా ఉంటే ఎవరూ పట్టించుకోరని, లేకుంటేనే ఇలాంటి దాడులు జరుగుతాయని వ్యాఖ్యానించారు. ఇలాంటి దాడుల్లో రాజకీయాల ప్రస్తావన ఉండదని ప్రస్తావించారు. నిజాయితీగా ఉంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హితవు పలికారు.

పారా ఒలింపిక్స్ ఆటగాళ్లకు ఘన స్వాగతం

కొరుక్కుపేట: ఆసియా పారా ఒలింపిక్ బిగ్ గేమ్స్ చైనాలో 28వ తేదీ వరకు జరగ్గా భారత్ తరపున 111 మంది అథ్లెట్లు పాల్గొని పతకాలు సాధించారు. బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో తమిళనాడుకు చెందిన తులసిమతి బంగారు పతకం, హైజంప్, లాంగ్ జంప్‌లో మరియప్పన్ రజత పతకం సాధించారు. పోల్‌వాల్ట్‌లో ధర్మరాజ్ బంగారు పతకం, బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో శివరంజన్ బంగారు పతకం, మహిళల సింగిల్స్‌లో మనీషా, నిత్యశ్రీ, పురుషుల సింగిల్స్‌లో ముత్తురాజ్ కాంస్యం సాధించారు. టోర్నీలో పాల్గొన్న తమిళ క్రీడాకారులను శుక్రవారం ఉదయం న్యూఢిల్లీ మీదుగా చెన్నైకి తీసుకొచ్చారు. విమానాశ్రయంలో పాఠశాల విద్యార్థులు తమిళనాడు ప్రభుత్వం తరపున పూలమాల వేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం పతకాలు సాధించిన క్రీడాకారులంతా లగ్జరీ బస్సులో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను వ్యక్తిగతంగా కలిసేందుకు వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు పేర్ల నమోదు శిబిరాలు

తిరువొత్తియూరు: రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితాలో పేర్ల నమోదుకు నేడు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఇటీవల కాలంలో ఓటర్ల జాబితాను విడుదల చేసింది. అందులో మొత్తం 6.11 కోట్ల ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులకన్నా స్త్రీలు ఎక్కువగా ఉన్నారు. ఈ క్రమంలో కొత్త ఓటర్లను చేర్చు, అవసరంలేని వారిని తొలగించేందుకు నేడు శనివారం, ఆదివారం శిబిరాలు నిర్వహించనున్నారు. అలాగే 18, 19వ తేదీల్లో ఓటర్ల జాబితా ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరం జరుగుతుంది. 2024 సంవత్సరం జనవరి1న 18 సంవత్సరాలు పూర్తయ్యే వారు ఓటర్ గుర్తింపు కార్డు కోసం నమోదు చేసుకోవచ్చు. ఈ ప్రత్యేక శిబిరాలు రాష్ట్రవ్యాప్తంగా ఆయా కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయని అధికారులు పేర్కొన్నారు.

టాస్మాక్ ఉద్యోగులకు బోనస్

• కార్మిక సంఘాలతో మంత్రి ముత్తుస్వామి చర్చలు

కొరుక్కుపేట: దీపావళి సందర్భంగా ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న కంపెనీలకు ప్రభుత్వం బోనస్ ఇవ్వనుంది. ఇందుకు సంబంధించి శుక్రవారం చెన్నైలో మంత్రి ముత్తుస్వామి నేతృత్వంలో టాస్మాక్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎంత శాతం బోనస్ ఇవ్వాలనే అంశంపై చర్చ జరిగింది. ప్రధాన సచివాలయంలోని నామక్కల్ కవినగర్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో తమిళనాడు స్టేట్ కామర్స్ కార్పొరేషన్ స్టాఫ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్, టాస్మాక్ లేబర్ అన్నా యూనియన్, తమిళనాడు టాస్మాక్ ఎంప్లాయీస్ యూనియన్, పాటలీ ట్రేడ్ యూనియన్, తమిళనాడు ప్రభుత్వ టాస్మాక్ ఎంప్లాయీస్ యూనియన్, తమిళనాడు టాస్మాక్ పర్మినెంట్ ఎంప్లాయీస్ యూనియన్, వెండర్స్ అసోసియేషన్ సహా 21 కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. ఇందులో టాస్మాక్ ఉద్యోగుల సంఘం (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి ధనశేఖరన్ టాస్మాక్ ఉద్యోగులందరికీ 20 శాతం అదనపు వేతనాలు, గ్రాట్యుటీ చెల్లించాలని పట్టుబట్టారు. అంతే కాదు బ్యాంకులకు సెలవు దినాల్లో పనిచేస్తున్న టాస్మాక్ ఉద్యోగులకు రెట్టింపు వేతనాలు చెల్లించాలని.. ప్రతి యూనియన్ ప్రతినిధి వినతిపత్రం ఇచ్చారు. వీటిని మంత్రి ముత్తుస్వామి స్వీకరించి ప్రతి సంఘం డిమాండ్లను క్షుణ్ణంగా పరిశీలించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి బోనస్ ప్రకటన విడుదల చేయనున్నట్లు తెలిపారు.

సిబ్బంది కొరత

• చెన్నై నగర రవాణా సంస్థకు కొత్త కష్టాలు
• పలు రూట్లలో ఆగిన సేవలు



సాక్షి, చెన్నై: డ్రైవర్లు, కండక్టర్ల కొరత కారణంగా నగర రవాణా సంస్థకు కొత్త కష్టాలు ఎదురయ్యాయి. అనేక మార్గాలలో బస్సుల సేవలు అంతంత మాత్రంగానే ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. చెన్నై నగర రవాణా సంస్థ ద్వారా 3,365 బస్సులు చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరుకు సేవలు అందిస్తున్నాయి. 700 మార్గాల్లో బస్సులు నడుపుతున్నారు. రోజుకు సరాసరి 3.20 లక్షల మంది బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. ఈ రవాణా సంస్థ పరిధిలో కండక్టర్లు, డ్రైవర్లు, డిపోలలో సిబ్బంది, కార్మికులు, మెకానిక్‌లు 20 వేల మంది పని చేసేవారు. గత ఏడాదిన్నర కాలంగా పదవీ విరమణలతో పెద్ద సంఖ్యలో డ్రైవర్లు, కండక్టర్ల పోస్టులు ఖాళీ అయ్యాయి. వీటిని కాంట్రాక్ట్ కార్మికుల ద్వారా భర్తీ చేయడానికి రవాణా సంస్థ నిర్ణయించినా, కార్మిక సంఘాల వ్యతిరేకత కారణంగా వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి. కండక్టర్లు, డ్రైవర్ల కొరత కారణంగా బస్సులు ఉన్నా అనేక డిపోల పరిధిలోని మార్గాలలో కష్టాలు తప్పడం లేదు. బస్సులను రోడ్డెక్కించేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఉన్న డ్రైవర్లు, కండక్టర్ల ద్వారా ఓవర్ టైమ్ పనిచేయిస్తున్నారు. ఇందుకు వారిలో వ్యతిరేకత బయలుదేరింది. దీంతో కొన్ని మార్గాలలో బస్సు డ్రైవర్ల సంఖ్యను తగ్గించుకునేందుకు నగర రవాణా సంస్థ నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకనుగుణంగా మెట్రో రైలుసేవలు అందుతున్న ప్రాంతాల వైపు ఉన్న మార్గాలలో అనేక బస్సు సేవలను నిలుపుదల చేసి ఉండడం వెలుగుచూసింది. అన్నాసాలై నుంచి కుంద్రత్తూరు వైపుగా, తిరువొత్తియూరు నుంచి మింట్ వైపుగా, మనలి నుంచి మింట్ వైపుగా, తాంబరం నుంచి మేడవాక్కం వైపుగా, వడపళని నుంచి పోరూర్, అయ్యప్పన్‌తాంగల్ పరిసరాల వైపుగా వెళ్లే అనేక రూట్లలో బస్సుల సేవలు ఆగాయి. ఇది ఆయా పరిసరాలలోని ప్రయాణికులకు ఇబ్బందిగా మారాయి. బస్సుల సేవలు ఎప్పుడు వస్తాయో తెలియక ఆయా మార్గాలలో వేచి చూడాల్సిన పరిస్థితి. ఈ మార్గాలలో బస్సుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులను ప్రశ్నించగా సిబ్బంది కొరత వాస్తవమేనని, ప్రస్తుతం కారుణ్య నియామకాల ద్వారా నియమించబోతున్నట్టు పేర్కొన్నారు. ఏయే మార్గాలలో అధికసంఖ్యలో బస్సులు అవసరమో గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

కూడంకుళం అణువిద్యుత్ కేంద్రానికి యురేనియం

సాక్షి, చెన్నై: తమిళనాడులోని కూడంకుళం అణువిద్యుత్ కేంద్రానికి రష్యా నుంచి ప్రత్యేక విమానంలో యురేనియం వచ్చింది. భారత్, రష్యా భాగస్వామ్యంతో కూడంకుళంలో రెండు అణువిద్యుత్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. 3, 4వ అణురియాక్టర్ల పనులు తుది దశకు చేరుకున్నాయి. 4, 6వ అణు రియాక్టర్ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. 2013 అక్టోబర్ 22న కూడంకుళ అణువిద్యుత్ కేంద్రం మొదటి రియాక్టర్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. రెండో రియాక్టర్ 2016 అక్టోబర్ 15న విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ రియాక్టర్లలో శుద్ధి చేసిన యురేనియం బొగ్గును ఇంధనంగా ఉపయోగిస్తున్నారు. అణు రియాక్టర్‌లో 26,163 రోజులకు 12 కట్టల యురేనియం, బొగ్గు కట్టలను ఇంధనంగా ఉపయోగిస్తారు. ఈ ఇంధనంతో కూడిన యురేనియం రియాక్టర్లలో 50 ప్రతి సంవత్సరం తాజా యురేనియంతో భర్తీ చేస్తారు. ఇందుకోసం రష్యా నుంచి ఎరికోల్స్‌ను ప్రత్యేక విమానంలో హైసెక్యూరిటీతో పంపిస్తారు. ఈ ఏడాది రెండు డ్యామ్ న్యూక్లియర్ రియాక్టర్లలో బొగ్గు స్థానంలో వార్షిక నిర్వహణ పనులు గత మేలో ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ప్రత్యేక విమానంలో ఏప్రిల్ 20, మే 3, 9 తేదీల్లో మూడు విడతలుగా 43 బండిల్స్ ఎన్‌రిచ్డ్ యురేనియం మదురైకి చేరుకోగా, కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం, తమిళనాడు పోలీసులు అత్యంత భద్రతతో కూడంకుళానికి తీసుకువచ్చారు. ఈక్రమంలో గురువారం ఉదయం 2వ దశతో యురేనియం ఎరి సి–కాల్స్ 12 టన్నుల సాటల్స్‌తో కూడిన యురేనియం జియం ఎరికోల్స్ కొలను వద్దకు చేరుకున్నాయి. రష్యా నుంచి ప్రైవేట్ విమానంలో 12 కట్టల యురేనియం ఈ–ఇంధనాలు మదురై విమానాశ్రయానికి చేరుకున్నాయి. మధ్యప్రదేశ్ భద్రతా దళం, పోలీసుల రక్షణలో వాటిని మూడు ట్రక్కుల్లో కూడంకుళం తీసుకొచ్చారు. వీటిని 1, 2 రియాక్టర్లలో ఉపయోగించి కూడంకుళం అణువిద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. సుసంపన్నమైన యురేనియం ఇంధనం అంతర్జాతీయ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ పర్యవేక్షణలో కూడంకుళం న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌లో నిల్వచేస్తామని అధికారులు వెల్లడించారు.

ఐదు బస్సులు, రెండు లారీల ఢీ



క్రేన్ తో పక్కకు తొలగిస్తున్న బస్సు

చెన్నై, సాక్షి : తిరుచ్చి–మదురై జాతీయ రహదారిలో శుక్రవారం ఉదయం తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఐదు బస్సులు, రెండు లారీలు ఢీకొనడంతో 30 మంది స్వల్పంగా గాయపడ్డారు. రవాణా సేవలకు తీవ్ర ఆటంకం నెలకొంది. శుక్రవారం ఉదయం తిరుచ్చి, మదురై జాతీయ రహదారిలో సాలైకుడి వద్ద ఎదురుగా వస్తున్న ఓ లారీని తప్పించే క్రమంలో ఓ బస్సు అదుపుతప్పింది. ముందుగా వస్తున్న ఓ బస్సును ఢీకొంది. హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనతో వెనుకే వస్తున్న బస్సులు, రెండు లారీలు ఒకదానికి ఒకటి ఢీకొని ఆగాయి. గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వాహనాల ఢీకొనడంతో రవాణా సేవలకు తీవ్ర ఆటంకం నెలకొంది. సమాచారం అందుకున్న హైవే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ ఘటనలో 30 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదంలో ఐదు ఆమ్నీ ప్రైవేటు లగ్జరీ బస్సుల ముందు భాగాలు ధ్వంసమయ్యాయి. రెండు లారీ కూడా ఈ ప్రమాదంలో పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదం అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులకు ముచ్చెమటలు పట్టాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞాన పరిశోధనలకు ప్రాధాన్యం



డిగ్రీ ప్రదానం



సీతారామన్‌కు డాక్టరేట్‌ను ప్రదానం

తిరువళ్లూరు: ఆధునిక ప్రపంచం పోటీరంగం వైపు వేగంగా దూసుకెళ్తున్న నేపథ్యంలో నేటితరం ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఏఐసీటీఈ అధ్యక్షుడు ప్రొఫెసర్ సీతారామన్ పిలుపునిచ్చారు. తిరువళ్లూరు జిల్లా ఆవడిలోని వేల్‌టెక్ డాక్టర్ రంగరాజన్ డాక్టర్ శకుంతల రంగరాజన్ పరిశోధన సైన్సు అండ్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో 13వ డిగ్రీ ప్రదానోత్సవ కార్యక్రమం శుక్రవారం ఉదయం వర్సిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వేల్ రంగరాజన్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రొఫెసర్ సీతారామన్, కారైకుడి సీఎస్ఐఆర్ డైరెక్టర్ రమేష్ హాజరై వర్సిటీ స్థాయిలో ర్యాంకులు సాధించిన 22 మంది బంగారు పథకాలతో పాటు 1,153 మందికి డిగ్రీలను ప్రదానం చేశారు. అనంతరం ప్రొఫెసర్ సీతారామన్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. వీసీ శాలివాహన్, రిజిస్ట్రార్ కన్నన్ పాల్గొన్నారు.

నేడు రాష్ట్రంలో ఆరెంజ్ అలర్ట్

• మరో మూడు రోజులు వర్షాలు
• వాతావరణ కేంద్రం వెల్లడి
• నగరంలో ఎండ, వాన దోబూచులాట



వేలచ్చేరి రోడ్డుపై వరద నీరు



వరద నీటిలో వాహన చోదకులు ఇక్కట్లు

సాక్షి, చెన్నై: తమిళనాడులో రానున్న మూడు రోజులపాటు నిరంతరాయంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించింది. అదే సమయంలో, శుక్రవారం రాష్ట్రానికి 'ఆరెంజ్ అలర్ట్' ప్రకటించింది. ఈశాన్య రుతుపవనాల ప్రారంభంతో గత రెండు రోజులుగా తమిళనాడులోని చాలా చోట్ల మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. శ్రీలంక పరిసర ప్రాంతాల్లో దక్షిణ బంగాళాఖాతంలో అల్పమండల ద్రోణి కారణంగా తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్‌లో నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ శాఖ ప్రకటించింది. గురువారం చెన్నై నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. చెన్నై మీనంబాక్కం విమానాశ్రయంలో వర్షం కారణంగా పలు విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని విమానాలు ఆలస్యంగా చెన్నై చేరుకున్నాయి. దీంతో బయలుదేరే సమయం కూడా ఆలస్యమైంది. దీంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా తిరువళ్లూరు, కాంచీపురం, సెంగల్పట్టు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ సందర్భంలో వాతావరణ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం నీలగిరి, కోయంబత్తూరు, తిరుపూర్, తేని, దిండిగల్, మదురై, విరుదునగర్, తెన్‌కాశి, తూత్తుకుడి, తిరునల్వేలి, కన్యాకుమారి జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. శుక్రవారం తేని, దిండుక్కల్, కన్యాకుమారి, తెన్‌కాశి, తిరునల్వేలి, విరుదునగర్, మదురై, శివగంగై, పుదుకోట్టై, తంజావూరు, అరియలూరు జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి. అదేవిధంగా పెరంబలూరు, నీలగిరి, కోయంబత్తూర్, తిరుపూర్, ఈరోడ్, కరూర్, తిరుచిరాపల్లి జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. కాగా, ఐదో తేదీ నీలగిరి, కోయంబత్తూరు, తిరుప్పూర్, తేని, దిండిగల్, ఈరోడ్, కృష్ణగిరి. ధర్మపురి, సేలం, తిరుపత్తూరు జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆరో తేదీన నీలగిరి, కోయంబత్తూరు, తిరుపూర్, తేని, దిండుక్కల్, విరుదునగర్, మదురై, తెన్‌కాసి, తిరునల్వేలి, కన్యాకుమారి, దూతుకుడి జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

ఆరెంజ్ అలర్ట్..

తమిళనాడులో శుక్రవారం ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. దీని ప్రకారం 6వ తేదీ వరకు తమిళనాడులో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. తమిళనాడులో అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. దీని ప్రకారం, తమిళనాడు, పుదుచేరి, కారైకల్‌లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి, తేని, దిండిగల్ జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ఎండ, వాన దోబూచులాట..

చెన్నై నగరంలో గురువారం ఎండ, వాన దోబూచులాడింది. ఉదయం నుంచి రాత్రి వరకు పలు చోట్ల అప్పుడప్పుడు చిరుజల్లులు కురవడం ఆ వెంటనే ఎండ కనిపించింది. కొన్ని ప్రాంతాలలో ఒకే సారి ఎండ, వాన మారిమారి కనిపించాయి. చెన్నైలోని ఎగ్మూరు, పురసైవాక్కం, నుంగంబాక్కం, రాయపురం, మీనంబాక్కం, అలందూర్, అన్నానగర్, కోయంబేడు, వేళచ్చేరి సహా పలు ప్రాంతాల్లో ఇదే విధమైన వాతావరణం కనిపించింది.

చెన్నై శనివారం । 4 । నవంబర్ । 2023 సాక్షి

క్లుప్తంగా

అభివృద్ధి పనుల నిర్లక్ష్యంపై ధర్నా



మున్సిపాలిటీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పీఎంకే కార్యకర్తలు

వేలూరు: వాలాజ మున్సిపాలిటీలోని అభివృద్ధి పనులపై అధికారుల నిర్లక్ష్యపు ధోరణిని ఖండిస్తూ పీఎంకే ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి శరవణన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండా సమావేశాలు మాత్రం నిర్వహించి బిల్లులు మంజూరు చేసుకుంటున్న అధికార పార్టీ నాయకులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అదేవిధంగా రోడ్లు లేక, తాగునీటిని సక్రమంగా సరఫరా చేయకుండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్‌లు వాటిపై ఎటువంటి శ్రద్ధచూప డం లేదన్నారు. ప్రజాసమస్యలను పట్టించుకోని మున్సిపాలిటీని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన ఆరోపించారు. అనంతరం మున్సిపాలిటీతో పాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఖండిస్తూ నినాదాలు చేశారు. ధర్నాలో జిల్లా అధ్యక్షుడు సుబ్రమణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేంద్రన్, విద్యార్థి విభాగం కార్యదర్శి జానికిరామన్, యూనియన్ కార్యదర్శి రవి, రజని పాల్గొన్నారు.

6న మోటార్ వాహనాల సంఘం సమ్మె

తిరువొత్తియూరు: చెన్నై సర్కిల్ మోటార్ వెహికల్ అసోసియేషన్ల సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం రాయపురంలో జరిగింది. సమావేశంలో సంఘం నిర్వాహకులు మాట్లాడుతూ ఏడాదికి పైగా ఆన్‌లైన్ కేసుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. దీన్ని ప్రభుత్వం రద్దు చేయాలని, అలాగే రోడ్డు పన్నును 40 శాతానికి పెంచారన్నారు. వండలూరు, మీంజూరు, ఎన్నూర్ ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. డ్రైవర్లకు భద్రత కల్పించాలని, టోల్‌గేట్‌లో పన్ను రద్దు చేయాలని, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, ఈ డిమాండ్ల కోసం చెన్నైలోని 30 సంఘాలు సమైక్యంగా 6వ తేదీన ఒకరోజు సమ్మెకు మద్దతుగా ఇవ్వాలని కోరారు.

ఐటీ దాడులు కొత్తేమికాదు!

• మంత్రి దురైమురుగన్



అవార్డులు అందజేస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు: రాష్ట్రంలోని డీఎంకే మంత్రులు, ప్రజాప్రతినిధులపై ఐటీ దాడులు చేయించడం కొత్త కాదని మంత్రి దురైమురుగన్ అన్నారు. వేలూరు జిల్లా కాట్పాడి నియోజక వర్గంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో గర్భిణులకు ప్రభుత్వం ఆధ్వర్యంలో సీమంతం కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దురైమురుగన్ గర్భిణులకు ప్రభుత్వం అందజేసే తాంబూలం అందజేసి విశిష్టసేవలు అందజేసిన అంగన్‌వాడీ కార్యకర్తలకు అవార్డులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అవసరమైన సంక్షేమ పథకాలను అందజేసేందుకు సిద్ధంగా ఉందని, వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీమంతం అనేది మహిళలకు అమ్మగారింటి వారు చేసేదని అయితే తమ ప్రభుత్వం మీకు అమ్మగారిల్లుగా ఉంటూ అవసరమైన అన్ని వరుస తాంబూలాలను అందజేసి ఆదుకుంటుందని తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని డీఎంకే మంత్రులు, ప్రజాప్రతినిధులపై ఐటీ దాడులను కావాలనే చేయిస్తున్నారని చివరకు న్యాయమే గెలుస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతోనే ఈ దాడులను తరచూ చేస్తున్నారని వీటికి తాము భయపడమన్నారు. పార్లమెంట్ సభ్యులు జగద్రక్షగన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, జోన్ చైర్మన్ పుష్పలత, యూనియన్ చైర్మన్ వేల్‌మురుగన్ పాల్గొన్నారు.

బీడీఓ కార్యాలయం ముట్టడి



తిరుత్తణి: బీడీఓ కార్యాలయం వద్ద మహిళల నిరసన

తిరుత్తణి: తిరుత్తణి బీడీఓ కార్యాలయాన్ని మురుక్కంపట్టు పంచాయతీకి చెందిన మహిళలు శుక్రవారం ముట్టడించి నిరసన తెలిపారు. ఉపాధి పథకంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సంక్షేమ పథకాలు, ఉపాధి పొందేందుకు వీలుగా ప్రభుత్వం స్వయం సహాయక బృందాల ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన వున్న వారి వివరాలు సేకరించి పీఎల్‌ఎఫ్ కార్డులు పంపిణీ చేస్తున్నారు.ఈ కార్డులు వున్నవారు మాత్రమే ఉపాధి పనులు చేసేందుకు, రేషన్ వస్తువులు, సంక్షేమ సహాయకాలు పొందేందుకు అర్హులుగా వున్నారు. ఈ క్రమంలో యూనియన్‌లోని మురుక్కంపట్టు గ్రామపంచాయతీలోని దిగువ మురుక్కంపట్టు దళిత కాలనీలోని 150 కుటుంబీకులకు పీఎల్‌ఎఫ్ కార్డులు అందకపోవడంతో ఉపాధి పనులు, రేషన్ వస్తువులు సహా ప్రభుత్వ సహాయకాలకు అర్హత కోల్పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన వందకు పైబడిన మహిళలు బీడీఓ కార్యాలయం ముట్టడించి నిరసన తెలిపారు. బీడీఓ వెంకటేశన్‌ను కలిసి వినతిపత్రం అందజేసి కూలీ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్న తమకు పీఎల్‌ఎఫ్ కార్డులు అందజేయలేదని, ఎగువ మురుక్కంపట్టు దళిత వాడలో అన్ని కుటుంబాలకు అందజేసినట్లు ఆరోపించారు. సక్రమంగా వివరాలు సేకరించి అర్హులకు పీఎల్‌ఎఫ్ కార్డులు అందజేస్తామని బీడీఓ హామీ మేరకు మహిళలు నిరసన విరమించారు.

డీఎంకే నేత మృతి



ఏలుమలై (ఫైల్)

కొరుక్కుపేట: చెన్నైలోని నాగప్ప నగర్ (సీబీరోడ్డు) ఆది ఆంధ్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు, డీఎంకే నేత ఆర్.ఏలుమలై (88) తుదిశ్వాస విడిచారు. ఈయన 88 సంవత్సరాలు దాటినా చివరి శ్వాస వరకు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని అందరి మన్ననలను పొందారు. ఏలుమలైకి సంఘం తరపున ఉపాధ్యక్షుడు అంజనరసయ్య, కార్యదర్శి డీఎస్ .వెంకటేశ్వరరావు, కోశాధికారి పి.మాలకొండయ్య, సభ్యులు దార్ల దాసు, ఎస్ .ఏడుకొండలు, టి.ఏడుకొండలు, లింగయ్య, డి.రామమూర్తి నివాళులర్పించారు. రాయపురం ఎమ్మెల్యే ఐడ్రీం ఆర్.మూర్తి, 53వ వార్డు కౌన్సిలర్ వేళాంగని, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య శ్రద్ధాంజలి ఘటించారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

కొరుక్కుపేట: ఎస్సీ వర్గీకరణ చట్టభద్రతపై హైదరాబాద్‌లో ఈ నెల 11న జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) తమిళనాడు ఇన్‌చార్జి గొల్లపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక పెరియమేడులో శుక్రవారం చలో హైదరాబాద్‌కు సంబంధించి తెలుగు, తమిళంలో ముద్రించిన కరపత్రాల ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టభద్రతపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహానాడులో ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ నాయకులు, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొననున్నారని, మందకృష్ణ మాదిగ అధ్యక్షతన జరిగే ఈ సభను విజయవంతం చేసేలా తమిళనాడు నుంచి మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ తమిళనాడు అధ్యక్షుడు కర్రా లోకేష్, ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షుడు మొలబంటి మాలకొండయ్య, సలహాదారులు పుల్లాపురం కుమార్, బి.వసంతరావు, ఇరకట్ల నాగభూషణం, వైడీ. శ్రీనివాస్, టి.గోపి, వేమూరు రాజా పాల్గొన్నారు.



కరపత్రాల ఆవిష్కరణ సభలో గొల్లపల్లి శ్రీనివాస్

అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

తిరువళ్లూరు: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ ఆదేశించారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే అధికారులతో కలెక్టర్ సమీక్ష శుక్రవారం ఉదయం నిర్వహించారు. సమీక్షకు అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. సమీక్షలో కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాలు భారీగా కురిస్తే 1,300 ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచే అవకాశం ఉందన్నారు. అక్కడ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సహాయక చర్యలకు సిద్ధంగా వుండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరితే వెంటనే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు వారికి అవసరమైన అన్ని వసతులను కల్పించేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, రిజర్వాయర్‌ల పరిస్థితులపై ఎప్పటికప్పుడు పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని చెప్పారు.

విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించాలి



హెచ్‌ఎంలకు అవార్డును అందజేస్తున్న చాన్సలర్ విశ్వనాథన్

• వీఐటీ చాన్సలర్ విశ్వనాథన్

వేలూరు: విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణను నేర్పించేందుకు టీచర్‌లు కృషిచేయాలని వేలూరు వీఐటీ యూనివర్సిటీ చాన్సలర్ విశ్వనాతన్ తెలిపారు. వీఐటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వందశాతం ఉత్తీర్ణత సాధించే ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలను అవార్డులు అందజేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వేలూరు జిల్లాలో పది, ప్లస్‌టూ పరీక్షలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన హెచ్‌ఎంలకు అభినందన సభ చాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షతన శుక్రవారం ఉదయం వీఐటీ ప్రాంగణంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ లేదన్నారు. జిల్లాలో మొత్తం 457 ప్రభుత్వ పాఠశాలలున్నాయన్నారు. మన జిల్లాను విద్యలో మొదటి స్థానంలో తీసుకొచ్చేందుకు హెచ్‌ఎంలు పట్టుదలతో కృషిచేయాలన్నారు. విద్యార్థుల్లోని మేధాశక్తిని వెలికి తీసి ప్రతిఒక్కరినీ విద్యావేత్తలుగా తయారుచేయాలని సూచించారు. విద్య ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమని ఇందుకు హెచ్‌ఎంలు, టీచర్‌లు కృషిచేయాలన్నారు. డీఐజీ ముత్తుస్వామి మాట్లాడుతూ హెచ్‌ఎంలు విద్యార్థుల పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్లస్‌టూ, పది పరీక్షల్లో వందశాతం సాధించిన 68 ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలకు బహుమతులు అందజేసి అభినందించారు. వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్, జీవీసెల్వం , వైస్ చాన్సలర్ కాంచన, విద్యాశాఖ సీఈఓ మణిమొయి, జిల్లాలోని హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

వేలూరు: కనీస వసతులు కల్పించాలని గ్రామస్తులు రాస్తారోకో చేశారు. తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు సమీపంలోని బర్గూర్ కాలనీలో వంద కుటుంబాలకు పైగా జీవిస్తున్నారు. అయితే గ్రామంలో కనీస వసతులు లేకపోవడంతో గ్రామస్తులు పదేళ్లుగా వినతి పత్రాలు సమర్పించుకుంటున్నా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోలేదు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులతో కలిసి శుక్రవారం ఉదయం సెయ్యారు–అనకట్టు రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. తమ గ్రామంలో కనీస వసతులు కల్పించాలని, రోడ్డు వసతి కల్పించాలని కోరుతూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న సెయ్యారు పోలీసులు, అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి గ్రామస్తులతో చర్చలు జరిపారు. వసతులు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

కోలీవుడ్ టాక్స్



ప్రియాంక మోహన్

కెప్టెన్ మిల్లర్‌కు డబ్బింగ్ మొదలైంది!

తమిళసినిమా: నటుడు ధనుష్ కథానాయకుడిగా నటించిన చిత్రం కెప్టెన్ మిల్లర్. నటి ప్రియాంక మోహన్ నాయకిగా నటించిన ఈ చిత్రాన్ని అరుణ్ మాదేశ్వరన్ దర్శకత్వంలో సత్యజ్యోతి ఫిలిమ్స్ సంస్థ భారీ ఎత్తున నిర్మిస్తోంది. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ ముఖ్యపాత్రను పోషించిన ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తిచేసుకుని ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. చిత్ర టీజర్ ఇప్పటికే విడుదలై విశేష ఆదరణను పొందింది. ఇది స్వాతంత్ర్యదినోత్సవ కాలం నాటి కథాంశంతో రూపొందుతున్న చిత్రం. దీంతో ఇందులోని పాత్ర కోసం పూర్తిగా మేకోవర్ అయ్యారు. ఒక సమరయోధుడుగా తయారయ్యారు. ప్రియాంకమోహన్ కూడా ఆ కాలం నాటి యువతిగా ఈ చిత్రంలో నటించారు. కాగా కెప్టెన్ మిల్లర్ చిత్రం విడుదల దగ్గర పడుతోంది. డిసెంబర్ 25న తమిళం, తెలుగు, మలయాళం కన్నడం, అంటూ అంతర్జాతీయ స్థాయిలో చిత్రాన్ని విడుదల చేయడానికి నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఈ చిత్రం డబ్బింగ్ కార్యక్రమాలను గురువారం ప్రారంభించినట్లు ప్రియాంకమోహన్ ఈ సందర్భంగా తన ఎక్స్ మీడియాలో పేర్కొన్నారు. దీనికి జీవీ.ప్రకాశ్‌కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు. కెప్టెన్ మిల్లర్ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి. ఇకపోతే ధనుష్ ప్రస్తుతం తను స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తూ కథానాయకుడిగా నటిస్తున్న 50వ చిత్రం నిర్మాణ కార్యక్రమాలతో చాలా బిజీగా ఉన్నారు. అదే విధంగా తమిళం, తెలుగు భాషల్లో నటిస్తున్న తన 51వ చిత్రానికి ఆయన సిద్ధమవుతున్నారన్నది గమనార్హం.

రజనీకాంత్‌కు ప్రతినాయకుడిగా లారెన్స్



రజనీకాంత్‌తో రాఘవ లారెన్స్

తమిళసినిమా: సూపర్‌స్టార్ రజనీకాంత్ అంటే నృత్య దర్శకుడు, నటుడు రాఘవ లారెన్స్‌కు ఎంత అభిమానమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. రాఘవ లారెన్స్ ఏ కార్యక్రమాన్ని మొదలెట్టిన ముందుగా తన మానసిక గురువు రజనీకాంత్ కలిసి ఆశీస్సులు అందుకుంటారు. కాగా రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన చంద్రముఖి చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన చంద్రముఖి–2 చిత్రంలో రాఘవ లారెన్స్ కథానాయకుడిగా నటించిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో నటించే ముందు రాఘవ లారెన్స్ తన గురువు రజనీకాంతం కలిసి ఆశీర్వాదం పొందారు. కాగా జైలర్ చిత్రంతో అదిరిపోయే హిట్టును ఇచ్చిన రజనీకాంత్ కాగా ఆయన తన కూతురు ఐశ్వర్య దర్శకత్వంలో నటించిన లాల్ సలామ్ చిత్రం సంక్రాంతి సందర్భంగా తెరపైకి రానుంది. ప్రస్తుతం జైభీమ్ చిత్రం ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్నారు. ఇది ఆయన నటిస్తున్న 170వ చిత్రం. అవుతుంది కాగా 171 చిత్రాన్ని ప్రస్తుతం యమ క్రేజీలో ఉన్న లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో నటించడానికి పచ్చజెండా ఊపారు. ఈ క్రేజీ కాంబినేషన్లో రూపొందనున్న చిత్రం గురించి ఇప్పటికే రకరకాల ప్రచారం జరుగుతోంది. అందులో ఒకటి ఇందులో రజనీకాంత్‌కు ప్రతినాయకుడిగా రాఘవ లారెన్స్ నటించినున్నారన్నది, ఇది ఎంతవరకు నిజమో కానీ ఇదే జరిగితే చిత్రానికి మరింత హైప్ వస్తుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు.

జైభీమ్ @ 2 Years



ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సూర్య

తమిళసినిమా: నటుడు సూర్య కథానాయకుడిగా నటించి తన 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మించిన చిత్రం జైభీమ్. టీజే.జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం గత 2021లో ఓటీటీలో విడుదలై అప్పట్లో సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. గిరిజన ప్రాంతంలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా రూపొందిన కథా చిత్రం ఆ ప్రాంత ప్రజలు పోలీసుల దుర్మార్గానికి, దౌర్జన్యానికి ఎలా గురయ్యారు అన్న పలు ఆసక్తికరమైన, ఆలోచింపచేసే సంఘటనలతో తెరకెక్కించిన ఈ చిత్రంలో సూర్య అక్కడి ప్రజలకు అండగా నిలిచి న్యాయాన్ని గెలిపించడానికి పోరాడే న్యాయవాదిగా నటించారు. జీవీ.ప్రకాశ్‌కుమార్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల విశేష ఆదరణను చూరగొంది. కాగా ఈ చిత్రం విడుదలై గురువారంతో రెండేళ్లు పూర్తిచేసుకుంది. ఈ చిత్రం ద్వారా వెలుగు చూసిన గిరిజనుల పలు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించింది. వారికి కనీస సౌకర్యాలను కల్పించింది. వీటన్నిటిని గుర్తు చేస్తూ నటుడు సూర్య తన ఎక్స్ మీడియాలో ముఖ్యమంత్రి ఎంకే.స్టాలిన్‌కు ధన్యవాదాలు తెలుపుతూ పోస్ట్ చేశారు. జైభీమ్ చిత్రం విడుదలై రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పలువురు నుంచి వస్తున్న అభినందనలు, కురిపిస్తున్న ప్రేమ మనసును పలకరింపు జేస్తోందని, ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోవడమే మంచి అంగీకారం అని అందులో పేర్కొన్నారు. మంచి ప్రయత్నాన్ని ఆదరించి, ఆశీర్వదించిన అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అన్నారు. జై భీమ్ చిత్రం విడుదలైన తర్వాత తమిళనాడులోని గిరిజనులకు జరిగిన మంచి తమ ప్రయత్నానికి సార్థకతను చేకూర్చిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నట్లు సూర్య పేర్కొన్నారు.

హరాలో ↔ కథానాయిక మారింది



హరాలో మోహన్, అనుమోల్

తమిళసినిమా: ఒకప్పుడు ప్రేమ కథా చిత్రాలకు కేరాఫ్‌గా మారిన నటుడు మోహన్. 16 ఏళ్ల తర్వాత మళ్లీ కథానాయకుడుగా రీఎంట్రీ అవుతున్న చిత్రం హరా. ఇంతకుముందు దాదా 87, పౌడర్ వంటి వైవిధ్యభరిత కథా చిత్రాలను తెరకెక్కించిన విజయ్ శ్రీ.జి తాజాగా దర్శకత్వం వహిస్తున్న చిత్రం ఇది. నటుడు యోగిబాబు, మొట్టై రాజేంద్రన్, సింగంపులి, దీప, మైమ్ గోపి, శ్యామ్స్, కౌశిక్, అనిత నాయర్, చారుహాసన్ ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి లియాండర్ లీ మార్టీ సంగీతాన్ని అందిస్తున్నారు. ఇంతకుముందే చిత్ర షూటింగ్ ప్రారంభమైంది. అయితే మధ్యలో దర్శకుడు విజయ్ శ్రీ.జి ప్రమాదానికి గురికావడంతో ఆయన వైద్య చికిత్స కారణంగా షూటింగ్ వాయిదా పడింది. తాజాగా హరా చిత్రం షూటింగ్ మళ్లీ ప్రారంభమై పూర్తిచేసుకుంది. ఈ చిత్రంలో ఒక ప్రముఖ నటి కథానాయకిగా నటించాల్సి ఉండగా కాల్‌షీట్స్ సమస్య కారణంగా ఈ చిత్రం నుంచి వైదొలగడంతో ఇప్పుడు ఆమెకు బదులు నటి అనుమోల్‌ను ఎంపిక చేసినట్లు దర్శకుడు తెలిపారు. ఈమె ఇంతకుముందు నటించిన అయిలీ వెబ్ సిరీస్‌లో మంచి నటనను ప్రదర్శించి ప్రేక్షకుల మధ్య మంచి ఆదరణ చూరగొన్నారని, ప్రస్తుతం విజయ్ హీరోగా నటిస్తున్న ఆయన 68వ చిత్రంలోనూ ముఖ్య పాత్రను పోషిస్తున్నట్లు చెప్పారు. కాగా హరా చిత్రంలో ఆమె పాత్ర మంచి పేరు తెచ్చిపెడుతుందని నమ్మకాన్ని దర్శకుడు వ్యక్తం చేశారు. కోయంబత్తూర్ ఎస్‌పీ. మోహన్ రాజ్‌తో కలిసి జీ.మీడియా పతాకంపై జయశ్రీ విజయ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.



సమంత

నేను రెడీ.. మళ్లీ వస్తున్నా!

తమిళసినిమా: మనోధైర్యానికి మందు లేదంటారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే లక్ష్యం తీరాలు చేరుకోవచ్చనే నానుడి నటి సమంతకు వర్తిస్తుంది. నటిగా ఈ చెన్నై బ్యూటీ పయనం పూలబాటేమీ కాదు. ఆదిలో ఆశలు, అడియాశల సంగమంగానే సమంత సినీ జీవితం సాగింది. అలా తమిళ చిత్రాలతో సాదాసీదాగా సాగిన సమంత నట జీవితాన్ని తెలుగు చిత్ర పరిశ్రమ ఒక్కసారిగా మార్చేసింది. తెలుగులో తొలి చిత్రం ఏమాయ చేశావే అనూహ్య విజయాన్ని సాధించి సమంతను క్రేజీ హీరోయిన్‌ను చేసేసింది. ఆ తరువాత బృందావనం, దూకుడు వంటి చిత్రాలు స్టార్ హీరోయిన్ అంతస్తును కట్టబెట్టాయి. అలా అక్కడ తొలి చిత్రం హీరో నాగచైతన్యతో ప్రేమ, పెళ్లి వంటి జీవితంలో ఆనందకరమైన ముఖ్య ఘట్టాలు చకచకా జరిగాయి. అంతా సంతోషం అయితే జీవితం ఎలా అవుతుంది. నాగచైతన్యతో మనస్పర్థలు, విడిపోవడం వంటి పెద్ద కుదుపునకు సమంత గురైంది. ఆ చేదు అనుభవాలను మరచిపోకముందే మయోసిటీస్ అనే అరుదైన వ్యాధి సమంతని తాకింది. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుంది అనుకుందో ఏమో సమంత ఆ వ్యాధితోనూ గట్టిగానే పోరాడుతోంది. ప్రస్తుతం ఈ పోరాటంలో విజయవంతం అయ్యారనే చెప్పాలి. ఎందుకంటే సమంత ఇప్పుడు నేను రెడీ మళ్లీ వస్తున్నా అంటూ ఇన్‌స్టాగామ్ పోస్ట్ చేశారు. ఎంతక్లిష్టమైన పరిస్థితుల్లోనూ ఒక పక్క వైద్యం కోసం దేశాల బాట పడుతూనే, మరో పక్క యోగాలు, వ్యాపారాలు అంటూ ఆధ్యాత్మిక పయనం చేస్తూ, ఇంకో పక్క శారీరక వ్యాయామాన్ని మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. తను చేసే ప్రతి కార్యాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేస్తూ చిత్ర పరిశ్రమ, అభిమానులు తనను మర్చిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తాజాగా తను వర్కౌట్స్ చేస్తున్న దృశ్యాలను, అందమైన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. కాగా ఈమె నటించిన సిటాటాల్ వెబ్ సిరీస్ త్వరలో స్ట్రీమింగ్‌కు సిద్ధం అవుతోంది. అదేవిధంగా సమంత తమిళం, ఆంగ్లం భాషల్లో తెరకెక్కుతున్న చిత్రంలో నటించడానికి సిద్ధం అవుతున్నట్లు తాజా సమాచారం. ఈ చిత్రంతో ఈమె హాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వనున్నారన్న మాట.

క్లుప్తంగా

విషం తాగి పోలీసు ఆత్మహత్య

అన్నానగర్: విషం తాగి పోలీసు ఆత్మహత్య చేసుకున్న ఘటన సాత్తంగులంలో చోటుచేసుకుంది. శివకాశికి చెందిన బాల్‌పాండి (30) మూడేళ్లుగా సాత్తంగులం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. భార్య జయశ్రీ, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. బాల్‌పాండి సబ్ ఇన్‌స్పెక్టర్ కావాలనుకున్నాడు. గతేడాది సబ్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష రాశాడు. అందులో ఒక్క మార్కు తేడాతో ఉత్తీర్ణత కాలేకపోయాడు. తాజాగా జరిగిన ఎస్‌ఐ పరీక్షలో కూడా విజయం సాధించలేకపోయాడు. దీంతో మనస్తాపం చెందిన అతను గత నెల 26వ తేదీ పురుగు మందు తాగి ఇంట్లో అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు నెల్లై ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మధురై రాజాజీ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సాత్తంగులం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై లైంగిక వేధింపులు

తిరువొత్తియూరు: ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్న యువతిని ఇంట్లో నిర్బంధించి లైంగిక వేధింపులు ఇచ్చిన యజమానిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. కన్యాకుమారి జిల్లా కొండ దిగువ గ్రామానికి చెందిన బాలిక (17) బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతోంది. కుటుంబ పరిస్థితుల కారణంగా చదువును మధ్యలో ఆపివేసింది. కల్లడి మాముట్టులో రాజేష్ నడుపుతున్న ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో చేరింది. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం బాలికను యజమాని రాజేష్ తన ఇంటికి తీసుకెళ్లాడు. ఆ సమయంలో భార్య, పిల్లలు ఇంట్లో లేరు. దీంతో అతను యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రౌడీషీటర్ అరెస్ట్

తిరువొత్తియూరు: తెన్‌కాశి జిల్లాకు చెందిన రౌడీషీటర్ కోలి అరుణ్‌ను బెంగళూరులో పోలీసులు అరెస్టు చేశారు. తెన్‌కాశి జిల్లా సురండై ఇడయత్త వన్నై మీనాక్షిపురానికి చెందిన దేవరాజు కుమారుడు కోలీ అరుణ్(56)పై నెల్లై, తూత్తుకుడి, కుమరి, తెన్‌కాశి, చెన్నై తదితర జిల్లాలతో పాటు ముంబై పోలీస్‌స్టేషన్‌లో హత్య తదితర 32 కేసులు ఉన్నాయి. ఇతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. కృష్ణగిరి జిల్లా హోసూరులో దాగి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అంబై ఇన్‌స్పెక్టర్ మహేష్ నేతృత్వంలో ప్రత్యేక బృందం పోలీసులు అక్కడ చేరుకుని విచారించారు. పోలీసులు వస్తున్న సంగతి తెలుసుకున్న అతను అక్కడి నుంచి బెంగళూరుకు పారిపోయినట్లు తెలిసింది. ఈ క్రమంలో బెంగళూరులో కోలీ అరుణ్‌ను అంబై పోలీసులు శుక్రవారం చుట్టుముట్టారు. తుపాకీ గురిపెట్టి అరెస్టు చేశారు. అంబైకి తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు.

గాయపడ్డ యువకుడి మృతి


అరవిందన్ (ఫైల్)

తిరువళ్లూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. తిరుపత్తూరు జిల్లా నిక్కుండి గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కుమారుడు అరవిందన్(27). మప్పేడు సమీపంలో నివాసం ఉంటూ శ్రీపెరంబదూరులోని శాల్‌కామ్ అనే కంపెనీలో పని చేస్తున్నాడు. ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్‌గా మందులు డోర్ డెలివరీ చేసేవాడు. ఈ నెల ఒకటో తేదీ మప్పేడులోని శ్రీఅమ్మన్ మెడికల్ దుకాణం నుంచి మందులు తీసుకుని కొండంజేరి గ్రామంలో డెలివరీ చేయడానికి వెళ్లాడు. కొండజేరి వద్ద పశువులు అడ్డు రావడంతో ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు 108లో తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన తరువాత మెరుగైన చికిత్స కోసం చెన్నై వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు మప్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు



తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి వరకు 59,335 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 23,271 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.29 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 2 గంటల్లో దర్శనమవుతోంది.

తిరుమల ఘాట్ రోడ్డులో భారీ కొండచిలువ

తిరుమల: మొదటి ఘాట్ రోడ్డులో భారీ కొండచిలువ సంచారం కలకలం సృష్టించింది. శుక్రవారం రాత్రి మొదటి ఘాట్ రోడ్డులోని ఏడో మైలు వద్ద దాదాపు ఎనిమిది అడుగుల కొండచిలువ రోడ్డుపైకి వచ్చింది. దీంతో వాహనదారులు భయాందోళనలకు గురయ్యారు. అనంతరం కొంత సమయానికి రోడ్డుపై నుంచి కొండచిలువ అటవీప్రాంతంలోనికి వెళ్లిపోయింది. దీంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా నాగాలమ్మ మహాకుంభాభిషేకం

- భారీగా తరలివచ్చిన భక్త జనం
- ఆలయంలో విశేష పూజలు



గోపుర కలశాలకు పుణ్యతీర్థాలతో మహాకుంభాభిషేకం, హాజరైన భక్తులు

పళ్లిపట్టు: నాగాలమ్మ ఆలయ మహాకుంభాభిషేకం భక్తజనం నడుమ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పళ్లిపట్టు యూనియన్ నొచ్చిలి గ్రామ పంచాయతీలలోని కాప్పూర్‌కండ్రిగ గ్రామంలో నూతనంగా గ్రామీణుల విరాళాలతో నాగాలమ్మ ఆలయం నిర్మించారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజుల పాటు మహాకుంభాభిషేకం వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో హోమగుండాలు ఏర్పాటు చేసి నిత్య యాగపూజలు చేశారు. శుక్రవారం ఉదయం 4వ కాల పూజలు పూర్తిచేసి మహాపూర్ణాహుతి నిర్వహించి భక్తుల నడుమ పవిత్ర పుణ్యతీర్థాలను గోపుర కలశానికి పుణ్యతీర్థాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులపై పుణ్యతీర్థాలు వెదజల్లారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేసి కర్పూరహారతులతో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త వెంకటేశులు నాయుడు, ఆలయ కార్యవర్గ కమిటీ సభ్యులు కృష్ణమనాయుడు, వెంకటరత్నం నాయుడు, డి. సుబ్రహ్మణ్యంనాయుడు, సునీల్‌కుమార్, వెంకటేశులు ఏర్పాట్లు చేశారు.

విద్యుత్‌షాక్‌కు గురై మహిళ మృతి


వీరమ్మాల్ (ఫైల్)

తిరువళ్లూరు: ఫ్రిడ్జ్‌ను పక్కకు నెట్టి ఇంటిని శుభ్రం చేయడానికి యత్నిస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ మహిళ మృతిచెందింది. తిరువళ్లూరు జిల్లా వానియ సత్రం గ్రామానికి చెందిన శ్రీనివాసన్ భార్య వీరమ్మాల్(47). ఈమె ఇంటిని శుభ్రం చేసేందుకు ఫ్రిడ్జ్‌ను పక్కకు లాగడానికి యత్నిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై స్పృహకోల్పోయింది. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతురాలి భర్త శ్రీనివాసన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంగల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దీపావళి చీటీల పేరుతో రూ.10 కోట్ల మోసం

- లారీ ఢీకొని మృతి

అన్నానగర్: దీపావళి చీటీల పేరుతో రూ.10 కోట్లు మోసం చేసిన కిరాణా వ్యాపారి గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. డబ్బులు తీసుకుని మోసపోయిన వ్యక్తులు ఆయన ఇంటిపై దాడి చేసి నిరసనకు దిగారు. వివరాలు.. చెన్నై సైదాపేట పిల్లియార్ కోయిల్ స్ట్రీట్‌కు చెందిన వర గణేశన్ (45) అదే ప్రాంతంలో ప్రొవిజినల్ స్టోర్స్ నడుపుతున్నాడు. ఏడేళ్లుగా దీపావళి చీటీలు నడుపుతున్నాడు. సైదాపేట పరిసర ప్రాంతాల ప్రజల అధిక సంఖ్యలో చీటీలు వేశారు. సుమారు రూ.10 కోట్ల వరకు వసూలు చేశాడు. అయితే నగదు ఇవ్వకుండా పరారయ్యాడు. దీంతో బాధితులు క్రైమ్ బ్రాంచ్‌లో గణేశన్‌పై ఫిర్యాదు చేశారు. చాలా రోజులుగా అజ్ఞాతంలో ఉన్న గణేశన్ గురువారం రాత్రి వానగరం వద్ద పూందమల్లి హైవేపై రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. కోయంబేడు ట్రాఫిక్ పోలీసులు గణేశన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పూందమల్లికి చెందిన సెల్వరాజ్‌ను అరెస్టు చేసి విచారిస్తున్నారు. కాగా బాధితులు గణేషన్ ఇంటిని ముట్టడించారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి వారికి నచ్చజెప్పి పంపారు.

ఘనంగా వైట్ కోట్ వేడుకలు


వైద్య కోర్సుల్లోకి ప్రవేశించిన విద్యార్థులకు వైట్ కోట్లను అందజేసిన నిర్వాహకులు

సాక్షి, చెన్నై: చెన్నైకి చెందిన స్టడీ అబ్రాడ్ ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ నేతృత్వంలో రష్యాలోని ప్రముఖ పబ్లిక్ రీసెర్చ్ యూనివర్సిటీలలో ఒకటైన ఇమ్మాన్యుయేల్ కాంట్ బాల్టిక్ ఫెడరల్ యూనివర్సిటీ మొదటి సంవత్సరం భారతీయ విద్యార్థుల స్వాగతం పలికే విధంగా వైట్‌కోట్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో 30కి పైగా మొదటి సంవత్సరం భారతీయ విద్యార్థులకు వైద్య వృత్తిలో ప్రవేశాన్ని సూచించడానికి తెల్లటి కోటును అందించారు. యూనివర్సిటీలోని సీనియర్ విద్యార్థులచే తయారుచేసిన ప్రతి తెల్ల కోటుపై విద్యార్థి పేరు ముద్రించి అందించారు. ఇమ్మాన్యుయేల్ కాంట్ బాల్టిక్ ఫెడరల్ యూనివర్సిటీకి చెందిన ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ అండ్ యూత్ పాలసీ వైస్ రెక్టార్ ఓల్గా కిమ్, విశ్వవిద్యాలయం డైరెక్టర్ డారియా గెర్బెర్, స్టడీ అబ్రాడ్ డైరెక్టర్ సురేష్ బాబు పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు. ఎంబీబీఎస్ కోర్సులో రెండవ, మూడవ, నాల్గవ సంవత్సరాలు చదువుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు వారి విద్యా పరిశోధన విజయాలను గుర్తించేందుకు స్టడీ అబ్రాడ్ నుంచి 1,000 యూఎస్ డాలర్ల నగదు బహుమతిని పంపిణీ చేశారు. స్టడీ అబ్రాడ్ రష్యన్ విశ్వవిద్యాలయంలో భారతీయ వైద్య విద్యార్థులకు ఉచిత శిక్షణ, కోచింగ్‌ను అందజేస్తున్నట్లు సురేష్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం


రికేష్ (ఫైల్)

తిరువళ్లూరు: రోడ్డు ప్రమాదంలో కళాశాల విద్యార్థి మృతి చెందిన ఘటన ఎల్లాపురంలో విషాదాన్ని నింపింది. తిరువళ్లూరు జిల్లా ఎల్లాపురం యూనియన్ తామరకుప్పం గ్రామానికి చెందిన శ్రీనివాసన్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు రికేష్(24) పెద్దపాళ్యం సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. బుధవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై పాలవాక్కం గ్రామానికి చెందిన స్నేహితుడు శాంతకుమార్(22)తో కలిసి కళాశాలకు బయలుదేరాడు. కళాశాలకు వద్దకు రాగానే మరో స్నేహితుడిని ఎక్కించుకుని కళాశాల గేటు నుంచి ముందుకు సాగారు. అయితే ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడపడానికి యత్నించడంతో అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం రికేష్ మృతి చెందాడు. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు.

కాణిపాకం..పుష్ప సోయగం


అలంకార మండపంలో కలశ పూజ చేస్తున్న అర్చకులు


ధ్వజస్తంభానికి సర్వాంగ సుందరంగా అలంకరించిన పుష్పాలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం పవిత్రోత్సవాల సందర్భంగా పుష్పాలంకరణతో అలరాలుతోంది. పుష్పాలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈనెల 2న ప్రారంభమైన పవిత్రోత్సవాలు 5వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయ వీఐపీ గేట్ వద్ద స్వాగత తోరణాలు, ఆలయ పరిసరాలు, ధ్వజస్తంభాన్ని పరిమళభరిత పుష్ప తోరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

వక్రతుండ మహాకాయ..

కాణిపాకం(యాదమరి): ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే పూజలు, ఉత్సవాల్లో భక్తులు, సిబ్బంది కారణంగా దోషాలు జరిగి ఉంటే ఆలయ పవిత్రతకు ఎలాంటి భంగం వాటిల్లకుండా ఆగమ శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా రెండో రోజు ఉదయం 6 గంటలకు అలంకార మండపంలో విఘ్నేశ్వర పూజతో రెండవ రోజు పవిత్రోత్సవాలను ప్రారంభించారు. రాత్రి 9 గంటల వరకు పుణ్యాహవచనం, మృత్యం గ్రహణం, వాస్తు శాంతి, అంకురార్పణ, రక్షా బంధనం, కలశస్థాపన పూజలు చేశారు. రెండవ కాల పూజ, మండలేశ్వర ప్రతిష్ట, హోమం, గంధ పవిత్రం, అమంత్రణ, పూర్ణాహుతి, దీపారాధన, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. నైవేద్యం, మంత్ర పుష్పం, వ్రత సమర్పణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు దంపతులు, అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట సమీపంలోని తారాచ్చి వద్ద సుమారు 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కావడం కలకలం సృష్టించింది. తారాచ్చి వద్ద శేఖర్‌కు చెందిన వ్యవసాయ భూమి ఉంది. ఈ పొలంలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు వీఏఓ అరుణ్‌పాండ్యన్, ఊత్తుకోట పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వచ్చిన ఊత్తుకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

క్రీడా మైదానంలో వృద్ధుడి మృతి

తిరువళ్లూరు: క్రీడా మైదానంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరులో చోటుచేసుకుంది. కడంబత్తూరు యూనియన్ వెన్మనంబుదూరు గ్రామానికి చెందిన మణి(85) వివాహం కాకపోవడంతో అదే ప్రాంతంలో ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి బయటకు వెళ్లిన వృద్ధుడు సమీపంలోని క్రీడామైదానంలో మృతి చెందినట్లు స్థానికులు మృతుడి సోదరుడి కుమారుడు మనోహరన్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వచ్చిన మనోహర్ మృతదేహాన్ని తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కడంబత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య

తిరువళ్లూరు: భార్యతో గొడవపడి మనస్తాపంతో భర్త ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరువళ్లూరు జిల్లా ఆరంబాక్కం సమీపంలోని పెద్ద ఓబులాపురం గ్రామానికి చెందిన మారిముత్తు కుమారుడు రోస్‌ప్రకాష్(33)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దంపతుల మధ్య ఇటీవల ఘర్షణ జరిగింది. తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. పలు చోట్ల గాలించినా ఫలితం లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గ్రామానికి సమీపంలోని ఆలయం వద్ద చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆరంబాక్కం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్యాంపర్‌ను ఢీకొన్న టిప్పర్

చిల్లకూరు: ముందు వెళ్తున్న క్యాంపర్‌ను అధిగమించే క్రమంలో టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం మండలంలోని టోల్ ప్లాజా సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు వివరాల మేరకు ఇలా ఉన్నాయి.. నెల్లూరుకు చెందిన కొంతమంది చెన్నైకి వెళుతుండగా టోల్ ప్లాజా దాటిన తరువాత సబీనా పరిశ్రమ వద్దకు వచ్చే సరికే అదే మార్గంలో సిలికాను తరలిస్తున్న టిప్పర్ ముందు వెళుతున్న క్యాంపర్‌ను అధిగమించే క్రమంలో ఢీకొట్టింది. క్యాంపర్ రోడ్డు పక్కనే నిలిపి ఉన్న మరో వాహనాన్ని ఢీకొంది. దీంతో క్యాంపర్‌లో ప్రయాణించే ముగ్గురికి గాయాలయ్యాయి. టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది వెంటనే గాయాపడిన వారిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

భార్యపై హత్యాయత్నం

తిరుపతి క్రైం: నగరానికి చెందిన వ్యక్తి భార్యను హత్య చేయడానికి యత్నించిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు, పెనుమూరుకు చెందిన మురళి తిరుపతిలో బ్యాంకు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. తాను బీటెక్ చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నట్లు నమ్మించి తిరుపతికి చెందిన యమున (25)ను పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. వీరు ఎర్రమిట్టలోని రాయలవారివీధిలో నివాసం ఉంటున్నారు. పెళ్లి తరువాత నిజం తెలుసుకున్న యమున నిలదీయడంతో నిత్యం గొడవ జరుగుతుండేది. గురువారం అర్ధరాత్రి భార్యతో గొడవపడిన మురళి ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. దీంతో ఆమె తీవ్రగాయాలపాలైంది. స్థానికులు 108 ద్వారా రుయాకు తరలించారు. అక్కడ యమున నుంచి మేజిస్ట్రేట్ వాంగ్మూలం తీసుకున్నారు. ఆ మేరకు అలిపిరి పోలీసులు మురళిపై హత్యాయత్నం కేసు నమోదుచేశారు.

తండ్రినే హత్య చేసి పూడ్చేసింది..


ఉజ్జయినప్ప (ఫైల్)

బైరెడ్డిపల్లె : మండలంలోని నాచుకుప్పం గ్రామానికి చెందిన ఉజ్జయినప్ప (38) హత్యకు గురైన విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు..ఉజ్జయినప్ప కనిపించడం లేదని వారం కిందట కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ మోహన్‌కుమార్ కేసు నమోదు చేశారు. గురువారం ఉజ్జయినప్పను హత్య చేసి లక్కనపల్లె చెరువులో పూడ్చి పెట్టారని వదంతులు రేగాయి. దీంతో సీఐ కృష్ణమోహన్, తహశీల్దార్ కుమారస్వామి, రెవెన్యూ అధికారులు లక్కనపల్లె చెరువు వద్దకు చేరుకుని లభించిన ఆనవాళ్ల ప్రకారం తవ్వగా ఉజ్జయినప్ప మృతదేహం బయటపడింది. పోలీసుల విచారణలో పలు విషయాలు బయటపడ్డాయి. ఉజ్జయినప్ప కుమార్తె తావడకుప్పం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని ప్రేమించింది. ఇందుకు ఉజ్జయినప్ప అడ్డు చెప్పాడు. దీంతో ప్రేమికుడితో కలిసి తండ్రిని హత్య చేసేందుకు పన్నాగం పన్నింది. వారం రోజుల కిందట ఉజ్జయినప్పకు పథకం ప్రకారం పూటుగా మద్యం తాగించి లక్కనపల్లె చెరువు వద్దకు తీసుకెళ్లి హత్య చేసి, అక్కడే పూడ్చి పెట్టారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించారు.

నిషేధ దగ్గు మందు విక్రయం.. వ్యక్తి అరెస్ట్

తిరువొత్తియూరు: ప్రభుత్వం నిషేధించిన దగ్గు మందును విక్రయించిన దుకాణ యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. రూ. 28,500 విలువ కలిగిన 150 దగ్గు మందు బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. చెన్నై అంబత్తూరు అయపాక్కం అత్తిపట్టు రోడ్డులో మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు నిఘా ఉంచారు. అనుమానాస్పదంగా సంచి పెట్టుకుని వస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. అతను దగ్గు మందు తీసుకుని వెళుతున్నట్లు తెలిసింది. పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి విచారణ చేయగా అతను అత్తిపట్టు ఐసీఎఫ్ కాలనీకి చెందిన అశోక్ (38) అని.. అదే ప్రాంతంలో మెడికల్ షాపు నడుపుతున్నాడని తెలిసింది. ప్రభుత్వం నిషేధించిన దగ్గు మందు విక్రయిస్తున్నట్లు తెలిసింది. కొందరు మత్తు కోసం ఈ మందు తీసుకుంటున్నట్లు తెలిసింది. దీంతో అశోక్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ. 28,500 విలువ కలిగిన 150 దగ్గు మందు బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

వ్యభిచార గృహ నిర్వాహకులకు పదేళ్ల జైలు


నిందితులు చిత్రదేవి, దస్తగిరి

తిరువళ్లూరు: బాలికలతో బలవంతంగా వ్యభిచారం చేయించిన ఇద్దరికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తిరువళ్లూరు కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలు.. చెన్నై మనలి ప్రాంతానికి చెందిన చిత్రాదేవి(46), దస్తగిరి(39) అదే ప్రాంతంలో ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహించేవారు. 2014లో తిరువొత్తియూర్‌కు చెందిన తిరునావుక్కరసు చిత్రాదేవి, దస్తగిరిని సంప్రదించి తాను నిర్వహిస్తున్న వ్యభిచార కూపానికి 18 ఏళ్లలోపు బాలికలు పంపాలని కోరాడు. ఇందులో భాగంగానే ఇద్దరు బాలికలను తీసుకుని తిరునావుక్కరసు నిర్వహిస్తున్న వ్యభిచార గృహానికి వెళ్లారు. సీబీసీఐడీ పోలీసులకు అందిన రహస్య సమాచారం మేరకు అదే రోజు పోలీసులు తనిఖీలు చేపట్టారు. మనలికి చెందిన చిత్రాదేవి, దస్తగిరి, తిరునావుక్కరసు పట్టుబడ్డారు. వీరిని అరెస్టు చేశారు. కేసు విచారణ తిరువళ్లూరు మహిళ కోర్టులో సాగింది. కేసు విచారణలో ఉండగా 2021లో తిరునావుక్కరసు అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. కేసు విచారణ ముగిసిన నేపథ్యంలో న్యాయమూర్తి సుభద్రదేవి తీర్పును వెలువరించారు. బాలికలతో వ్యభిచారం చేయించిన వ్యవహారంలో చిత్రాదేవి, దస్తగిరికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.7 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 20 నెలలు అదనంగా శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి ఆదేశించారు. నిందితులను పుళల్ జైలుకు తరలించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

తిరువొత్తియూరు: మధురై జిల్లా ఉసిలంబట్టి సమీపంలోని చెల్లంపట్టిలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఇక్కడ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా సెల్వి (59) బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈమె భూముల రిజిస్ట్రేషన్ కోసం రూ.10 వేలు లంచం తీసుకుంటున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ సత్య శీలన్ నేతృత్వంలో పోలీసులు చెల్లంపట్టి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేశారు. సబ్ రిజిస్ట్రార్ సెల్వి వద్ద లెక్కలోకి రాని రూ. 90 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా క్లార్క్ చంద్రన్ (34) నుంచి రూ.2.48 లక్షలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తిరుచ్చిపై పద్మావతి అమ్మవారు


తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీపద్మావతి అమ్మవారు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని అలంకార మండపంలో విద్యుత్ కాంతుల నడుమ అమ్మవారి ఊంజల్‌సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సర్వాలంకార శోభితురాలైన అమ్మవారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ డిప్యూటీఈఓ రామ్మోహన్, సుభాస్కర్ నాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో ముందుకు సాగండి


అతిథిని సత్కరిస్తున్న నిర్వాహకులు

సాక్షి, చెన్నై: సాంకేతికతను అందుపుచ్చుకొని విద్యార్థులు వినూత్న ఆవిష్కరణ వైపు అడుగులు వేయాలని కాగ్నిజెంట్ సంస్థ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సవీతా ఇంజినీరింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో డ్రెస్టయిన్ -23 పేరిట 14వ జాతీయ స్థాయి ఇంటర్–కాలేజియేట్ టెక్నికల్ అండ్ మేనేజ్‌మెంట్ ఫెస్ట్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సదస్సులో 95 ఈవెంట్‌లు, దాదాపు 7,000 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో టాలెంట్ అక్విజిషన్ హెచ్‌ఆర్– మేనేజర్ విమల్ రాజేంద్రన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఎన్‌హెచ్‌ఎంలో 60 పోస్టుల భర్తీ

- 9వ తేదీన ఇంటర్వ్యూకు ఏపీ మెడికల్ బోర్డ్ నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్యశాఖలోని నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)పరిధిలో 60 పోస్టుల భర్తీకి ఈనెల 9వ తేదీన వాక్–ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను శుక్రవారం ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ ఎం. శ్రీనివాసరావు విడుదల చేశారు. టెలీమానస్ కాల్ సెంటర్, స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)లతో పాటు వివిధ కార్యక్రమాల్లో 60 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. కార్డియాలజిస్ట్/జనరల్ మెడిసిన్, కన్సల్‌టెంట్ మెడిసిన్, జనరల్ ఫిజిషియన్ పోస్టులు 29 ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులకు రూ.1.10 లక్షలు చొప్పున వేతనాలు ఉంటాయి. అదే విధంగా ఎస్ఎన్‌సీయూల్లో 22 పిల్లల వైద్యుల పోస్టులు ఉండగా, మైదాన ప్రాంతాల్లో రూ.1.10 లక్షలు, గిరిజన ప్రాంతాల్లో 1.40 లక్షలు చొప్పున వేతనాలు నిర్ణయించారు. https://hmfw. ap.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి నోటిఫికేషన్‌ను అందుబాటులో ఉంచారు. అర్హులైన అభ్యర్థులు 9వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల మధ్య మంగళగిరిలోని ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరవ్వాల్సి ఉంటుంది.

ఫైనల్ ఎంబీబీఎస్ పార్ట్–1 ఫలితాలు విడుదల

లబ్బీపేట(విజయవాడ తూర్పు): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఈ ఏడాది అక్టోబర్‌లో నిర్వహించిన ఫైనల్ ఎంబీబీఎస్ పార్ట్–1 ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాలపై రీటోటలింగ్ కోరే విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్‌కు రూ.2 వేలు చెల్లించి ఈ నెల 13 లోపు దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

'సీస్' సర్వే పరీక్ష ప్రశాంతం

సాక్షి, అమరావతి : రాష్ట్రవ్యాప్తంగా స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎస్సీఈఆర్టీ ఫరక్ నేతృత్వంలో నిర్వహించిన ఈ సర్వే పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా 27,406 పాఠశాలల్లో 7,06,934 మంది విద్యార్థులు హాజరయ్యేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. గుంటూరు జిల్లా మందడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పరీక్ష నిర్వహణ తీరును రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పరిశీలించారు. ఈయనతోపాటు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి ప్రతాపరెడ్డి, గుంటూరు జిల్లా డీఈవో శైలజ తదితరులు పాల్గొన్నారు. మరో వైపు ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో వీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాల, కె.ఎస్.ఆర్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలను సందర్శించి, పరీక్ష నిర్వహణ తీరును సమగ్ర శిక్ష ఎస్పీడీ బీ శ్రీనివాసరావు పరిశీలించారు. ఎస్పీడీ వెంట ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సి.రేణుక, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ కె.వి.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఇగ్నో' పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) డిసెంబర్ 2023లో నిర్వహించే టర్మ్ ఎండ్ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించే పరీక్ష ఫీజు గడువు తేదీని ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుమలత తెలిపారు. అలాగే 11వ తేదీ నుంచి రూ.1,100 ఆలస్య రుసుముతో ఆఫ్‌లైన్ ద్వారా ప్రాంతీయ కేంద్రంలో నేరుగా చెల్లించవచ్చని పేర్కొన్నారు. డిసెంబర్ సెషన్‌కు సమర్పించే అసైన్‌మెంట్ తేదీని కూడా ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని లేదా 0866–2565253 ఫోన్ ద్వారా గాని సంప్రదించవచ్చని తెలిపారు.

బాలినేని కుటుంబానికి సంబంధం లేదు

- ఒంగోలు భూ అక్రమాల్లో ఎమ్మెల్యే బాలినేనిపైన, ప్రభుత్వంపైన ఆరోపణలు సరికాదు
- బాలినేని సిట్ దర్యాప్తును అడ్డుకుంటున్నారన్నది వాస్తవం కాదు
- వార్తా కథనాలు ప్రచురించే ముందు వివరణ తీసుకోవాలి
- బాలినేని సోదరుడి సివిల్ భూ వివాదాన్ని భూ కబ్జా కోవలోకి తేవటం సరికాదు
- ఈ భూ అక్రమాలపై విచారణ జరపాలని బాలినేనే స్వయంగా చెప్పారు
- బాధితులకు న్యాయం చేయాలని కూడా కోరారు
- నకిలీ, ఫోర్జరీ డాక్యుమెంట్ల దందా పన్నెండేళ్లకు పైగా జరుగుతోంది
- సిట్ ద్వారా లోతైన దర్యాప్తు చేస్తున్నాం.. బాధితులకు న్యాయం చేస్తాం
- ఈ వ్యవహారం నడుపుతున్నది పూర్ణచంద్రరావు బృందం
- ఈ బృందంలోని 72 మందిలో 38 మందిని ఇప్పటికే అరెస్టు చేశాం
- మిగిలిన వారినీ త్వరలో అరెస్టు చేస్తాం
- దర్యాప్తు వివరాలు వెల్లడించిన ప్రకాశం జిల్లా కలెక్టర్, ఎస్పీ


విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, పక్కన ఎస్పీ మలికాగర్గ్, జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్/సబర్బన్: 'నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపు పేపర్లు, ఫోర్జరీలతో ఒంగోలులో జరిగిన భూ అక్రమాలతో ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్ స్పష్టంచేశారు. బాలినేనిపైన, ప్రభుత్వంపైన చేసిన ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదన్నారు. ఒంగోలు భూ దందాపై సిట్ దర్యాప్తును బాలినేని కుటుంబం ముందుకు సాగనివ్వడంలేదంటూ కథనాలు ప్రచురించటం సరికాదని చెప్పారు. బాలినేని కుటుంబం దర్యాప్తును ఎప్పుడూ అడ్డుకోలేదని అన్నారు. అవాస్తవాలను, అసత్య కథనాలను ప్రచురిస్తే అవి రాజకీయ జీవితంలో ఉండేవారి భవిష్యత్తుపై ప్రభావం చూపిస్తాయన్నారు. ఇలాంటి కథనాలు ప్రచురించేటప్పుడు, ప్రసారం చేసేటప్పుడు సరైన వివరణ తీసుకోవాలని చెప్పారు.

ఒంగోలులో నకిలీ డాక్యుమెంట్లతో జరిగిన భూ కబ్జాలపై సిట్ దర్యాప్తు వివరాలను కలెక్టర్, ఎస్పీ శుక్రవారం ఇక్కడ మీడియాకు వివరించారు. భూ కబ్జాలపై ఒంగోలు జెడ్పీటీసీ, మేయర్ గంగాడ సుజాత, మరికొందరు ఇచ్చిన వేర్వేరు ఫిర్యాదుల మేరకు సిట్ ద్వారా నిష్పాక్షికమైన, వేగవంతమైన దర్యాప్తు చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఎమ్మెల్యే బాలినేని సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి భూమి వివాదంలో ఉందని, దాన్ని భూ కబ్జా కోవలోకి తేవటం సరికాదని అన్నారు. ఆ భూమి 40 ఏళ్లుగా బ్యాంకు లావాదేవీల ప్రక్రియలో ఉందన్నారు. సివిల్ పంచాయితీలను కూడా భూ కబ్జాల కింద కథనాలుగా ఇవ్వడం వల్ల సిట్ దర్యాప్తు పక్కదారి పట్టే ప్రమాదం ఉందన్నారు. నకిలీ డాక్యుమెంట్లు, భూకబ్జాల వ్యవహారంపై లోతైన దర్యాప్తు జరిపి, బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డే స్వయంగా చెప్పారన్నారు. సిట్‌లో ఇద్దరు ఏఎస్పీలు, ముగ్గురు డీఎస్పీలు, 17 మంది సీఐలు, ఎస్సైలు ఇతర పోలీస్ సిబ్బంది ముమ్మరంగా పని చేస్తున్నారని చెప్పారు. రెవెన్యూ విభాగం తరఫున జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ శాఖ, మార్కాపురం, కనిగిరి సబ్ డివిజన్ల పరిధిలోని ఆర్డీవోలు సిట్ సబ్ కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు.

ఫోర్జరీ, నకిలీ స్టాంపులు, నకిలీ డాక్యుమెంట్ల కుంభకోణంపై ఒంగోలు మండలం ముక్తినూతలపాడుకు చెందిన ఒకరు సెప్టెంబర్ 28న ఫిర్యాదు ఇవ్వడంతో భూ కబ్జాల వ్యవహారం వెలుగు చూసిందని కలెక్టర్ చెప్పారు. దీనిపై విచారణ చేపట్టగా లాయర్‌పేటలోని ఒక ఇంట్లో పూర్ణచంద్రరావు, మరికొందరితో కూడిన బృందం ఈ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. ఆ ఇంట్లో మీ సేవ బ్లాంక్ సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్ స్టాంప్ పేపర్లు, పలు ప్రభుత్వ అధికారులకు సంబంధించిన రబ్బర్ స్టాంపులు లభించాయన్నారు. ఇటువంటి అనేక ఫిర్యాదులు రావడంతో సిట్ ఏర్పాటు చేసి లోతైన విచారణ చేపట్టామని తెలిపారు. ఇప్పటి వరకు 572 డాక్యుమెంట్లు, 60 రబ్బర్ స్టాంప్‌లు, 1,224 జ్యుడిషియల్ స్టాంప్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మార్కాపురం, కనిగిరి పరిధిలో కూడా 5 కేసులు నమోదయ్యాయన్నారు. ప్రైవేటు వ్యక్తుల భూములతో పాటు ప్రభుత్వ భూముల డీకే పట్టాల విషయంలోనూ నకిలీ వ్యవహారాలు జరిగాయని తెలిపారు. ఈ దందా పన్నెండేళ్లకు పైగా జరుగుతున్నట్లు తెలిసిందన్నారు. ఎక్కువ కాలం ఎటువంటి లావాదేవీలు జరగని ఖాళీ స్థలాలకు నకిలీ వీలునామా, జీపీఏ వంటివి సృష్టించి మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. ఎటువంటి సమస్యలు లేని స్థలాలకు సైతం నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, వాటిని గొడవల్లోకి తెచ్చి, కోర్టుల్లో స్టే ఆర్డర్ వంటివి పొందినట్లు కూడా తెలిసిందన్నారు. నకిలీ డాక్యుమెంట్లతో భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. ఈ వ్యవహారాల్లో అక్రమాలపై లోతైన దర్యాప్తు చేసి కారకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు, ప్రభావం లేకుండా పూర్తి స్వేచ్ఛగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ అంశంపై స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వాలపై ఆరోపణలు చేయడం వారిని వ్యక్తిగతంగా బాధించడమే అవుతుందని చెప్పారు. విషయాలను పూర్తిగా తెలుసుకుని వార్తా పత్రికలు, టెలివిజన్ ఛానళ్లు వార్తలను ప్రచురించడం, ప్రసారం చేయడం చేయాలన్నారు.

ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నామని, సిట్ బృందం వేగంగా, నిరంతరాయంగా దర్యాప్తు చేస్తోందని తెలిపారు. దీనిపై ఇప్పటివరకు 54 కేసులు నమోదయ్యాయన్నారు. పూర్ణచంద్రరావు బృందంలో 72 మంది ఉన్నారని, వారిలో 38 మందిని ఇప్పటికే అరెస్టు చేశామని తెలిపారు. మిగిలిన వారిని త్వరలో అరెస్టు చేస్తామన్నారు. ఈ వ్యవహారంలో బాధితులకు న్యాయం చేయాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మొదటి నుంచి చెబుతున్నారన్నారు. సిట్ దర్యాప్తుపై బాలినేని ప్రభావం ఉందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు.

ఉద్యాన వర్సిటీలో మూడో విడత కౌన్సెలింగ్ పూర్తి


ఉద్యాన వర్సిటీలో బీఎస్సీ హార్టీకల్చర్ ప్రవేశాలకు పత్రాలు అందిస్తున్న వీసీ టి.జానకిరామ్

తాడేపల్లిగూడెం : డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని తొమ్మిది ఉద్యాన కళాశాలల్లో బీఎస్సీ హార్టీకల్చర్ డిగ్రీ కోర్సు ప్రవేశానికి మూడో దఫా కౌన్సెలింగ్ శుక్రవారం ముగిసింది. వర్సిటీ పరిధిలోని తొమ్మిది ఉద్యాన కళాశాలల్లో మొత్తం సీట్లు 542 కాగా, వీటిలో 360 సీట్లు ఐదు ప్రభుత్వ ఉద్యాన కళాశాలల్లో, మిగిలిన సీట్లు నాలుగు ప్రైవేటు అనుబంధ కళాశాలల్లో ఉన్నాయి. 542 సీట్లలో స్పెషల్ కేటగిరీల కింద దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్సు, స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరీ, మాజీ సైనికోద్యోగుల పిల్లల కేటగిరీ కింద మొత్తం 47 సీట్లు ఉన్నాయి. ఈ స్పెషల్ కేటగిరీ కింద కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది. వీటికి తేదీ తర్వాత ప్రకటిస్తారు. హార్టీకల్చర్ కోర్సులో ప్రవేశానికి వచ్చిన ర్యాంకు ఆధారంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలు కల్పించారు. మొదటి రెండు దఫాల కౌన్సెలింగ్ ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. 495 సీట్లకు కౌన్సెలింగ్ పూర్తి చేశారు. సీటు భర్తీ అయినా విద్యార్థులు చేరకుండా ఉంటే నాలుగో విడతలో ప్రత్యేక కేటగిరీ సీట్లతో పాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు చెప్పారు. కౌన్సెలింగ్ సందర్భంగా ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకిరామ్ మాట్లాడుతూ హార్టీకల్చర్ కోర్సును ఎంపిక చేసుకున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రవేశ పత్రాలను అందజేశారు.

తూత్తుకుడిలో పరువు హత్య

- వివాహమైన మూడో రోజే నవ దంపతుల గొంతుకోసి చంపేసిన వైనం
- స్థానికంగా కలకలం రేపిన ఈ కేసులో ఆరుగురి అరెస్ట్

సాక్షి, చెన్నై: ప్రేమ వివాహం చేసుకొని ముచ్చటగా మూడు రోజులు గడవకుండానే నవ దంపతుల గొంతు కోసి చంపేసిన ఘటన తమిళనాడులోని తూత్తుకుడిలో గురువారం రాత్రి వెలుగుచూసింది. ఈ పరువు హత్య స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన వివరాలు.. తూత్తుకుడి కార్పొరేషన్ పరిధిలోని మురుగేష్ నగర్‌లో ఉన్న ఓ ఎక్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేస్తున్న మారిసెల్వం (24).. ఆ ప్రాంతానికి చెందిన సంపన్న కుటుంబానికి చెందిన యువతి కార్తిక (20)ను ప్రేమించాడు. వీరి వివాహానికి కార్తిక కుటుంబసభ్యులు అంగీకరించకపోవడంతో ఆమెను తీసుకొని మారిసెల్వం కోవిల్‌పట్టికి వెళ్లాడు. అక్కడ మిత్రుల సాయంతో మూడు రోజుల క్రితం ఆమెను పెళ్లి చేసుకున్నాడు. ఈ కొత్తజంట గురువారం మురుగేష్ నగర్‌కు తిరిగి వచ్చారు. అక్కడ ఈ జంట అద్దె ఇంట్లో దిగిన తర్వాత మూడు మోటార్ సైకిళ్లపై వచ్చిన ఆరుగురు ఆ జంటపై దాడిచేసి వారి గొంతులు కోసి హతమార్చారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. శుక్రవారం హంతకులు ఆరుగురిని గుర్తించారు. వారిలో కార్తిక బంధువులు భరత్, రాజపాండి, కరుప్పస్వామి, ఇసక్కితో పాటు ఇద్దరు మైనర్‌లను అరెస్ట్ చేసి పోలీసులు విచారిస్తున్నారు.

బాబు ఉచిత ఇసుక విధానం.. పేదల కోసం కాదు.. పెద్దల కోసం


తక్షణమే ఇసుక అక్రమ తవ్వకాలను ఆపేయాలని 2019, ఏప్రిల్ 4న నాటి టీడీపీ సర్కార్‌కు ఎన్జీటీ అల్టిమేటం జారీ


ఉండవల్లిలోని చంద్రబాబు ఇంటి వెనుక లారీలతో ఇసుక తరలిస్తున్న వైనం

సాక్షి, అమరావతి : పేదలు ఇళ్లు కట్టుకోవడానికి దోహదపడాల్సిన ఉచిత ఇసుక విధానం ద్వారా స్మగ్లర్ల ముఠా భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడిందని శ్రావణ్ కుమార్ అనే న్యాయవాది తమ దృష్టికి తెచ్చిన అంశాలను జాతీయ హరిత ట్రిబ్యునల్ 2019, ఏప్రిల్ 4న ఇచ్చిన తీర్పులో ప్రముఖంగా ప్రస్తావించింది. ప్రజల ఆస్తి అయిన సహజ వనరులను ధర్మకర్తలా పరిరక్షించాల్సిన ప్రభుత్వం.. పర్యావరణ చట్టాలను తుంగలో తొక్కుతూ పూడికతీత, డ్రెడ్జింగ్ పేరుతో ఇసుకను పెద్దల ముఠా దోచుకుంటుంటే ప్రేక్షక పాత్ర వహించడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. సహజ వనరులపై ప్రజలందరికీ సమాన హక్కులు ఉంటాయనే అంశాన్ని గుర్తుచేసింది. ప్రజలకు సమాన హక్కులు ఉన్న సహజ వనరులను కొందరు పెద్దల ముఠాకే దోచిపెట్టడం సమానత్వం సిద్ధాంతాన్ని అవహేళన చేయడమేనని స్పష్టంచేసింది. ఇసుకను యథేచ్ఛగా అక్రమంగా తవ్వేయడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు తీవ్రంగా నష్టం చేస్తుంటే ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరించడాన్ని అప్పట్లో ఎన్జీటీ ఘాటుగా స్పందించింది. అడ్డగోలుగా ఇసుకను తవ్వేయడం ద్వారా పర్యావరణం దెబ్బతిన్నదని.. దానివల్ల ప్రజారోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రజల హక్కులను ఇసుక స్మగ్లర్లు కాలరాస్తుంటే ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడంలో ఆంతర్యమేమిటని నాటి టీడీపీ ప్రభుత్వాన్ని నిలదీస్తూ.. తక్షణమే ఇసుక అక్రమ తవ్వకాలను ఆపేయాలని 2019, ఏప్రిల్ 4న అల్టిమేటం జారీచేసింది.

మహిళా సంఘాల ముసుగులో దోపిడీ..

నిజానికి.. విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం.. ఇసుక రీచ్‌ల నిర్వహణ, అమ్మకాలను స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) మహిళలకు అప్పగిస్తూ తొలుత ప్రకటించింది. మహిళా సంఘాల ముసుగులో ముఖ్యనేత దన్నుతో టీడీపీ ప్రజాప్రతినిధులు ఇసుక రీచ్‌లను హస్తగతం చేసుకుని.. అడ్డగోలుగా ఇసుకను తవ్వేసి, అధిక ధరలకు విక్రయిస్తూ దోచుకున్నారు. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో 2016, మార్చి 4న ఆ విధానాన్ని రద్దుచేసి.. ఉచిత ఇసుక ముసుగులో తమ ముఠా దోపిడీకి అప్పటి సీఎం చంద్రబాబు రాచబాట వేశారు. ఇసుక తవ్వకాలపై ఎన్జీటీ జారీచేసిన మార్గదర్శకాలను తుంగలో తొక్కుతూ.. చంద్రబాబు నివాసం ఉంటున్న అక్రమ కట్టడానికి కూతవేటు దూరంలో ప్రకాశం బ్యారేజ్ జలవిస్తరణ ప్రాంతంలో కృష్ణా నదీ గర్భంలో భారీ పొక్లెయిన్లు, మర పడవలు ఏర్పాటుచేశారు. తద్వారా ఇసుకను తవ్వేసి, అధిక ధరలకు మార్కెట్లో విక్రయించిన ముఠా పెద్దఎత్తున అక్రమార్జన సాగించింది. దీనిపై 2016లోనే రైతులు ఎన్జీటీని ఆశ్రయించారు. పర్యావరణానికి తీవ్రంగా విఘాతం కలిగిస్తున్న ఇసుక తవ్వకాలను నిలిపివేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. దీనిపై విచారించిన ఎన్జీటీ.. 2017, ఫిబ్రవరి 23న ఇసుక అక్రమ తవ్వకాలను ఆపేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.


per year only at the location in question. According to Mr. Sravan Kumar, Advocate, present before the Tribunal, who was counsel in another matter on the same subject matter i.e. Original Application No. 16/2015 decided on 06.12.2018, stated that the cost of sand illegally extracted is not less than Rs. 10,000 crores per year in the State and the operation is continuing for the last more than three years, as policy of Free Sand Mining is dated 04.03.2016. According to him, while policy of free sand mining may help poor people for their individual need, in effect the policy is used to justify mechanised commercial sand mining without mandatory Environment Impact Assessment (EIA) or safeguards mandatorily required as per 'Sustainable Development' and 'Precautionary Principle' which have been held to be part of Article 21 of the Constitution and recognised under Section 20

ఉచిత ఇసుక విధానం పేదలకు కాకుండా పెద్దలముఠా ఆక్రమణకు దోహదపడుతుందంటూ తీర్పులో వ్యాఖ్యానించిన ఎన్జీటీ

> "సహజ వనరులు ప్రజల ఆస్తులు. ప్రభుత్వం ప్రజల ఆస్తులకుధర్మకర్తగా వ్యవహరించాలి. నియంత్రణ లేకుండా ఇసుకను తవ్వి ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించడం అవివేకమైన చర్య. ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వేయడంవల్ల పర్యావరణానికి తీవ్రంగా విఘాతం కలిగింది. ఇలా పర్యావరణానికి విఘాతం కలిగించిన వారి నుంచి పరిహారాన్ని వసూలుచేసి.. దానితో పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భవిష్యత్ తరాలకు సహజ వనరులను అందుబాటులో ఉండేలా చేయడం ప్రభుత్వం బాధ్యత".
>
> – 2019, ఏప్రిల్ 4న ఇచ్చిన తీర్పులో జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) చేసిన వ్యాఖ్య.

ఎన్జీటీ ఆదేశాలు బేఖాతరు..

అయినా.. నాటి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రైతులు మళ్లీ ఎన్జీటీని ఆశ్రయించారు. ఇసుక అక్రమ తవ్వకాలను నిగ్గుతేల్చేందుకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ఎన్జీటీ ఓ కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ 2019 జనవరి 17–18న చంద్రబాబు నివాసం ఉంటున్న అక్రమ కట్టడానికి కూతవేటు దూరంలో స్మగ్లర్ల ముఠా భారీ యంత్రాలతో యథేచ్ఛగా ఇసుక తవ్వుతుండటాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి.. 2019, జనవరి 21న ఎన్జీటీకి నివేదిక ఇచ్చింది. ఈ నివేదిక ఆధారంగా తక్షణమే ఇసుక అక్రమ తవ్వకాలను ఆపేయాలని టీడీపీ సర్కార్‌కు అల్టిమేటం జారీచేసింది. ఇసుక అక్రమ తవ్వకాలతో పర్యావరణాన్ని దెబ్బతీసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి రూ.వంద కోట్ల జరిమానాను విధించింది. ఈ మొత్తాన్ని ఇసుక స్మగ్లర్ల నుంచే వసూలుచేసి చెల్లించాలని స్పష్టంచేసింది.

జెన్‌కో ప్లాంట్లకు ఏపీఎండీసీ బొగ్గు

- మధ్యప్రదేశ్ గనుల నుంచి రాష్ట్రంలోని థర్మల్ కేంద్రాలకు బొగ్గు
- ఏపీఎండీసీ, ఇంధన శాఖాధికారులతో మంత్రి పెద్దిరెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు అవసరమైన బొగ్గుకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థ ఏపీఎండీసీ మధ్యప్రదేశ్‌లో సుల్యారీలో సొంతంగా నిర్వహిస్తున్న బొగ్గు గనుల నుంచి రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాకు ముందడుగు పడింది. వెలగపూడి సచివాలయంలో శుక్రవారం రాష్ట్ర ఇంధన, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఏపీఎండీసీ, గనులు, ఇంధన శాఖాధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఏపీఎండీసీ ఆధ్వర్యంలోని గనుల్లో బొగ్గును రాష్ట్ర అవసరాల కోసం వినియోగించుకునేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని జెన్‌కో అధికారులను మంత్రి ఆదేశించారు. సుల్యారీ గనుల నుంచి బొగ్గు సరఫరా వల్ల అందుబాటు ధరలో ఏపీ జెన్‌కో థర్మల్ ప్లాంట్లకు బొగ్గు అవసరాలు తీరే వీలుందని, ఇందుకోసం నిబంధనల ప్రకారం అనుసరించాల్సిన విధానాన్ని ఖరారు చేయాలని రెండు శాఖల అధికారులకు సూచించారు. త్వరలో ఏపీఎండీసీ నిర్వహించే టెండర్ల ప్రక్రియలో పాల్గొని, తమ అవసరాలకు అనుగుణంగా బొగ్గు కొనుగోలు చేయాలని జెన్‌కో అధికారులను ఆదేశించారు. దీనికి ఏపీఎండీసీ పూర్తి సహకారం అందించాలని కోరారు.

ముందుచూపుతో సీఎం నిర్ణయాలు

రాష్ట్రంలో ఇంధన రంగాన్ని పటిష్టం చేసేందుకు సీఎం వైఎస్ జగన్ ముందుచూపుతో అనేక నిర్ణయాలు తీసుకున్నారని ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి గుర్తుచేశారు. ఏపీఎండీసీ ద్వారా ఇతర రాష్ట్రాల్లో బొగ్గు గనులు నిర్వహించేలా సీఎం ప్రోత్సహించడంవల్లే సుల్యారీ గనుల్లో ఉత్పత్తి ప్రారంభించగలిగామని, ప్రస్తుతం విజయవంతంగా బొగ్గు వెలికితీత జరుగుతోందని తెలిపారు. సీఎం ఆలోచనల అమలు చేసేందుకు ఈ కీలక సమావేశాన్ని ఏర్పాటు చేశామని, ఇకపై కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రాంతాల్లో కోల్ మైన్స్ కోసం నిర్వహించే వేలంలో ఏపీఎండీసీ–ఏపీ జెన్‌కో జాయింట్ వెంచర్‌గా పాల్గొంటాయని చెప్పారు. ఏపీఎండీసీ ద్వారా బొగ్గు వెలికితీత, ఏపీ జెన్‌కో ద్వారా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేస్తామని వెల్లడించారు. బొగ్గు లభించే ప్రాంతంలోనే జెన్‌కో విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, బొగ్గు రవాణా భారం లేకుండా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఏపీఎండీసీ ద్వారా వెలికితీసే బొగ్గును వినియోగించుకోవడం ద్వారా వేసవి కాలంలోనూ బొగ్గు కొరత లేకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. ఈ సమీక్షలో స్పెషల్ చీఫ్ సెక్రటరీలు కె.విజయానంద్ (విద్యుత్ శాఖ), గోపాలకృష్ణ ద్వివేది (గనుల శాఖ), జెన్‌కో ఎండీ కేవీఎస్ చక్రధర్ బాబు, గనుల శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి, ఏపీఎండీసీ సలహాదారులు డీఎల్ఆర్ ప్రసాద్, కె.నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ బిపిన్ కుమార్, జెన్‌కో డైరెక్టర్ ఆంథోని రాజా తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిస్టులకు ఇళ్లస్థలాల' నిర్ణయంపై సర్వత్రా హర్షం


వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, జర్నలిస్టులు

సాక్షి, అమరావతి/మొగల్రాజపురం (విజయవాడ తూర్పు)/నూజివీడు : రాష్ట్రంలోని జర్నలిస్టుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ సీఎం జగన్ ప్రభుత్వం ఇళ్ల పట్టాల పంపిణీకి ఆమోదం తెలపడం చరిత్రాత్మకమైన నిర్ణయమని పలు జర్నలిస్టు సంఘాలు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు సీఎం జగన్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రి మండలి సమావేశం ఆమోదం తెలిపిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా, అంతర్ రాష్ట్ర వ్యవహారాల సలహాదారు దేవులపల్లి అమర్ ఓ ప్రకటన విడుదల చేస్తూ.. ఉమ్మడి ఏపీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన దివంగత సీఎం వైఎస్సార్ తనయుడుగా.. నేడు రాష్ట్రంలోని వేలాది మందికి మేలు చేసే నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని తెలిపారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఇండియా) మాజీ జాతీయ కార్యదర్శి, అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు మరో ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మీడియాలోని ఒక వర్గం నిత్యం రాష్ట్ర ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా మీడియా సంస్థల్లో పనిచేసే నిరుపేద పాత్రికేయుల చిరకాల స్వప్నాన్ని సీఎం నెరవేర్చబోతున్నారని పేర్కొన్నారు. సీఎం జగన్ విశాల దృక్పథంతో అందజేయనున్న ఇళ్ల స్థలాలను జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని సి.రాఘవాచారి ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు విడుదల చేసిన ప్రకటనలో కోరారు. అమరావతి అక్రిడేటెడ్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ చైర్మన్ బి.వి.రాఘవరెడ్డి, వైస్ చైర్మన్ ఎం.విశ్వనాథ రెడ్డి, సెక్రటరీ పి. నాగశ్రీనివాసరావు విడుదల చేసి న ప్రకటనలో జర్నలిస్టుల ఆశలను నెరవేరుస్తూ నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంకు మంత్రుల ధన్యవాదాలు..

రాష్ట్రంలోని అక్రిడేటెడ్ జర్నలిస్టులకు మూడు సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలను కేటాయించాలనే సీఎం జగన్ నిర్ణయం హర్షణీయమని పలువురు మంత్రులు ప్రశంసించారు. సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కొట్టు సత్యనారాయణ, కే నారాయణస్వామి, బూడి ముత్యాలనాయుడు, అంజాద్ బాషా, తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు, కేవీ ఉషశ్రీచరణ్, ఆదిమూలపు సురేష్, డాక్టర్ సీదిరి అప్పలరాజు, మేరుగ నాగార్జున, జోగి రమేష్ జర్నలిస్టుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం..

జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇవ్వనున్నట్లు రాష్ట్ర కేబినెట్ నిర్ణయించడంపై ఏలూరు జిల్లా నూజివీడులోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద నూజివీడు ప్రెస్‌క్లబ్ అండ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు షర్మిల మద్దతు..ఆమె పార్టీ విధాన నిర్ణయం కావచ్చు

- పక్క రాష్ట్ర విషయాల గురించి సీఎం జగన్ పట్టించుకోరు
- చంద్రబాబు స్కాంలు చాలా ఉన్నాయి
- ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి కాబట్టే ఆయనపై సీఐడీ కేసులు
- ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన రూ.వేల కోట్లు పక్కదారి పట్టాయి
- టీడీపీ నేతలు ఇసుక ద్వారా అక్రమాలకు పాల్పడ్డారు
- పురందేశ్వరి రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలా? టీడీపీకి ఉపాధ్యక్షురాలా?
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి : త్వరలో జరగనున్న తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వైఎస్ షర్మిల మద్దతివ్వడం ఆమె పార్టీపరంగా తీసుకున్న నిర్ణయం కావచ్చునని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు. పక్క రాష్ట్ర విషయాల గురించి సీఎం జగన్ పెద్దగా పట్టించుకోరని ఆయన న్నారు. వైఎస్ కుటుంబాన్ని కాంగ్రెస్ ఇబ్బంది పెట్టిందన్న విషయం అందరికీ తెలుసునని.. సోనియా దగ్గరికి వెళ్లినప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు షర్మిలమ్మ కూడా ఉన్నారని గుర్తుచేశారు. అయినా ఆమె పార్టీ విధానపరమైన నిర్ణయంలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతిచ్చి ఉండొచ్చునని ఆయనన్నారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో శుక్రవారం సజ్జల మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

చంద్రబాబు పాలనంతా కుంభకోణాలమయం..

చంద్రబాబు స్కాంలు చాలా ఉన్నాయి. వాటికి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి కాబట్టే కేసులు పెట్టారు. ఎన్నికల సమయంలో ఆయనపై రాజకీయ కక్ష సాధింపు ఎందుకు చేస్తాం. అలాచేసే వాళ్లమైతే అధికారంలోకి వచ్చిన వెంటనే చేసి ఉండే వాళ్లం. తీగ లాగితే డొంక కదిలినట్లు ఇప్పుడు అన్ని ఒక్కొక్కటి బయటకొస్తున్నాయి. నిజానికి.. చంద్రబాబు పాలన అంతా కుంభకోణాలమయం. లిక్కర్ స్కాంలో ఫైనాన్స్ శాఖ, కేబినెట్ నిర్ణయానికి సంబంధం లేకుండా ప్రివిలేజ్ ఫీజు ఎత్తేశారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.1,300 కోట్ల నష్టం జరిగింది. ఈ నిర్ణయం ముఖ్యమంత్రికి సంబంధం లేకుండా జరిగిందంటే ఎలా? చంద్రబాబును విచారించకుండా ఎలా ఉంటాం?

అప్పట్లో ఇసుక ఎక్కడైనా ఉచితంగా దొరికిందా?

ఇక ఉచిత ఇసుక అన్నారు.. అప్పట్లో ఎక్కడైనా అది ఉచితంగా దొరికిందా? ఉచిత ఇసుక అంటే ఎవరికి వాళ్లు తెచ్చుకోవాలి. కానీ, పెద్దపెద్ద పొక్లెయినర్లు పెట్టి దందా చేశారు. ఉచిత ఇసుక పేరుతో ప్రభుత్వానికి రావాల్సిన సొమ్ము నొక్కేశారు. అదే ఇప్పుడు ఇసుకపై ఏటా రూ.765 కోట్లు ప్రభుత్వానికి వస్తోంది. గతంలో ఈ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? టీడీపీ నాయకులు ఇసుక ద్వారా అక్రమాలకు పాల్పడ్డారు. ఇది నిజం. ప్రజలకు కూడా తెలుసు. ఇక ఈ విషయంలో పురందేశ్వరి ఎందుకు మాట్లాడుతున్నారో మాకు స్పష్టత ఉంది. ఆమె ఫిర్యాదు చేస్తే బాబుపై ఎందుకు కేసు పెడతాం. నిజానికి.. చంద్రబాబు వాయిస్‌ను ఆమె బీజేపీ నుంచి వినిపిస్తున్నారు. అసలు పురందేశ్వరి రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలా? టీడీపీకి ఉపాధ్యక్షురాలా? ఇక దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఇక్కడ అనేక పథకాలు తీసుకొచ్చాం.



మార్నింగ్ వాక్‌కు గుంపుగా బయలుదేరుతారు కొందరు.
తోడు లేనిదే కదలరు కొందరు.
ఒంటరిగా బయలుదేరితే పాటలు వింటూ నడుస్తారు కొందరు.
లేదా ఫోన్లు మాట్లాడుతూ ఉభయతారకంగా నడుస్తారు
ఇక మనతో మనం ఉండేది ఎప్పుడు?
ఇప్పుడు 'సైలెంట్ వాకింగ్' ట్రెండింగ్‌లో ఉంది.
అంటే ఫోన్లు, సాటి మనుషులు ఎవరూ లేకుండా
ఒక్కరే మనతో మనం ఉంటూ నడవడం.
దీనివల్ల మానసికంగా, భౌతికంగా
ప్రయోజనం ఉందంటున్నారు నిపుణులు.

ట్రెండ్
సైలెంట్ వాకింగ్

మనతో మనం మాత్రమే

ఉదయం ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా అని ఎదురు చూస్తారు రిటైర్డ్ టీచర్ విశ్వనాథం. ఆయన తన అపార్ట్‌మెంట్‌లో ఉన్న ముగ్గురు నలుగురితో కలిసి ఉదయాన్నే వాకింగ్‌కు వెళతారు. ఫోన్ తీసుకువెళతారు. ఆ ముగ్గురు నలుగురు కలవగానే ఇక కబుర్లు మొదలు. నవ్వులు, పరిహాసాలు ఎలా ఉన్నా ఎంతలేదన్నా రాజకీయాలు చర్చకు వస్తాయి. ఆ తర్వాత ఇంట్లో సమస్యలు చర్చకు వస్తాయి. ఏవో పాత గొడవలు గుర్తుకు వస్తాయి. చిన్నపాటి వాదనలు జరుగుతాయి. ఈలోపు మెసేజ్‌లు, ఫేస్‌బుక్ చెకింగు, ఒక ఫోన్ కాల్ ఎవరిదో మాట్లాడటం... ఉదయాన్నే మనసు, శరీరం తేలిక కావాల్సింది పోయి బరువైపోతాయి.

ఐ.టి. ఫీల్డ్‌లో పని చేసే అవివాహిత చందన సాయంత్రం ఇల్లు చేరుకుని వాకింగ్‌కు బయలుదేరుతుంది. హెడ్‌ఫోన్స్‌లో పాటలు వింటూ నడుస్తుంటుంది. ఆ పాటల్లో పూర్తిగా లీనం కాకుండా మెసేజ్‌లు, కాల్సూ వస్తూనే ఉంటాయి. పాటలు కూడా విన్నవే వినడం వల్ల కొత్త అనుభూతి కలగదు. పాటలు వినాలి కాబట్టి వింటున్నానా అనే సందేహం వస్తుంది.

గృహిణి సుభాషిణి సాయంత్రం వీలు చూసుకుని ఎలాగో వాకింగ్‌కు బయలుదేరుతుంది. కాని ఆమె వాకింగ్‌కు బయలుదేరిన వెంటనే ఊళ్లో ఉన్న తల్లికి ఫోన్ చేయాలి. అది తల్లి ఆమెతో చేసుకున్న అగ్రిమెంట్. కూతురితో మాట్లాడకపోతే ఆమెకు తోచదు. సుభాషిణి వాకింగ్ మొదలెట్టి తల్లికి కాల్ చేయగానే తల్లి ఏవేవో విషయాలు ఏకరువు పెడుతుంది. కొన్ని ఫిర్యాదులు, కొడుకు మీద అభ్యంతరాలు, ఇంకేవో ఇరుగు పొరుగు గాసిప్... ఎంత లేదన్నా అలజడి కలిగిస్తాయి. ఇదా వాకింగ్ అంటే.

సైలెంట్ వాకింగ్ విరుగుడు

టిక్‌టాక్ ఇన్‌ఫ్లుయెన్సర్ మాడీ మాయో మొన్నటి సెప్టెంబర్‌లో ఈ 'సైలెంట్ వాకింగ్'ను ప్రతిపాదించింది. ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, స్మార్ట్ వాచీలతో సహా అన్ని లంపటాలను వదిలి ఎవరితోనూ వాగుడు పెట్టుకోకుండా హాయిగా మౌనంగా మనతో మనం ఉంటూ నడవడం చాలా బాగుంది అని ఆమె పెట్టిన ఒక పోస్టు ఆమెను ఫాలో అయ్యే యువతకు నచ్చింది. అప్పటి నుంచి సైలెంట్ వాకింగ్ మెల్లమెల్లగా ప్రచారం పొందింది.

మన గురించి ఆలోచిస్తున్నామా?

మన గురించి మనం ఆలోచించుకోవడానికి, మన ఆలోచనలు పదును పెట్టుకోవడానికి, మన లక్ష్యం వైపు దృష్టి నిలపడానికి ఎప్పుడూ కూడా ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫోన్లు అడ్డం పడుతూనే ఉన్నాయి. ఆఖరుకు నడకలో కూడా ఏదో ఒక అంతరాయం. ఇంటి నుంచి బయటకు వచ్చినా ఇంటి నుంచి ఫోన్ వస్తే ఇక ఇంట్లో ఉన్నట్టే తప్ప బయట ఉన్నట్టు అనిపించదు. 'సైలెంట్ వాకింగ్ రెండు పనులు చేస్తుంది. ఒకటి మన ఆలోచనలు మనల్ని వినేలా చేస్తుంది... రెండు ప్రకృతిని విని స్పందించేలా చేస్తుంది' అని ఒక సైలెంట్ వాకర్ చెప్పింది. మరో స్టూడెంట్ అయితే 'ఫోన్లు పారేసి హాయిగా అరగంట సేపు నడిస్తే నాకు చాలా స్వేచ్ఛతో ఉన్నట్టు అనిపిస్తోంది. అదీగాక నా చదువు మీద దృష్టి నిలుస్తోంది' అని చెప్పింది.

ఒత్తిడి తగ్గుతుంది


భవ బంధాలు తెంచుకున్నట్టుగా ఏ కమ్యూనికేషన్ లేకుండా కనీసం రోజులో 30 నిమిషాలు ఒక రకమైన ఏకాంత సమయం గడపడమే సైలెంట్ వాకింగ్. దీని వల్ల యాంగ్జయిటీ వంటివి తగ్గి మానసికంగా ఒక ప్రశాంతత వస్తుందని పరిశీలకులు అంటున్నారు. ఐదు నిమిషాలు ఫోన్ కనపడకపోతే కంగారు పడేవారు అరగంట ఫోన్‌ను ఇంట్లో పడేసి బయట పడి నడిస్తే ఆ స్వేచ్ఛ మనసుకు దొరుకుతుంది. ఈ అరగంటలో కొంపలేమీ మునిగిపోవు అని తెలుస్తుంది. మన గుప్పిట్లో ఫోన్ ఉన్నంత సేపు మెడ మీద కత్తి వేళ్లాడుతున్న భావనే... ఎప్పుడు ఎవరు ఏ విధంగా డిస్టర్బ్ చేస్తారో తెలియదు కదా.

ధ్యానంలో కూడా మనల్ని మనం పరిశీలించుకోవడం, ఆలోచనలను పరిశీలించుకోవడం ముఖ్యం అంటారు. సైలెంట్ వాకింగ్‌లో నడుస్తూ అలాంటి పనే చేస్తాం. క్రిక్కిరిసిన జీవితంలో మనవైన ఆలోచనలకు చోటు ఇచ్చి, పాజిటివ్ ఆలోచనలు చేస్తూ ముందుకు పోయేందుకు దోహదం చేసేదే సైలెంట్ వాకింగ్.

మౌన మునులుగా మారి రేపటి నుంచి మౌన నడకకు బయలుదేరండి.

పిల్లలు ఎక్కడో ఉద్యోగాలు చేసుకుంటూ ఉంటారు. తల్లిదండ్రులు ఇంట్లో ఒంటరిగా ఉంటారు. ఇలాంటి ఒంటరి తల్లిదండ్రులను ప్రమాదాల బారి నుంచి రక్షించడానికి కేరళ స్టార్టప్ 'స్మార్ట్‌కేర్' ఎమర్జెన్సీ అలర్ట్ టెక్నాలజీతో కొన్ని పరికరాలను రూపొందించింది....

సేఫ్టీ అలర్ట్స్



హైదరాబాద్ కూకట్‌పల్లిలోని రిటైర్డ్ ఉద్యోగి రాజేశ్వరరావు ఒంటరిగా ఉంటాడు. భార్య రెండు సంవత్సరాల క్రితం చనిపోయింది. కొడుకు, కోడలు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. విశాఖపట్టణంలో ఉండే అనసూయమ్మకు ఒక్కగానొక్క కూతురు పుణెలో ఉద్యోగం చేస్తుంది. అనసూయమ్మ భర్త చనిపోయి చాలా కాలం అయింది.

రాజేశ్వరరావు ఒకరోజు ఇంట్లో కాలు జారిపడ్డాడు. ఆ సమయంలో వేరే ఊరి నుంచి వచ్చిన బంధువు ఒకరు ఉండడంతో ఆయనను త్వరగా హాస్పిటల్‌కు తీసుకువెళ్లాడు.

అనసూయమ్మకు కూడా ఇలాగే జరిగింది. పడిన తర్వాత చాలాసేపటికి ఎవరో ఇంటికి రావడంతో ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మరింత ఆలస్యం అయి ఉంటే అనసూయమ్మ ప్రమాదంలో పడేది.

అయితే అన్ని సందర్భాల్లోనూ ఎవరో ఒకరు వచ్చి బాధితులను హుటాహుటిన హాస్పిటల్‌కు తీసుకువెళతారని గ్యారెంటీ లేదు. ఇక కేరళ విషయానికి వస్తే ఒంటరిగా జీవిస్తున్న వృద్ధుల సంఖ్య అక్కడ ఎక్కువగా ఉంది. వారు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసిందే... స్మార్ట్‌కేర్.

కేరళకు చెందిన వేణునాథ్ స్వీడన్‌లో చదువుకునే రోజుల్లో ఒక వృద్ధురాలి ఇంట్లో అద్దెకు ఉండేవాడు. ఆమె వయసు ఎనభై సంవత్సరాలు. ఆ వృద్ధురాలి ఒంటరి జీవితం చూసి వేణుకు జాలిగా అనిపించేది. ఒక రాత్రి ఆమె అనారోగ్యానికి గురైంది. సీరియస్ అయ్యే పరిస్థితి వచ్చింది. ఆమె తన చేతికి ఉన్న కంకణంలాంటి దానిపై ఉన్న బటన్‌ను నొక్కింది. వెంటనే టేబుల్ మీద ఉన్న పరికరం తనతో మాట్లాడడం మొదలుపెట్టింది. తనకు ఇబ్బందిగా ఉన్న విషయం గురించి చెప్పింది ఆమె. ఇరవై నిమిషాల లోపే వైద్యుడు, సహాయక బృందం ఆమె ఇంటికి వచ్చారు. ప్రాథమిక చికిత్స చేసి హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు.

ఆ సమయంలో ఆ పరికరం గురించి వేణుకు





స్మార్ట్‌కేర్ బృందం

విపరీతమైన ఆసక్తి ఏర్పడి దాని గురించి వివరాలు తెలుసుకున్నాడు. మన దేశంలో కూడా ఇలాంటి టెక్నాలజీ ఉంటే బాగుండేది అనుకున్నాడు.

స్వీడన్‌లో డాటా సైంటిస్ట్‌గా కొంతకాలం ఉద్యోగం చేసిన వేణు ఆ తరువాత ఇండియాకు వచ్చి స్నేహితుడు అరుణ్ నాయర్‌తో కలిసి 'అన్స్‌ఫ్రిడ్ స్మార్ట్‌కేర్ ప్రాడక్స్' కంపెనీ మొదలు పెట్టాడు.

అంతకుముందు ఉద్యోగం చేస్తూనే జీతంలో సగం మొత్తాన్ని వృద్ధులకు ఉపకరించే ఉపకరణాల గురించి రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై ఖర్చు చేసేవాడు. ఎంతోమంది నిపుణులతో మాట్లాడేవాడు.

స్మార్ట్‌కేర్ ఉత్పత్తుల్లో ఒకటి... వైర్‌లెస్ ఫాల్ సెన్సర్. దీన్ని బాత్‌రూమ్ గోడలకు బిగిస్తారు. వృద్ధులు పడిపోతే కంపెనీకి అలర్ట్ పంపుతుంది. కంపెనీ వెంటనే వైద్యులను ప్రమాద బాధితుల ఇంటికి పంపుతుంది. చేతికి ధరించే 'విబ్బీ డిటెక్టర్' కూడా వృద్ధులు ప్రమాదంలో ఉన్నప్పుడు అలర్ట్ పంపుతుంది. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధ పడేవారికి ఇది బాగా ఉపకరిస్తుంది. 'హీట్ అలారమ్' అనేది వైర్‌లెస్ ఇండోర్ సెన్సర్. లాకెట్‌లా మెడలో ధరించవచ్చు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు హెచ్చరిస్తుంది.

తక్కువ బరువుతో ఉండే 'మైఎమీ' లాకెట్ వృద్ధులు ఇల్లు దాటి బయటికి వెళ్లినప్పుడు ఉపయోగపడుతుంది. ఆపద సమయంలో సహాయం కోసం దీనిపై ఉన్న బటన్‌ను నొక్కాలి...'స్మార్ట్‌కేర్' ఉత్పత్తుల్లో ఇవి కొన్ని మాత్రమే.

'స్మార్ట్‌కేర్' నలభై హాస్పిటల్స్‌తో కలిసి పనిచేస్తోంది. కోల్‌కత్తా, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు నగరాలకు కూడా కంపెనీ విస్తరించే ప్రయత్నాల్లో ఉంది.

మొక్కవోని ఆకాంక్ష

ఈ రోజుల్లో ఇంట్లో కూర్చోనే షాపింగ్ చేసి లక్షలు ఖరీదు చేసే వస్తువులను సైతం క్షణాల్లో కొనేస్తున్నారు. వంట చేయడం కుదరనప్పుడో, తినడానికి ఏమీ లేనప్పుడో, బయటకు వెళ్లే ఓపిక లేనప్పుడో వెంటనే ఫుడ్ ఆర్డర్ పెట్టేస్తున్నారు. ఆర్డర్ ఇచ్చిన అరగంటలోపు వేడివేడి ఆహారం ఇంటి గుమ్మం ముందుకు వచ్చేస్తుంది. ఈ డెలివరీ యాప్‌లను ఆధారంగా చేసుకుని మొక్కల వ్యాపారం ప్రారంభించింది ఆకాంక్ష గుప్తా. ఫుడ్ డెలివరీ అయినట్టుగానే మొక్కలు, విత్తనాలు, ఎరువులను ఆర్డర్ ఇచ్చిన గంటల వ్యవధిలో కస్టమర్లకు అందిస్తోంది. కంపెనీ ప్రారంభించిన రెండేళ్లలో కోట్ల టర్నోవర్‌తో నడుస్తోంది. మొక్కలను ఎలా డెలివరీ చేస్తోందో ఆకాంక్ష మాటల్లోనే.....



ఆకాంక్ష

ఢిల్లీలోని మోడల్ టౌన్‌లో నివసించే సాంప్రదాయ ఉమ్మడి కుటుంబం మాది. నాన్న వ్యాపారి. అమ్మ ఇంటి పనులు చూసుకునేది. శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో బీకామ్ హానర్స్ పూర్తయ్యాక...ఉద్యోగం చేస్తాను అని ఇంట్లో వాళ్లకు చెప్పాను. అందరూ ఆశ్చర్యపోయారు. అమ్మాయిలు ఇంట్లో ఉండి పనులు చూసుకుంటుంటే, అబ్బాయిలు బయటకు వెళ్లి పనిచేసి సంపాదించడం పద్ధతి అనేది వాళ్ల నమ్మకం. దీంతో వాళ్లను ఒప్పించడానికి చాలా సమయం పట్టింది. నేను ఉద్యోగం ఎందుకు చేయాలనుకుంటున్నానో అన్నివిధాలుగా వివరించాను. అందుకు వాళ్లు సమ్మతించి ప్రోత్సహించారు. దీంతో ఈఎక్స్‌ఎల్ కంపెనీలో ఉద్యోగంలో చేరాను. ఇక్కడ రెండేళ్లు పనిచేశాక, 2016లో అహ్మదాబాద్ ఐఐఎమ్‌లో ఎమ్‌బీఏ పూర్తిచేశాను. తర్వాత 'డెలాయిట్' మేనేజ్‌మెంట్ కన్సల్‌టెంట్‌గా చేరాను.

లాక్‌డౌన్ మార్చేసింది...

డెలాయిట్‌లో పనిచేస్తున్నప్పుడు... తెలిసిన వాళ్ల అబ్బాయి సంభవ్ జైన్ పరిచయమయ్యాడు. సంభవ్ కూడా ఎమ్ఎన్‌సీలో పనిచేస్తుండడం, ఇరుకుటుంబాలకు నచ్చడంతో 2019లో మా పెళ్లి జరిగింది. పెళ్లి అయిన కొన్నినెలలకే లాక్‌డౌన్ విధించారు. ఇంట్లో ఉండి పనిచేస్తున్నప్పటికీ వారాంతపు సెలవుల్లో చాలా సమయం దొరికేది. మొక్కలు పెంచడం అంటే ఎంతో ఆసక్తి చూపే సంభవ్ సమయం మొత్తం గార్డెనింగ్‌కు కేటాయించేవాడు. సంభవ్ నిర్వహించే వర్క్‌షాపుల్లో ''మొక్కలు ఎలా పెంచాలి? మొక్కలు బాగా పెరిగేందుకు సలహాలు సూచనలు'' సంభవ్‌తో కలిసి నేను చెప్పేదాన్ని. ఆరేడు నెలల్లోను మేము నిర్వహించిన వర్క్‌షాపులకు మూడువేల మందికి పైగా హాజరై గార్డెనింగ్ గురించి తెలుసుకున్నారు. ఇలా లాక్‌డౌన్‌లో మా జీవితాలు గార్డెనింగ్ వైపు మళ్లాయి. ఈ మార్పే మమ్మల్ని వ్యాపార వేత్తలుగా మార్చింది.



ఆకాంక్ష, సంభవ్ జైన్

సమస్యల నుంచి...

వర్క్‌షాపుల్లో చాలా మంది.. మొక్కలు పెంచాలని ఉంది కానీ, మంచి మొక్కలు, కుండీలు, ఎక్కడ కొనాలో తెలియడం లేదు. ఆన్‌లైన్‌లో కూడా మంచి స్టోర్లు ఏవీ లేవు. అరకొర ఆన్‌లైన్ స్టోర్లు కస్టమర్లకు నచ్చడం లేదు'' అని చెప్పారు. దీంతో 2020లో సంభవ్ ఉద్యోగం వదిలేసి 'ది బన్యన్ కంపెనీ' పెట్టాడు. తనకి నేను సాయంగా ఉన్నాను. ఒక దగ్గర నర్సరీ పెంచుతూ అక్కడ నుంచి కస్టమర్లకు ఆర్డర్లు ఇవ్వడానికి రవాణా ఖర్చు ఎక్కువ అవడంతోపాటు, కొన్నిసార్లు రవాణాలో మొక్కలు పాడైపోయేవి. దీంతో మా కంపెనీ బాగా నష్టపోయింది.

ఫుడ్ లా మొక్కలు కూడా...

కంపెనీ అనేక నష్టాలను చూశాక ఎలా కంపెనీని నిర్వహించాలని తీవ్రంగా ఆలోచించాను. అప్పుడే నాకు ఫుడ్ డెలివరీ యాప్స్ గుర్తుకొచ్చాయి. ఫుడ్‌ను డెలివరీ చేసే యాప్స్‌లా మొక్కలను ఎందుకు డెలివరీ చేయకూడదు... అనిపించింది. దీనివల్ల సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయి అనుకుని వెంటనే 2021లో 'ఉర్వాన్.కామ్' కంపెనీని ప్రారంభించాను. అర్బన్, ఫారెస్ట్‌ల నుంచి పదాలను తీసుకుని ఉర్వాన్ పేరు పెట్టాను. ఈ కంపెనీ ప్రారంభించిన వెంటనే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాను. కుటుంబ సభ్యులంతా షాక్ అయ్యారు. ''ఉద్యోగం వదిలేసి సంభవ్ చేసిన వ్యాపారంలో నష్టం వచ్చింది. మళ్లీ ఆకాంక్ష కూడా అదే పని చేస్తోంది. ఈ వ్యాపారం కూడా నష్టపోదని గ్యారెంటీ ఏంటీ? సంభవ్ నువ్వు అయినా ఉద్యోగం చెయ్యి'' అందరు సలహాలు ఇచ్చారు. కొంతమంది అయితే ఈ వ్యాపారం ఎప్పటికీ విజయవంతం కాదన్నారు. కానీ నేను, సంభవ్ ఏమాత్రం వెనక్కు తగ్గకుండా ముందుకు సాగాం. చివరకు ఒక బిజినెస్ అడ్వైజర్ దగ్గరకు వెళ్లి సలహా అడిగితే... ''ఇది అంత మంచి వ్యాపారం కాదు. దీనివల్ల ఆదాయం ఏమీ రాదు. మీ ఇద్దరూ ఉద్యోగాలు చేసుకోవడం మంచిది'' అని సలహా ఇచ్చారు.

వెబ్‌సైట్ క్రియేట్ చేసిన తరువాత నర్సరీ నిర్వాహకులను కలిసి వెబ్‌సైట్‌లో యాడ్ చేశాము. కొంతమందికి కనీసం వాట్సాప్ మెసేజ్‌లు కూడా పంపడం రాదు. ఆన్‌లైన్‌లో మొక్కలు విక్రయించిన అనుభవం ఎవరికీ లేదు. దీంతో అందరికి దీనిలో శిక్షణ ఇచ్చాము. ప్రారంభంలో పెద్దగా ఆదాయం ఏమీ రాలేదు. కానీ రెండు వారాల తరువాత మేము పెట్టిన పెట్టుబడికి తగిన ఆదాయం రావడం మొదలైంది. కస్టమర్లు పెరగడంతో..స్నేహితులు, బంధువులు మా కంపెనీలో పెట్టుబడి పెట్టడం మొదలు పెట్టారు. ఆర్డర్ ఇచ్చిన మరుసటిరోజుకల్లా దగ్గర్లోని నర్సరీల నుంచి కస్టమర్లకు మొక్కలు డెలివరీ ఇస్తున్నాం. దీనికి అదనపు ప్యాకింగ్ చార్జీలు లేకపోవడం, బయటి రేటుకే ఆన్‌లైన్‌లో దొరుకుతుండడంతో ఎక్కువమంది మా దగ్గర కొనడం ప్రారంభించారు. తొలినాళ్లల్లో నెలకు ఐదువందల మొక్కలు విక్రయించడం కష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు నెలకు మూడులక్షలకు పైగా మొక్కలను డెలివరీ ఇస్తున్నాము. ఇద్దరితో ప్రారంభమైన మా వ్యాపారం నేడు పాతిక మందికి చేరింది. మూడు నర్సరీల నుంచి నలభై నర్సరీలు అయ్యాయి. ఢిల్లీ, ఎన్‌సీఆర్‌లోనేగా బెంగళూరులోనూ మా మొక్కలు డెలివరీ ఇస్తున్నాము. వచ్చే సంవత్సరం వంద కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పనిచేస్తున్నాము.

''కొన్నిసార్లు మనం తీసుకునే నిర్ణయాలు ఎవరికీ నచ్చకపోవచ్చు. కానీ ఆ నిర్ణయం మీద, మన మీద మనకు నమ్మకం ఉంటే ఎంతటి కష్టాన్నైనా ఎదుర్కొని విజయం సాధించవచ్చు'' అని ఆకాంక్ష గుప్తా నిరూపించి చూపిస్తోంది.

క్లీనింగ్ టిప్



ఫ్యాబ్రిక్ సోఫాను శుభ్రం చేయడానికి, అరు టీస్పూన్ల బాత్ సోప్ పౌడర్ తీసుకోండి. దీనిలో తగినన్ని వేడి నీళ్లు పోస్తూ బాగా కలపండి. దానికి రెండు టీస్పూన్ల అమ్మోనియా లేదా తెనె జోడించండి. ఆ తరువాత, ఈ ద్రావణాన్ని చల్లబరచండి. చల్లబడిన తర్వాత దానిని బాగా కలిపితే నురగ వస్తుంది. ఇప్పుడు సోఫాపై భాగంలో గుడ్డ లేదా స్పాంజ్ సహాయంతో ఈ నురుగుతో శుభ్రం చేయండి. దీని తరువాత సోఫాను ఫ్యాన్ కింద ఆరనివ్వండి. దీంతో ఫ్యాబ్రిక్ సోఫా కొత్తదానిలా మెరిసిపోతుంది.

హెయిర్ కేర్

మనింటి షాంపూ



షాంపూ ఇంట్లోనే తయారు చేసుకోవచ్చంటే ఈ జనరేషన్ వాళ్లకు ఆశ్చర్యం కలుగుతుందేమో! కానీ నెలకోసారి ఇంట్లోనే షాంపూ చేసుకోవచ్చు. పెద్ద కుంకుడుకాయలు ఇరవై తీసుకోవాలి. వాటిలో గింజలు తొలగించి కాయలను ఒక పలుచని వస్త్రంలో వేసి ముడి కట్టాలి లేదా సంచిలో వేసి మూతిని కట్టేయాలి. ఒక పాత్రలో లీటరు నీటిని పోసి మరిగించి అందులో కుంకుడుకాయల సంచిని వేసి మరగనివ్వాలి. ఇరవైనిమిషాల సేపు మరగనిచ్చి మంటమీద నుంచి దించేయాలి. చల్లారిన తరవాత కుంకుడు కాయలున్న సంచిని నలిపినట్లు పిండాలి. కాయలో మిగిలి ఉన్న రసం కూడా నీటిలో కలుస్తుంది. చిక్కటి డికాక్షన్ తయారవుతుంది. ఇందులో లావెండర్, జాస్మిన్ మరేదైనా ఎసెన్షియల్ ఆయిల్ రెండు చుక్కలు వేసి కలిపి ఈ మిశ్రమాన్ని సీసాలో పోసి నిల్వ చేసుకుని నెలరోజుల పాటు వాడుకోవచ్చు. ఇది హోమ్ మేడ్ హెర్బల్ షాంపూ. తలస్నానం చేసే ముందు పావుకప్పు షాంపూ తీసుకుని తలకు పట్టించి మర్దన చేసినట్లు వేళ్లతో తలంతా రుద్ది తలస్నానం చేయాలి. ఈ షాంపూతో తలస్నానం చేయడం వల్ల చుండ్రు వదలడంతోపాటు చర్మ సమస్యలు కూడా తగ్గిపోతాయి.

- కుంకుడు కాయలను గింజలు తొలగించి తొక్కలను గ్రైండ్ చేసి పొడిని నిల్వ చేసుకుంటే ఎప్పటికప్పుడు షాంపూ తాజాగా చేసుకోవచ్చు. ఈ పొడి ఏడాదిపాటు నిల్వ ఉంటుంది. తలస్నానం చేసేటప్పుడు రెండు టీస్పూన్‌ల పొడిలో రెండు కప్పుల నీటిని పోసి పది నిమిషాల సేపు నానిన తర్వాత ఐదు నిమిషాల సేపు మరిగించి చల్లారిన తర్వాత వడపోసుకుంటే ఆర్గానిక్ హోమ్ మేడ్ షాంపూ రెడీ. సువాసన కోసం నచ్చిన ఎసెన్షియల్ ఆయిల్ రెండు చుక్కలు కలుపుకోవచ్చు. ఈ షాంపూను వడపోయకుండా అలాగే తలస్నానం చేస్తే జుట్టు నుంచి కుంకుడుకాయ పొడిని వదిలించడం పెద్ద పనవుతుంది. కాబట్టి వడపోసుకుని వాడుకోవడమే మంచిది.



- జుట్టు పొడిబారి నిర్జీవంగా ఉంటే పెరుగు మంచి ఫలితాన్నిస్తుంది. ఒక కప్పు పుల్లటి పెరుగు తీసుకోవాలి. జుట్టును చిక్కులేకుండా దువ్వి పెరుగును ఒక్కొక్క స్పూన్ తల మీద వేస్తూ వేళ్లతో మర్దన చేయాలి. తలంతా ప్రతి వెంట్రుక కుదురుకూ పెరుగు పట్టాలన్నమాట. ఓ అరగంట తర్వాత వేడినీటితో తలస్నానం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే జుట్టు చిట్లిపోకుండా మృదువుగా, ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. వేళ్లతో తలంతా మర్దన చేసుకోవడం సాధ్యం కాకపోతే జుట్టు కుదుళ్లకు పెరుగును పట్టించిన తర్వాత గుండ్రటి పళ్లున్న దువ్వెనతో పది నిమిషాల సేపు దువ్వితే సరిపోతుంది.
- జుట్టు రాలుతుంటే బంగాళదుంప రసం బాగా పని చేస్తుంది. బంగాళా దుంపను తురిమి రసం తీసుకోవాలి. అరకప్పు రసంలో రెండు టేబుల్ స్పూన్‌ల కలబంద గుజ్జు కలిపి తలకు పట్టించాలి. జుట్టుకు పైన రాసి సరిపుచ్చకూడదు. కేశాల మొదళ్లకు పట్టేలా రాసి పది నిమిషాల సేపు మర్దన చేయాలి. రెండు గంటల తర్వాత వేడి నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తుంటే జుట్టురాలడం తగ్గిపోతుంది.



రీల్స్ నుంచి రిలీజ్ అవండి ఇక

ఒకప్పుడు రేడియోలో పాటలు వింటూ, ఆ తర్వాత టీవీలో సీరియల్స్ చూస్తూ గంటలు గంటలు గడిపేసేవాళ్లు. ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల మయం అయిపోయింది. దీంతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్, టిక్‌టాక్, మోజో మొదలైన సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే రీల్స్‌ను తెగ చూస్తున్నారు. గంటలకొద్దీ వీటినే చూస్తుండిపోతున్నారు. కొంతమందికి ఇది వ్యసనంలా మారితే, మరికొంతమంది బానిసలైపోయారు. ఇది ఆరోగ్యానికి అంతమంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది రీల్స్ చూడడం మానేయాలనుకున్నప్పటికీ మానలేక తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి వారు ఈ కింది చిట్కాలను పాటిస్తే రీల్స్ జోలికి పోకుండా ఉండవచ్చు. అవేంటో చూసేయండి...



● వినోదం కోసం రీల్స్ చూస్తుంటారు. ఇది వ్యసనంగా మారుతుంది కాబట్టి ఈ ఎంటర్‌టైన్మెంట్‌ను మార్చుకోవాలి. మీకు దొరికే కొద్దిపాటి సమయాన్ని మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి గడపండి. మీకు ఇష్టమైన ఆటలు ఆడడం లేదా మీ హాబీలను పంచుకుంటూ సరదాగా గడపాలి. ఇలా చేయడం వల్ల కొంత సమయం మీ ఫోన్‌కు దూరంగా ఉంటారు. ఫలితంగా రీల్స్ చూడాలనిపించదు.

● వారాంతాలు, సెలవులు, ఖాళీ సమయాల్లో మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండండి. ఇలాంటి సమయాల్లో పార్కుకెళ్లి సరదాగా నడవడం, గార్డెన్ పనులు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడడం వంటివి చేయాలి. వీటిలో ఏది చేసినా విలువైన మీ సెలవు దినం వృథా కాకపోవడంతోపాటు మీ సన్నిహితులతో కలిసి సంతోషంగా గడుపుతూ వారికి మరింత దగ్గరవుతారు.

● మీ ఫోన్లో నోటిఫికేషన్స్‌ను ఆపేయాలి. టిక్‌టిక్ అంటూ పదేపదే వచ్చే నోటిఫికేషన్స్ రీల్స్ చూడాలని మెదడుని ప్రేరేపిస్తాయి. మీకు తెలియకుండానే రీల్స్ ఓపెన్ చేసి గంటలకొద్దీ వాటిలో మునిగి పోతుంటారు. అందుకే రీల్స్ నోటిఫికేషన్స్ ఆపేయడం ఉత్తమం.

● ఫోన్‌ను ఎంతసేపు చూడాలనేది మీ నియంత్రణలో ఉండాలంటే అలారం పెట్టుకోండి. మీరు ఫోన్‌లో మునిగిపోయి ఉన్నప్పుడు అలారం హెచ్చరికతో తేరుకుని నియంత్రణలో ఉండగలుగుతారు.

● ఇవన్నీ చేసినప్పటికీ రీల్స్‌ని చూడకుండా ఉండలేకపోతే... రీల్స్ వచ్చే అన్ని అప్లికేషన్లు లేదా యాప్స్‌ను శాశ్వతంగా తీసేయండి. అప్పుడు చూడాలనిపించినా అవి ఉండవు కాబట్టి మిమ్మల్ని మీరు నియంత్రించుకో గలుగుతారు. ఇవి లేనప్పుడు వేరే కొత్త హాబీ మీ రోజువారీ దినచర్యలో భాగం అవుతుంది. తద్వారా ఆరోగ్యకరమైన, సంతోషంతో కూడిన మార్పులు చోటుచేసుకుని ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ప్రయత్నించి చూడండి.

సీజనల్ వ్యాధులు
సురక్షితం ఇలా!

గత కొద్దిరోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ దగ్గు, జలుబు, తుమ్ములు, జ్వరం వంటి వాటితో ఎవరో ఒకరు బాధపడుతూనే ఉన్నారు. సీజనల్ వ్యాధుల విజృంభణే అందుకు కారణం. ఇది ప్రతి సీజన్‌లోనూ ఉండేదే అయినా, ఒక్కొక్కరికి ఒక్కో సీజన్ బొత్తిగా పడదు. అందువల్ల వచ్చాక బాధపడేకంటే వీటిని నివారించుకోవడమే ఉత్తమం. సీజనల్ వ్యాధులను నివారించుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

కొన్ని నివేదికల ప్రకారం, గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో పెరుగుదల ఉన్నట్లు వైద్యనిపుణులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణాలలో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. వాయుకాలుష్యమే ఇందుకు ప్రధాన కారణం.

ఎలా నివారించాలి?

● శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడటం వల్లే ఈ తరహా సీజనల్ ఇన్ఫెక్షన్లు దాడి చేస్తుంటాయి. ఈ సమస్యల నుండి బయటపడాలంటే బలమైన రోగనిరోధక వ్యవస్థను కలిగి ఉండటం ఒక్కటే మార్గం.

● రోగనిరోధక వ్యవస్థను బలపరుచుకోవాలంటే... ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలి. మంచి పోషకాహారం తీసుకునే వారికి అంటు వ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.

● వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుంది కాబట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు వారానికి కనీసం 150 నిమిషాలకు తగ్గని శారీరక వ్యాయామం అవసరం.



● **తగినంత నిద్ర**

నిద్ర లేకపోవడం శరీరానికి రక్షణగా ఉండే రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. శరీరానికి తగినంత రోగనిరోధక శక్తి కలగాలంటే రోజూ కనీసం ఆరున్నర నుంచి 8 గంటల రాత్రి నిద్ర అవసరం. రాత్రిళ్లు డ్యూటీ చేసేవారు పగలు మరింత ఎక్కువ సమయాన్ని నిద్రకు కేటాయించాలి.

● **ఫ్లూ టీకాలు**

ఫ్లూ నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఏడాది టీకాలు తీసుకోవడం అవసరం. ఇలా టీకాలు తీసుకోవటం వల్ల ఫ్లూ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.



● **పరిశుభ్రతను పాటించడం**

ఏదైనా వస్తువులను, బహిరంగ ప్రదేశాలను తాకిన తరువాత కనీసం 20 సెకన్ల పాటు సబ్బుతో చేతులను కడగాలి.

● **తగినంత దూరం పాటించడం**

తెలిసిన వ్యక్తులు, సన్నిహితులు అనారోగ్యంతో ఉన్నప్పుడు వారిని పలకరించండి. చూడటానికి వెళ్లండి కానీ సురక్షితమైన దూరం పాటించటానికి ప్రయత్నించడాన్ని మాత్రం మరచిపోరాదు.

● సీజనల్ వ్యాధులలో వైరస్, బాక్టీరియా, ఫంగస్ కారణంగా వచ్చే సైనసైటిస్ వల్ల ముక్కుతోపాటు గొంతు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి కూడా వస్తుంది. వచ్చిందంటే ఒకపట్టాన వదలకుండా కొన్ని రోజులపాటు పట్టి పీడించే ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి.

● ఉల్లి, వెల్లుల్లి రేకులను తింటే సైనసైటిస్ బాధ తగ్గుతుంది. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి విరివిగా వాడితే మంచిది.

● టీ స్పూన్ జీలకర్రను వేయించి పొడిచేసి, అందులో రెండు స్పూన్ల తేనె కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. జీలకర్రను పల్చని కాటన్ వస్త్రంలో కట్టి వాసన పీల్చాలి.

● గ్లాసున్నర నీళ్లలో టీ స్పూన్ మెంతులను వేసి బాగా మరిగించి కషాయం కాయాలి. ఈ కషాయాన్ని రోజుకు నాలుగుసార్లు తీసుకోవాలి.

● క్యారట్ జ్యూస్‌లో పాలకూర రసం కలిపి రోజుకు ఒకసారి తాగాలి.

ఇలా చేయడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి సురక్షితంగా బయట పడవచ్చు.

చిక్కుళ్లు తింటే అనారోగ్యానికి చిక్కరు



ఈ సీజన్‌లో అంటే చలి కాలంలో విరివిగా దొరికే చిక్కుళ్లను మన ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే చిక్కుడు కాయలలో అనేక పోషకాలు ఉంటాయి. ఎంతో రుచిగా ఉండే చిక్కుడు కాయలు తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం...

★ చిక్కుడుకాయలలో మెగ్నీషియం, ఐరన్, ఫాస్ఫరస్, జింక్, పీచు పదార్థాలు, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్, మాంసకృత్తులు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా ఉంటాయి.

★ వీటిని కూరల రూపంలో లేదా గింజలను ఉడికించి తినడం ద్వారా... ఇలా ఏదో ఒక విధంగా రెగ్యులర్ గా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. ఇవి శరీరానికి తగిన శక్తిని అందించి వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి హృద్రోగాలు, క్యాన్సర్ వంటి సమస్యను కూడా దూరం చేస్తాయి.

★ చిక్కుడుకాయలలో ఉండే క్యాల్షియం, విటమిన్ డి ఎముకలకు వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. గర్భిణులు, బాలింతలు, వ్యాయామం చేసేవారికి చిక్కుళ్లు చాలా మంచిది.

చిక్కుడుకాయలు దొరకనప్పుడు ఎండిన చిక్కుడు గింజలను కూడా కూరల్లో ఉపయోగించవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు వారి డైట్‌లో చిక్కుడుకాయలను చేర్చుకోవడం ఉత్తమం.

★ చిక్కుడు కాయలను తింటే ఆకలి తగ్గుతుంది. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేయడంతో పాటు పేగు క్యాన్సర్లు రాకుండా చూస్తుంది. డయేరియా, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు దరి చేరవు. చిక్కుళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యం కారణంగా వచ్చే అనేక వ్యాధులను నివారిస్తాయి.

★ చిక్కుడు కాయలలో ఉండే విటమిన్లు గుండె ఆరోగ్యానికి దోహదపడతాయి. సెలీనియం, మాంగనీస్ వంటి ఖనిజాలు చిక్కుడు కాయలలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల సమస్యలను నివారించడానికి, దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలను తగ్గించడానికి దివ్యౌషధంగా సహాయపడతాయి. ఇందులో ఉండే మాంగనీస్ నిద్రలేమి సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

★ చిక్కుడు కాయలలోని అమైనో ఆమ్లాలు హార్మోన్ల సమతౌల్యానికి సహాయపడతాయి. దీంతో మానసిక ఆందోళన, టెన్షన్ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇందులో ఉండే పొటాషియం కండరాల వృద్ధికి సహాయపడుతుంది. అంతేకాదు, మెదడు పనితీరును మెరుగుపరిచి జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఇన్ని ప్రయోజనాలుండే చిక్కుళ్లను తీసుకోవడం అలవరచుకుంటే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండవచ్చు.

హెల్త్ టిప్స్



* ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి వచ్చినా తల తిరిగినట్లుగా ఉన్నా చిన్న అల్లం ముక్కను నూరి నిమ్మరసంలో కలిపి తాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
* ముక్కు దిబ్బెడ వేసినప్పుడు ఒక చుక్క ఉల్లిరసాన్ని ముక్కు రంధ్రాల్లో వేస్తే ఉపశమనం కలుగుతుంది.
* సగానికి కోసిన నిమ్మచెక్కపై ఉప్పు, మిరియాల పొడి చల్లి కొద్దిగా వేడి చేసి రసం పిండుకొని తాగితే మైగ్రెయిన్ తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
* నిమ్మరసం, తేనె, గ్లిసరిన్ సమపాళ్లలో కలిపి చెంచా చొప్పున రోజుకు మూడుసార్లు తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.
* నిద్రలేమితో బాధపడుతున్న వారు పడుకునే ముందు కొత్తిమీర రసం, పంచదార కలిపిన నీళ్లను తాగితే ఫలితం ఉంటుంది.
* రక్తంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించుకొని సన్నబడాలంటే రోజూ పెరుగును తీసుకోవాలి.
* గుండె ఆరోగ్యంగా ఉండాలంటే కొవ్వు పదార్థాలు తక్కువ వుండే ఆహారపదార్థాలు తీసుకోవాలి.
* మధుమేహంతో బాధపడేవారు నిత్యం ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే ఎంతో మేలు.
* రాత్రి 7 నుంచి 8 గంటల లోపు ఆహారం తీసుకోవడం, తిన్న తరువాత కనీసం ఒక అరగంట నాటి అయినా నడవడం అలవాటు చేసుకోవడం వల్ల అరుగుదల బాగుండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దరిచేరకుండా ఉంటాయి.

సినిమా

భారతీయుడు ఈజ్ బ్యాక్


● కమల్‌హాసన్

''హలో... ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడుకి చావే లేదు' అంటూ 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం చివర్లో కమల్‌హాసన్ చెప్పే డైలాగ్‌తో 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') ఇంట్రో గ్లింప్స్ మొదలవుతుంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్' (1996)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రధారులు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఇండియన్ 2' ఇంట్రో గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ 'ఇండియన్ 2' తెలుగు వెర్షన్ గ్లింప్స్‌ను దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి షేర్ చేశారు. ఈ వీడియోలో 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ కమల్‌హాసన్ చెప్పిన డైలాగ్ ఉంటుంది.

నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు
- నాని


● ఎస్ఆర్ ప్రభు, రాజు మురుగన్, కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్, నాని, వంశీ పైడిపల్లి

''ఈగ' సినిమా తమిళంలో విడుదలైన తర్వాత నేను ఎప్పుడు చెన్నై వెళ్లినా.. నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు. అలాగే కార్తీని చూస్తే చాలామంది తెలుగు ప్రేక్షకులు తెలుగబ్బాయిలా ఉన్నాడంటారు. నాకు తెలిసి తెలుగు ప్రేక్షకులు కార్తీని సొంతం చేసుకున్నారు. వరుసగా మూడు హిట్స్ సాధించి ఇప్పుడు 'జపాన్'తో ముందుకొస్తున్నాడు కార్తీ. దీపావళికి వస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో నాని అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన **నాని మాట్లాడుతూ** – ''జపాన్' లాంటి చిత్రం తీసి ప్రేక్షకుల్ని మెప్పించడం అంత సులభం కాదు. కానీ, ఈ మూవీ ట్రైలర్ చూశాక టీమ్ ఎనర్జీ, నమ్మకం నాకు కనిపించింది. అనూ ఇమ్మాన్యుయేల్ నా 'మజ్ను' సినిమాతో పరిచయమైంది. 'జపాన్' ట్రైలర్ చూసినప్పుడు చాలా మంచి సినిమాలో భాగస్వామ్యం అయినట్లు అనిపించింది. ప్రభుగారు మంచి సినిమాలు నిర్మిస్తుంటారు. లెక్కలు చూసుకుని పని చేసే నిర్మాత కాదు.. ప్యాషన్‌తో, ప్రాణం పెట్టి పనిచేసే నిర్మాతలాగా అనిపిస్తారు. ఇలాంటి మంచి సినిమా తీసిన డైరెక్టర్ రాజు మురుగన్‌కి అభినందనలు'' అన్నారు. ''జపాన్' నా మనసుకు బాగా దగ్గరైంది'' అన్నారు **కార్తీ**. ''జపాన్' అంతా రాజు మురుగన్ శైలిలో ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహ పరచదు. అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యంలో తెలుగులో ఈ సినిమా విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది'' అని **ఎస్ఆర్ ప్రభు** అన్నారు. **రాజు మురుగన్ మాట్లాడుతూ**– ''కళకు భాషతో సంబంధం లేదు. తెలుగు ప్రేక్షకులు సినిమాని పండగలా సెలబ్రేట్ చేసుకుంటారు. భారతీయ సినిమాకి ఐకానిక్‌గా గుర్తింపు పొందింది టాలీవుడ్'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత సుప్రియ, దర్శకుడు వంశీ పైడిపల్లి, నటులు సునీల్, రాకేందు మౌళి, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఆమె నాకోసం కష్టపడుతున్నారు
- సమంత



''చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో ఈసారి ఒకరు కాదు ముగ్గురు సూపర్ హీరోలు పోరాడుతున్నారు. ఈ దీపావళికి యాక్షన్ ప్యాక్డ్ రైడ్‌లా వస్తున్న 'ది మార్వెల్స్' సినిమా చూడటానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరోయిన్ సమంత. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'కెప్టెన్ మార్వెల్'కు సీక్వెల్‌గా నియా డకోస్టా దర్శకత్వంలో 'ది మార్వెల్స్' రూపొందింది. కెప్టెన్ మార్వెల్‌గా బ్రీ లార్సన్, మిస్ మార్వెల్‌గా ఇమాన్ వెల్లనీ, మోనికాగా తెయోనా పారిస్ నటించారు. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో ఇండియాలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం 'ది మార్వెల్స్' ప్రోమోను రిలీజ్ చేసిన సమంత మాట్లాడుతూ– ''మహిళా శక్తిని బలపరిచే చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇక్కడకు వచ్చాను. నేను ఓ అవెంజర్ అయి, నాకో టీమ్ ఉంటే అందులో నా ఫ్యాన్స్ ఉండాలని కోరుకుంటాను. ఇండస్ట్రీ వారు టీమ్‌గా ఉండాలనుకుంటే అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా ఉండాలనుకుంటా. నా మొదటి హీరో మా అమ్మే. ఏడాదిగా ఆమె నా కోసం ఎంతో కష్టపడుతున్నారు'' అన్నారు.

ఆవకాయ తాండ్ర...


● తరుణ్ భాస్కర్

'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ చిందేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'మంగళవారం' చిత్రంలోని పాట ఇది. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'అప్పడప్పడ తాండ్ర...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. తరుణ్ భాస్కర్, గణేష్ ఎ. రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ ప్రత్యేక పాటలో తరుణ్ భాస్కర్ నటించడం విశేషం. ''తరుణ్ భాస్కర్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం ఈ పాట ప్రత్యేకత. కోనసీమలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరించిన ఈ పాట పల్లె ప్రజల మధ్య సంభాషణలు, ఊరిలో పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా ఉంటుంది'' అన్నారు అజయ్ భూపతి.

స్వర్గం నరకం ఈశ్వరరావు ఇక లేరు



సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మిచిగాన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అనారోగ్య కారణంతో అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రం 'స్వర్గం నరకం' (1975) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు ఈశ్వరరావు. ఈ చిత్రంలో తన నటనకుగాను కాంస్య నంది అవార్డును అందుకున్నారు ఈశ్వరరావు. ఆ తర్వాత 'దేవతలారా దీవించండి', 'ప్రేమాభిషేకం, యుగపురుషుడు, దయామయుడు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, జయం మనదే, శభాష్ గోపి' తదితర చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. చిరంజీవి హీరోగా కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'ఘరానా మొగుడు' (1992) సినిమాలో చివరిసారిగా కనిపించారు ఈశ్వరరావు. దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులనూ అలరించారాయన. ఈశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


● వేణుగోపాల్, విక్రమ్ రెడ్డి, 'దిల్' రాజు

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ టైటిల్ లోగో రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నాను. కొత్త కంటెంట్ ఉన్న చిత్రాలను మన ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఇదే కోవలో ఉంటుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు వేణుగోపాల్, విక్రమ్.

ఇరవై ఏళ్లకు నా కల నెరవేరింది
- ఆర్‌పి వెంకట్



''ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నాకు 'దీపావళి' కథ ఆలోచన పుట్టింది. పల్లెటూరు, అక్కడి ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ భావోద్వేగాలతో 'దీపావళి' తీశాను'' అని దర్శకుడు ఆర్‌పి వెంకట్ అన్నారు. 'స్రవంతి' రవికిశోర్ తొలిసారి తమిళంలో నిర్మించిన చిత్రం 'కీడా'. తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఆర్‌పి వెంకట్ మాట్లాడుతూ– ''మాది తమిళనాడు. 2003లో చెన్నైలో ఆఫీస్ బాయ్‌గా నా జీవితం ప్రారంభించి, అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా 'దీపావళి' నా తొలి సినిమా. 20 ఏళ్ల తర్వాత నా కల నిజమైంది. రవికిశోర్‌గారి తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంది. నా తర్వాతి సినిమా కోసం ఎమోషనల్ పాయింట్‌తోనే ఓ కథను సిద్ధం చేస్తున్నాను. రవికిశోర్‌గారికి నచ్చింది. ఈ సినిమాని ఓ స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.

తెరచాప ఆడాలి
- విశ్వక్ సేన్


● విశ్వక్ సేన్, నవీన్ రాజ్

నవీన్ రాజ్ సంకరపు, పూజా సుహాసిని ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ డిజైనింగ్ బాగుంది. ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, అన్నీ నాకు తెలుసు. ఈ సినిమా బాగా ఆడి, చిత్ర యూనిట్‌కి మంచి విజయాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: అజీమ్–వెంకట్.

మార్పు కోసం..


● సుమన్

సుమన్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ– ''ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తప్పుదారి పట్టిన ప్రజల ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసం ఎలా తప్పు దారి పడుతున్నారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు.

పైరసీకి అడ్డుకట్ట వేస్తాం
- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



''పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఓ సినిమా నిర్మాణానికి పడ్డ కష్టం పైరసీ వల్ల వృథాగా పోతోంది. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగింది'' అని కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం–1952లో సవరణలు చేసి, కొత్త బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో పైరసీని అరకట్టడం అనేది ఓ ప్రధానాంశం. ఈ విషయమై శుక్రవారం అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ– '' ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులను నియమించాం. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరేటెడ్ కంటెంట్‌పై నోడల్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 48 గంటల్లో ఆ కంటెంట్‌ను ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా చర్యలు చేపడతారు'' అని చెప్పుకొచ్చారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
283	97
64,364	19,231

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,468	▲	174
డోజోన్స్	34,089	▲	250
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,418	▼	29
డాక్స్	15,189	▲	46
షాంఘై	3,031	▲	21
నికాయ్	31,950	▲	348

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
61,075	▼	17
బంగారం (99.5 స్వచ్ఛత)		
60,830	▼	17
వెండి (కిలో)		
70,771	▲	913


ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.99	103.36
€	యూరో	ఎస్‌బీఐ	87.01	90.10
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.58	56.26
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.53	54.84
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.20	62.14
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.25	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.78	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.26	12.34

తనిష్క్.. 'ధరోహర్' కలెక్షన్

హైదరాబాద్: టాటా గ్రూప్‌నకు చెందిన తనిష్క్ దీపావళి సందర్భంగా 'ధరోహర్' పేరుతో కొత్త కలెక్షన్‌ను ఆవిష్కరించింది. భారతదేశ సుసంపన్న సాంస్కృతిక వారసత్వం, ఆధునిక సాంకేతికత సమ్మేళనాల ప్రేరణతో కొత్త కలెక్షన్‌ను రూపొందించామని కంపెనీ తెలిపింది. 'వెలుగుల పండుగకు దేశ సంప్రదాయాల లోతైన మూలాల నుంచి అత్యుత్తమ ఆభరణాల డిజైన్లను తీసుకొస్తున్నందుకు గర్విస్తున్నాము' అని టైటాన్ కంపెనీ చీఫ్ డిజైన్ ప్రతినిధి రేవతి కాంత్ తెలిపారు.

5న జోయ్ అలుక్కాస్ ఆత్మకథ



దుబాయ్: జోయాలుక్కాస్ గ్రూప్ అధినేత జోయ్ అలుక్కాస్ ఆత్మకథ 'స్ప్రెడింగ్ జాయ్' నవంబర్ 5న విడుదల కానుంది. షార్జాలో జరిగే అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనలో ఆటోబయోగ్రఫీని ఆవిష్కరించనున్నారు. సినీ నటి., జోయాలుక్కాస్ బ్రాండ్ అంబాసిడర్ కాజోల్ దేవగణ్ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేయనున్నారు. హార్పర్ కాలిన్స్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. అసంఘటితమైన ఆభరణాల పరిశ్రమను ఏకతాటిపైకి తెచ్చిన ఔత్సాహిక పారిశ్రామికవేత్త ప్రయాణాన్ని, అతని గురించి అరుదైన అంశాల్ని ఇందులో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. 'స్ప్రెడింగ్ జాయ్‌ని నాన్నగారికి అంకితం చేశా ను. నా ఆత్మకథ చదివిన ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి కలిగిస్తుందని ఆశిస్తున్నాను.ఎన్నడూ పట్టు వదలొద్దనే ధోరణిని ప్రోత్సహిస్తుందని నమ్ముతున్నాను' అని తన ఆత్మకథపై జోయ్ అలుక్కాస్ స్పందించారు.

యూఏఈకి లీ ఫార్మా స్మూత్‌వాక్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కీళ్ల వ్యాధి చికిత్సలో వాడే బయో-కార్టిలేజ్ స్మూత్‌వాక్ ట్యాబ్లెట్లను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో విక్రయించేందుకు అనుమతి పొందినట్టు లీ ఫార్మా ప్రకటించింది. భారత్‌లో తయారైన న్యూట్రాస్యూటికల్‌కు యూఏఈలో ఆమోదం రావడం తొలిసారి అని కంపెనీ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి తెలిపారు. కీళ్ల సర్జరీని నివారించగలిగే ఈ ఔషధానికి మంచి డిమాండ్ ఉందన్నారు. కొలాజెన్ టైప్-2, ఎగ్ షెల్ నుంచి సేకరించిన పొర, గుగ్గిలం, పసుపు నుంచి తీసిన కుర్కుమిన్, విటమిన్ డి-3 మేళవింపుతో ఔషధం తయారైంది. మృదులాస్థిని (కార్టిలేజ్) పెంచి, కీళ్ల రుగ్మతలను తగ్గిస్తుందని కంపెనీ తెలిపింది.



రిలయన్స్ రిటైల్ చేతికి అరవింద్ బ్యూటీ బ్రాండ్స్

న్యూఢిల్లీ: వేగంగా వృద్ధి చెందుతున్న సౌందర్య, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల (బీపీసీ) వ్యాపార కార్యకలాపాలను మరింతగా విస్తరించడంపై రిలయన్స్ రిటైల్ వెంచర్స్ (ఆర్ఆర్‌వీఎల్) దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా అరవింద్ ఫ్యాషన్‌కి చెందిన అరవింద్ బ్యూటీ బ్రాండ్స్ రిటైల్‌ను కొనుగోలు చేస్తోంది. ఇందుకు సంబంధించి ఆర్ఆర్‌వీఎల్ అనుబంధ సంస్థ రిలయన్స్ బ్యూటీ అండ్ పర్సనల్ కేర్‌తో షేర్ల కొనుగోలు ఒప్పందం (ఎస్‌పీఏ) కుదిరినట్లు అరవింద్ ఫ్యాషన్ వెల్లడించింది. ఈక్విటీ వాటా విక్రయ విలువ రూ. 99.02 కోట్లుగా ఉండనున్నట్లు పేర్కొంది. చెల్లించాల్సిన రుణాలు, ఈక్విటీ అంతా కలిపి సంస్థ మొత్తం విలువను రూ. 216 కోట్లుగా లెక్కగట్టినట్లు వివరించింది. డీల్‌లో భాగంగా అరవింద్ ఫ్యాషన్స్ నిర్వహిస్తున్న ఫ్రాన్స్ బ్యూటీ రిటైల్ బ్రాండ్ సెఫోరాకు భారత్‌లో ఉన్న 26 స్టోర్స్ కూడా ఆర్ఆర్‌వీఎల్‌కు దక్కుతాయి. ఇకపై తాము పూర్తిగా ఫ్యాషన్ (యూఎస్ పోలో, యారో మొదలైన 5 బ్రాండ్స్) పైనే దృష్టి పెట్టనున్నట్లు అరవింద్ ఫ్యాషన్స్ తెలిపింది.



గత ఆర్థిక సంవత్సరంలో అరవింద్ బ్యూటీ బ్రాండ్స్ రిటైల్ టర్నోవరు రూ. 336.70 కోట్లుగా నమోదైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్‌లోని రిటైల్ కంపెనీలన్నింటికీ ఆర్ఆర్‌వీఎల్ హోల్డింగ్ సంస్థగా ఉంది. బ్యూటీ రిటైల్ ప్లాట్‌ఫాం 'టిరా' కొనుగోలుతో సౌందర్య సాధనాల వ్యాపారంలోకి ప్రవేశించింది. నైకా, టాటా, హిందుస్తాన్ యూనిలీవర్‌కి చెందిన లాక్మే మొదలైన దిగ్గజ బ్రాండ్స్‌తో పోటీపడుతోంది. రెడ్‌సీర్ స్ట్రాటెజీ కన్సల్టెంట్, పీక్ 15 సంయుక్త నివేదిక ప్రకారం 2022లో 19 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీ సౌందర్య, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల మార్కెట్ 2027 నాటికి 30 బిలియన్ డాలర్లకు చేరనుంది.

అక్టోబర్‌లో 'సేవలు' పేలవం

ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా పీఎంఐ సూచీ 58.4కు డౌన్

న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం అక్టోబర్‌లో నిరాశ పరిచింది. ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 58.4కు పడిపోయింది. గడచిన ఏడు నెలల్లో ఇంత తక్కువ స్థాయికి ఇండెక్స్ పడిపోవడం ఇదే తొలిసారి. సెప్టెంబర్‌లో 13 యేళ్ల గరిష్ట స్థాయి.. 61కి చేరిన సూచీ మరుసటి నెలలోనే కిందకు జారడం గమనార్హం. అయితే సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగానే పరిగణిస్తారు. ఈ దిగువకు పడిపోతేనే క్షీణతగా భావిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల సూచీ వరుసగా 27 నెలల నుంచీ వృద్ధి బాటన కొనసాగుతోంది.

సేవలు–తయారీ కలిపినా కిందకే..

మరోవైపు సేవలు–తయారీ రంగాలను కలిసి లెక్కించే ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ సెప్టెంబర్‌లో 61 వద్ద ఉంటే, తాజా సమీక్షా నెల అక్టోబర్‌లో 58.4కు పడిపోయింది. మార్చి తర్వాత ఇంత తక్కువ స్థాయి ఇదే తొలిసారి. ఒక్క తయారీ రంగాన్ని చూస్తే, అక్టోబర్‌లో బలహీన ధోరణి నమోదుచేసుకుంది.

జొమాటో లాభాల బాట

- క్యూ2లో రూ.36 కోట్లు
- మెరుగుపడిన మార్జిన్లు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ అగ్రిగేటర్ 'జొమాటో' ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో (క్యూ2) అంచనాలను మించి పనితీరు చూపించింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు గణనీయంగా నష్టాలను తగ్గించుకుని, లాభాల్లోకి ప్రవేశించింది. రూ.36 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో జొమాటో రూ.251 కోట్లు నష్టపోవడం గమనించొచ్చు. కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.1,661 కోట్ల నుంచి రూ.2,848 కోట్లకు దూసుకుపోయింది. ఇదే కాలంలో వ్యయాలు కూడా గణనీయంగా పెరిగాయి. రూ.2,092 కోట్ల నుంచి రూ.3,039 కోట్లకు ఎగిశాయి. పోర్చుగల్‌కు చెందిన అసోసియేటెడ్ కంపెనీ 'జెడ్ఎంటీ యూరప్ ఎల్‌డీఏ'లో తనకున్న 30 శాతం ఓటింగ్ హక్కులను 1.80 లక్షల యూరోలకు విక్రయించాలని (సుమారు రూ.1.59 కోట్లు) జొమాటో బోర్డ్ నిర్ణయించింది. స్థూల ఆర్డర్ విలువ (జీవోవీ)లో మార్జిన్లు మైనస్ 7.3% నుంచి ప్లస్ 1.3%కి మెరుగుపడ్డాయి. జూన్ త్రైమాసికం మాదిరే, సెప్టెంబర్ క్వార్టర్లోనూ అన్ని విభాగాల్లో వృద్ధిని కొనసాగించినట్టు జొమాటో ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో జొమాటో షేరు ఎన్ఎస్ఈలో 10% శాతం బలపడి రూ. 118 వద్ద ముగిసింది.

టైటన్ లాభం అప్

క్యూ2లో రూ. 916 కోట్లు



న్యూఢిల్లీ: జ్యువెలరీ, వాచీల తయారీ దిగ్గజం టైటన్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 10 శాతం వృద్ధితో రూ. 916 కోట్లను తాకింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 835 కోట్లు ఆర్జించింది. నికర అమ్మకాలు సైతం 25 శాతం జంప్‌చేసి రూ. 10,708 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 8,567 కోట్ల అమ్మకాలు సాధించింది. అయితే మొత్తం వ్యయాలు 41 శాతం పెరిగి రూ. 11,402 కోట్లకు చేరాయి. ఇక మొత్తం కన్సాలిడేటెడ్ ఆదాయం 37 శాతం ఎగసి రూ. 12,653 కోట్లయ్యింది. దీనిలో జ్యువెలరీ విభాగం ఆదాయం 39 శాతం జంప్‌చేసి రూ. 11,081 కోట్లను తాకగా.. వాచీలు తదితర బిజినెస్ 32 శాతం వృద్ధితో రూ. 1,092 కోట్లకు చేరింది. వెరసి వాచీలు, వేరబుల్స్ విభాగం తొలిసారి రూ. 1,000 కోట్ల టర్నోవర్‌ను అందుకున్నట్లు కంపెనీ పేర్కొంది. ఐకేర్ ఆదాయం 13 శాతం బలపడి రూ. 189 కోట్లయ్యింది. ఈ కాలంలో కొత్తగా 10 టైటన్ వరల్డ్ స్టోర్లతోపాటు, హీలియోస్ 5, ఫాస్ట్‌ట్రాక్ 5 చొప్పున స్టోర్లను ఏర్పాటు చేసింది.

ఫలితాల నేపథ్యంలో టైటన్ షేరు బీఎస్ఈలో 2.3 శాతం బలపడి రూ. 3,273 వద్ద ముగిసింది.

వారం గరిష్టానికి సూచీలు

- కొనసాగిన ప్రపంచ సానుకూలతలు
- అన్ని రంగాల షేర్లకూ డిమాండ్
- 19,200 స్థాయిపైకి నిఫ్టీ



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో స్టాక్ సూచీలు రెండో రోజూ లాభాలు ఆర్జించాయి. ఇటీవల విడుదల కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించడం కూడా సెంటిమెంట్‌ను బలపరిచింది. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో శుక్రవారం సెన్సెక్స్ 283 పాయింట్లు బలపడి 64,364 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 97 పాయింట్లు పెరిగి 19,231 వద్ద నిలిచింది. ముగింపు స్థాయిలు ఇరు సూచీలకు వారం గరిష్టం. ఉదయం భారీ లాభాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ప్రారంభంలోనే జోరు కనబరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 454 పాయింట్లు పెరిగి 64,535 వద్ద, నిఫ్టీ 143 పాయింట్లు బలపడి 19,276 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. అయితే వారాంతాపు రోజు కావడంతో మిడ్ సెషన్ తర్వాత గరిష్ట స్థాయికి చేరిన కొన్ని షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలకు కొంతమేర లాభాలు తగ్గాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక శాతం లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.12 కోట్ల షేర్లను విక్రయించగా, దేశీ ఇన్వెస్టర్లు రూ.403 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల యథాతథ కొనసాగింపు, క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- అన్ని రంగాల సూచీలు లాభపడ్డాయి. అత్యధికంగా రియల్టీ సూచీ 2.50% ర్యాలీ చేసింది. సర్వీసెస్ 1.60%, కన్జూమర్ 1.50%, ఎఫ్ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్సులు 1% పెరిగాయి. ఆటో, ఐటీ, బ్యాంకింగ్, ఫార్మా, ఐటీ సూచీలు అరశాతం చొప్పున రాణించాయి.
- సెప్టెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు మెప్పించడంతో టాటా మోటార్స్ షేరు 2% పెరిగి రూ.648 వద్ద క్లోజైంది. ట్రేడింగ్‌లో 4.5% ఎగసి రూ.665 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- రియల్టీ రంగ షేర్లు భారీ కొనుగోళ్ల మద్దతు లభించింది. బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ షేరు 7% పెరిగింది. ప్రెస్టేజ్‌ఎస్టేట్, గోద్రెజ్ ప్రాపర్టీస్, డీఎల్ఎఫ్, శోభ, ఒబెరాయ్ రియల్టీ షేర్లు 5-2% లాభపడ్డాయి.

మళ్లీ లాభాల్లో ఇండిగో

క్యూ2లో రూ. 189 కోట్లు



న్యూఢిల్లీ: ఎయిర్‌లైన్స్ దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్(క్యూ2)లో రూ. 189 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 1,583 కోట్ల నికర నష్టం ప్రకటించింది. సామర్థ్యం పెంపు, అధిక ట్రాఫిక్ ఇందుకు సహకరించాయి. వెరసి ఇండిగో బ్రాండు సర్వీసుల కంపెనీ వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లాభాలను ప్రకటించగలిగింది. అయితే ఈ కాలంలో విదేశీ మారక నష్టం రూ. 806 కోట్లను మినహాయించి లాభాలు ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం 21 శాతం జంప్‌చేసి రూ. 15,503 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 12,852 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఈ క్యూ2లో ప్రయాణికుల సంఖ్య 26.3 మిలియన్ల నుంచి 33.4 మిలియన్లకు ఎగసింది. సెప్టెంబర్‌కల్లా విమానాల సంఖ్య 334కు చేరగా.. రూ. 30,666 కోట్ల నగదు నిల్వలు కలిగి ఉంది.

ఫలితాల నేపథ్యంలో ఇండిగో షేరు 1% బలపడి రూ. 2,509 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్

సెమీఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం



ఆద్యంతం నిలకడగా ఆడిన రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం పారిస్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ బోపన్న-ఎబ్డెన్ జోడీ 6-3, 6-2తో ఐదో సీడ్ గ్రానోలెర్స్ (స్పెయిన్)-జెబలాస్ (అర్జెంటీనా) జంటను ఓడించింది. 54 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేశారు.

సంయుక్త ఆధిక్యంలో విదిత్

గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తొమ్మిదో రౌండ్ తర్వాత భారత గ్రాండ్ మాస్టర్ విదిత్ 6.5 పాయింట్లతో మరో ముగ్గురితో కలిసి సంయుక్తంగా ఆధిక్యంలో ఉన్నాడు. యూకేలోని ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఎసిపెంకో (రష్యా)తో జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను విదిత్ 37 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు.

డిసెంబర్ 19న దుబాయ్‌లో ఐపీఎల్ వేలం

న్యూఢిల్లీ: వచ్చే 2024 ఐపీఎల్ సీజన్‌కు సంబంధించిన ఆటగాళ్ల వేలం ప్రక్రియ తొలిసారిగా దేశం దాటనుంది. గతంలో టోర్నీ విదేశాల్లో నిర్వహించినప్పటికీ వేలం పాట మాత్రం భారత్‌లోనే జరిగింది. ఇప్పుడు కొత్తగా ఈ వేలాన్ని దుబాయ్‌లో డిసెంబర్ 19న నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఈ మేరకు పది ఫ్రాంచైజీ యాజమాన్యాలు, ఇతర స్టేక్ హోల్డర్లకు బోర్డు సమాచారం ఇచ్చింది. ఆటగాళ్లను అట్టిపెట్టుకునే ఫ్రాంచైజీలకు ఇచ్చిన గడువును పెంచింది. ఈ నెల 15న ముగియాల్సిన తుది గడువును 26వ దాకా పొడిగించింది. ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు వెచ్చించే మొత్తాన్ని కూడా పెంచారు. ఆటగాళ్ల కొనుగోలుకు రూ. 100 కోట్ల దాకా వెచ్చించవచ్చు.

సెమీస్‌లో ఓడిన భారత్



కౌలాలంపూర్: సుల్తాన్ ఆఫ్ జొహర్ కప్ జూనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టుకు చుక్కెదురైంది. జర్మనీ జట్టుతో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో టీమిండియా 3-6 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున అమన్‌దీప్ లాక్రా (35వ ని.లో), ఉత్తమ్ సింగ్ (58వ ని.లో), రోహిత్ (60వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. రెండో సెమీఫైనల్లో ఆస్ట్రేలియా 2-1తో పాకిస్తాన్‌పై గెలిచి నేడు జరిగే ఫైనల్లో జర్మనీతో తలపడుతుంది. మూడో స్థానం కోసం పాకిస్తాన్‌తో భారత్ ఆడుతుంది.

భారత్‌కు నాలుగు స్వర్ణాలు

అస్తానా (కజకిస్తాన్): ఆసియా యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా బాక్సర్లు అదరగొట్టారు. నాలుగు విభాగాల్లో స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు. భావన శర్మ (48 కేజీలు), తనూ (54 కేజీలు), నిఖిత చంద్ (60 కేజీలు), కీర్తి (ప్లస్ 81 కేజీలు) పసిడి పతకాలను గెల్చుకున్నారు. ఫైనల్స్‌లో గుల్సెవర్ గనియెవా (ఉజ్బెకిస్తాన్)పై భావన; యునుసోవా (ఉజ్బెకిస్తాన్)పై తనూ; ఇస్మోయిలోవా (ఉజ్బెకిస్తాన్)పై నిఖిత చంద్; ఉమిత్ (కజకిస్తాన్)పై కీర్తి గెలుపొందారు.

అఫ్గాన్... అదే జోరు

- ప్రపంచకప్‌లో నాలుగో విజయం
- నెదర్లాండ్స్‌పై ఏడు వికెట్లతో గెలుపు
- సెమీఫైనల్ ఆశలు సజీవం
- రాణించిన నబీ, హష్మతుల్లా, రహ్మత్ షా



హష్మతుల్లా, అజ్మతుల్లా

లక్నో: సమష్టి ప్రదర్శనతో అదరగొడుతూ... అంచనాలకు మించి రాణిస్తూ... వన్డే ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో అఫ్గానిస్తాన్ నాలుగో విజయం నమోదు చేసింది. ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన మూడు జట్లపై సంచలన విజయాలు సాధించిన అఫ్గానిస్తాన్ తాజాగా నెదర్లాండ్స్ జట్టును ఓడించి సెమీఫైనల్ రేసులో నిలిచింది. శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ ఏడు వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌పై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెదర్లాండ్స్ 46.3 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. సైబ్రాండ్ (86 బంతుల్లో 58; 6 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించగా, మ్యాక్స్ ఓ డౌడ్ (40 బంతుల్లో 42; 9 ఫోర్లు) రాణించాడు. అఫ్గాన్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నబీ 3 వికెట్లు, నూర్ అహ్మద్ 2 వికెట్లు తీశారు. అనంతరం అఫ్గానిస్తాన్ 31.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసి గెలిచింది. రహ్మత్ షా (54 బంతుల్లో 52; 8 ఫోర్లు), కెప్టెన్ హష్మతుల్లా (64 బంతుల్లో 56; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలతో రాణించారు.

డచ్ రనౌట్...

నెదర్లాండ్స్ జట్టులో టాప్-5లో ఒక్క ఓపెనర్ వెస్లీ (1) మినహా... తర్వాత వరుసగా నలుగురు బ్యాటర్లు మ్యాక్స్ ఓ డౌడ్, అకెర్మన్ (35 బంతుల్లో 29; 4 ఫోర్లు), సైబ్రాండ్, కెప్టెన్ ఎడ్వర్డ్స్ (0) రనౌట్ కావడమే డచ్ కొంపముంచింది. వన్డేల్లో ఒక జట్టు తరఫున టాప్-5లో నలుగురు రనౌట్ కావడం ఇదే ప్రథమం. సమన్వయలోపం, పరుగేలేని చోట ప్రయత్నించి భంగపడటంతో నెదర్లాండ్స్ కష్టాలు కొనితెచ్చుకుంది. తర్వాత వచ్చిన బ్యాటర్లలో ఏ ఒక్కరు చెప్పుకోదగ్గ స్కోరు చేయలేదు.

గెలిపించిన రహ్మత్, హష్మతుల్లా

సులువైన లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన అఫ్గాన్‌కు ఓపెనర్ల వైఫల్యం కంగారుపెట్టింది. రహ్మనుల్లా గుర్బాజ్ (10), ఇబ్రహీం జద్రాన్ (20) నిరాశపరిచారు. ఈ దశలో రహ్మత్ షా, కెప్టెన్ హష్మతుల్లా ఇన్నింగ్స్ నడిపించి, గెలిపించే బాధ్యత తీసుకున్నారు. ఈ క్రమంలో రహ్మత్ షా (47 బంతుల్లో) ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు. మూడో వికెట్‌కు 74 పరుగులు జోడించాక జుల్ఫికర్ బౌలింగ్‌లో రహ్మత్ షా నిష్క్రమించాడు. తర్వాత వచ్చిన అజ్మతుల్లా (31 నాటౌట్; 3 ఫోర్లు)తో కలిసి అబేధ్యమైన నాలుగో వికెట్‌కు 52 పరుగులు జత చేసిన హష్మతుల్లా జట్టును విజయతీరానికి చేర్చాడు.

ఇక్కడిదాకా బాగానే ఉన్నా...

అఫ్గాన్ ఏదో గాలివాటం గెలుపులేమీ గెలవలేదు. చక్కని బౌలింగ్, నిలకడైన బ్యాటింగ్‌తో మాజీ చాంపియన్లను ఓడించి 8 పాయింట్లతో సెమీఫైనల్ రేసులో నిలిచింది. ఇప్పటివరకైతే బానే ఉంది. కానీ హష్మతుల్లా జట్టుకు మిగిలినవి రెండు మ్యాచ్‌లే! అవి కూడా గట్టి ప్రత్యర్థులైన ఆస్ట్రేలియా (7న ముంబైలో), దక్షిణాఫ్రికా (10న అహ్మదాబాద్‌లో)లతో కావడంతో... సెమీస్ చేరడం, కల సాకారమవడం మాత్రం అంత సులభమైతే కాదు. అయితే సంచలనాల మజా ఆఖరి దశను రసవత్తరం చేస్తే మాత్రం... 2003లో కెన్యా సెమీస్ చేరినట్లే... అఫ్గాన్‌కు ఆ అవకాశం దక్కినా దక్కొచ్చు!

స్కోరు వివరాలు

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: వెస్లీ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 1; మ్యాక్స్ ఓ డౌడ్ (రనౌట్) 42; అకెర్మన్ (రనౌట్) 29; సైబ్రాండ్ (రనౌట్) 58; ఎడ్వర్డ్స్ (రనౌట్) 0; బస్ డి లీడే (సి) ఇక్రామ్ (బి) నబీ 3; జుల్ఫికర్ (సి) ఇక్రామ్ (బి) నూర్ అహ్మద్ 3; వాన్ బీక్ (స్టంప్డ్) ఇక్రామ్ (బి) నబీ 2; వాన్‌డెర్ మెర్వ్ (సి) జద్రాన్ (బి) నూర్ అహ్మద్ 11; ఆర్యన్ దత్ (నాటౌట్) 10; మీకెరన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నబీ 4; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (46.3 ఓవర్లలో ఆలౌట్) 179. వికెట్ల పతనం:** 1-3, 2-73, 3-92, 4-92, 5-97, 6-113, 7-134, 8-152, 9-169, 10-179. **బౌలింగ్:** ముజీబ్ 10-0-40-1, ఫరూఖీ 5-0-36-0, ఒమర్జాయ్ 3-0-11-0, నబీ 9.3-1-28-3, రషీద్ ఖాన్ 10-0-31-0, నూర్ అహ్మద్ 9-0-31-2.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) ఎడ్వర్డ్స్ (బి) వాన్ బీక్ 10; జద్రాన్ (బి) వాన్‌డెర్ మెర్వ్ 20; రహ్మత్ షా (సి అండ్ బి) జుల్ఫికర్ 52; హష్మతుల్లా (నాటౌట్) 56; అజ్మతుల్లా (నాటౌట్) 31; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (31.3 ఓవర్లలో 3 వికెట్లకు) 181. వికెట్ల పతనం:** 1-27, 2-55, 3-129. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 8.3-0-49-0, వాన్ బీక్ 7-0-30-1, మీకెరన్ 5-0-35-0, వాన్‌డెర్ మెర్వ్ 5-0-27-1, జుల్ఫికర్ 3-0-25-1, అకెర్మన్ 3-0-12-0.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	7	7	0	14	2.102
దక్షిణాఫ్రికా	7	6	1	12	2.290
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
న్యూజిలాండ్	7	4	3	8	0.484
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
పాకిస్తాన్	7	3	4	6	-0.024
శ్రీలంక	7	2	5	4	-1.162
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
బంగ్లాదేశ్	7	1	6	2	-1.446
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే.-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ X పాకిస్తాన్
వేదిక: బెంగళూరు
ఉదయం గం. 10:30 నుంచి

ఆస్ట్రేలియా X ఇంగ్లండ్
వేదిక: అహ్మదాబాద్

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

టి20 ప్రపంచకప్ టోర్నీకి ఒమన్, నేపాల్ అర్హత





కీర్తిపూర్ (నేపాల్): వచ్చే ఏడాది వెస్టిండీస్-అమెరికాలలో జరిగే టి20 పురుషుల ప్రపంచకప్ క్రికెట్ టోర్నమెంట్‌కు నేపాల్, ఒమన్ జట్లు అర్హత సాధించాయి. ఇక్కడ జరుగుతున్న ఆసియా రీజియన్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఈ రెండు జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లి టి20 ప్రపంచకప్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నాయి. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో ఒమన్ జట్టు 10 వికెట్ల తేడాతో బహ్రెయిన్ జట్టును ఓడించగా... నేపాల్ జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టుపై గెలిచింది. టి20 ప్రపంచకప్ టోర్నీకి నేపాల్ జట్టు అర్హత సాధించడం ఇది రెండోసారి కాగా... ఒమన్ జట్టు మూడోసారి ఈ మెగా టోర్నీలో పోటీపడనుంది. నేపాల్ 2014లో, ఒమన్ 2016, 2021 ప్రపంచకప్ టోర్నీల్లో పాల్గొన్నాయి.

మరో రెండు బెర్త్‌ల కోసం...

వచ్చే ఏడాది జూన్ 4 నుంచి 30వ తేదీ వరకు వెస్టిండీస్-అమెరికాలలో జరిగే తొమ్మిదో టి20 ప్రపంచకప్‌లో తొలిసారి 20 జట్లు బరిలోకి దిగనున్నాయి. ఇప్పటికి 18 జట్లు అర్హత పొందాయి. ఆతిథ్య దేశాల హోదాలో వెస్టిండీస్, అమెరికా నేరుగా అర్హత సంపాదించాయి. 2022 ప్రపంచకప్ ద్వారా భారత్, ఇంగ్లండ్, పాకిస్తాన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, శ్రీలంక, నెదర్లాండ్స్ జట్లకు బెర్త్‌లు లభించాయి. ర్యాంకింగ్ ఆధారంగా అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్ జట్లకు బెర్త్‌లు దక్కాయి. ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా నేపాల్, ఒమన్... యూరోప్ క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా స్కాట్లాండ్, ఐర్లాండ్... తూర్పు ఆసియా-పసిఫిక్ క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా పాపువా న్యూగినీ... అమెరికా క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా కెనడా అర్హత సాధించాయి. ఈనెల 22 నుంచి 30 వరకు నమీబియాలో ఏడు దేశాల మధ్య (జింబాబ్వే, కెన్యా, నమీబియా, నైజీరియా, రువాండా, టాంజానియా, ఉగాండా) జరిగే ఆఫ్రికా రీజియన్ క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా చివరి రెండు బెర్త్‌లు ఖరారవుతాయి.

వృత్తి అగర్వాల్‌కు ఐదో పతకం

పనాజీ (గోవా): జాతీయ క్రీడల్లో తెలంగాణ స్విమ్మర్ వృత్తి అగర్వాల్ అద్భుత ప్రతిభ కనబరిచింది. ఈ క్రీడల్లో శుక్రవారం ఆమె ఐదో పతకాన్ని సొంతం చేసుకుంది. 400 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వృత్తి (4ని:30.03 సెకన్లు) రజత పతకాన్ని దక్కించుకుంది. గుజరాత్‌లో జరిగిన గత జాతీయ క్రీడల్లో వ్రితి మూడు రజతాలు, ఒక కాంస్యంతో నాలుగు పతకాలు సాధించింది. ఈసారి ఆమె మూడు రజతాలు, రెండు కాంస్యాలతో ఐదు పతకాలను తన ఖాతాలో జమ చేసుకుంది.


రజత పతకంతో వృత్తి


శ్రావ్య శివాని, రష్మిక

ఫైనల్లో రష్మిక-శివాని జోడీ

జాతీయ క్రీడల మహిళల టెన్నిస్ ఈవెంట్ డబుల్స్ విభాగంలో తెలంగాణకు చెందిన భమిడిపాటి శ్రీవల్లి రష్మిక-శ్రావ్య శివాని జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో రష్మిక-శివాని ద్వయం 6-4, 6-7 (5/7), 10-5తో షర్మదా బాలూ-సోహా సాదిక్ (కర్ణాటక) జంటను ఓడించింది. సింగిల్స్ విభాగంలో రష్మిక సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో రష్మిక 6-0, 6-3తో సుహిత మారూరి (కర్ణాటక)పై విజయం సాధించింది.

10న ఆన్‌లైన్‌లో 2.25 లక్షల వైకుంఠ ద్వార దర్శన టికెట్లు

టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి

తిరుమల: డిసెంబర్ 23–జనవరి1 వరకు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించిన 2.25 లక్షల రూ.300 దర్శన టికెట్ల కోటాను (రోజుకు 2 వేల టికెట్లు) నవంబర్ 10న ఆన్‌లైన్‌లో టీటీడీ విడుదల చేయనుంది. ఈ విషయాన్ని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో చెప్పారు. తిరుపతిలోని 9 కేంద్రాల్లో 100 కౌంటర్లలో డిసెంబర్ 22న వైకుంఠ ద్వార దర్శనానికి 10 రోజులకుగాను 4.25 లక్షల టైం స్లాట్ సర్వదర్శనం టోకెన్లు విడుదల చేస్తామని వివరించారు. డిసెంబర్ 23–జనవరి 1 వరకు చంటి పిల్లలు, దివ్యాంగులు, వృద్ధులు, ఎన్ఆర్ఐ కోటా దర్శనాలను రద్దు చేసినట్లు తెలిపారు. భక్తులు శ్రీవాణి ట్రస్ట్‌కు రూ.10 వేలు విరాళం ఇవ్వడంతో పాటు రూ.300 దర్శన టికెట్ కొనుగోలు చేయాలని, ఈ టికెట్లను పొందిన వారికి మహా లఘు దర్శనం (జయ విజయుల వద్ద నుంచి) ఉంటుందని చెప్పారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను నవంబర్ 10–18 వరకు నిర్వహిస్తామని చెప్పారు. నవంబర్ 12న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానాన్ని, 24న చక్రతీర్థ ముక్కోటి నిర్వహిస్తామన్నారు. అక్టోబర్‌లో 21.75 లక్షల మంది శ్రీవారిని దర్శించుకోగా..హుండీ ఆదాయం రూ.108.65 కోట్లు లభించిందన్నారు. తిరుమలలో యూపీఐ విధానంలో చెల్లింపులు చేసి గది పొందిన వారికి అది ఖాళీ చేసిన గంటలోపు, క్రెడిట్/డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేసిన వారికి 3–7 పని దినాల్లోపు కాషన్ డిపాజిట్‌ను జమ చేస్తామని చెప్పారు.

స్వామి వారి సేవలో ప్రముఖులు

శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు, భారత క్రికెటర్లు రిషబ్ పంత్, అక్షర్ పటేల్, ఆక్టోపస్ అడిషనల్ డీజీ (ఆపరేషన్) ఆర్కే మీనన్ శుక్రవారం దర్శించుకున్నారు.

సీఎం జగన్ వల్లే బీసీలకు మేలు

సాక్షి, అమరావతి: బీసీలను చంద్రబాబు ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుని వదిలేస్తే.. సీఎం వైఎస్ జగన్ మాత్రం అన్ని విధాలుగా మేలు చేసి చరిత్ర సృష్టించారని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్ స్పష్టం చేశారు. విజయవాడలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన బీసీ కుల సంఘాల ఆత్మీయ సమావేశంలో మారేష్ మాట్లాడారు. బీసీలకు ఆత్మగౌరవాన్ని పెంచేలా వారికి రాజ్యాధికారంలో 65 శాతానికి పైగా వాటా కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. బీసీ కుల గణనకు ఆమోదం తెలిపి.. దాని అమలుకు చేస్తున్న కృషి చరిత్రాత్మకమైందన్నారు.

టార్గెట్ 5 లక్షల ఇళ్లు

సంక్రాంతి నాటికి పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ లక్ష్యం

- నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద 22 లక్షల ఇళ్ల నిర్మాణం
- గత ఆగస్టులో ఇప్పటికే ఐదు లక్షలకు పైగా ఇళ్లు పూర్తి..
- సంక్రాంతి నాటికి రెండోదశ లక్ష్యం పూర్తిచేసేలా అడుగులు
- నిర్మాణం నిమిత్తం ఒక్కో ఇంటికి మొత్తంగా రూ.2.70 లక్షల చొప్పున అదనంగా మేలు
- ఇలా ఒక్కో పేదింటి మహిళకు రూ.10లక్షలు, అంతకుపైగా విలువైన స్థిరాస్తి ద్వారా లబ్ధి చేకూరుస్తున్న సీఎం జగన్ సర్కార్



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పేదింటి అక్కచెల్లెమ్మ సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో ఉన్న సీఎం జగన్ సర్కార్.. వచ్చే సంక్రాంతి నాటికి రాష్ట్రంలో మరో ఐదు లక్షల పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలనే లక్ష్యంతో గృహ నిర్మాణ శాఖ అడుగులు వేస్తోంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద 30.75 లక్షల మంది పేద మహిళల పేరిట విలువైన ఇంటి స్థలాలను ఉచితంగా పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అంతేకాక.. ఇందులో 22 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు కూడా ఇచ్చారు. మొదటి దశ కింద మొన్న ఆగస్టు నెలాఖరు నాటికి ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేశారు. గత నెల 12 నాటికి రెండో దశలోని కొన్ని ఇళ్లతో కలిపి 7.43 లక్షల (5.86 లక్షల సాధారణ + 1.57 లక్షల టిడ్కో) ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు.

శరవేగంగా రెండో దశ ఇళ్ల నిర్మాణం..

ఇక రెండో దశలో ఐదు లక్షల ఇళ్ల నిర్మాణం చేయాల్సి ఉండగా ఇప్పటికే 98,308 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలిన నాలుగు లక్షలకు పైగా ఇళ్లను నిర్దేశించుకున్న లక్ష్యంలోగా పూర్తిచేసి పేదలకు అందించేందుకు గృహ నిర్మాణ శాఖ శరవేగంగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ముగింపు దశలో 12,479, రూఫ్ లెవెల్‌లో 1.03 లక్షలు, పునాది పైదశల్లో 3.94 లక్షల చొప్పున ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. వీటన్నింటినీ వేగంగా పూర్తిచేయడంపై అధికారులు దృష్టిపెట్టారు.

ఉచితంగా స్థలం.. ఆపై అమిత సాయం

మరోవైపు.. ఇళ్ల లబ్ధిదారులకు ఖరీదైన స్థలాలను ఉచితంగా పంపిణీ చేసిన సీఎం జగన్ ప్రభుత్వం అక్కడితో ఆగకుండా ఇంటి నిర్మాణం నిమిత్తం యూనిట్‌కు రూ.1.80 లక్షల బిల్లు మంజూరు చేస్తోంది.

- స్వయం సహాయక బృందాల ద్వారా లబ్ధిదారులైన మహిళలకు పావలా వడ్డీకి రూ.35 వేలు రుణసాయం చేస్తోంది.
- ఉచితంగా ఇసుకను పంపిణీ చేయడం ద్వారా రూ.15 వేలు.. స్టీల్, సిమెంట్, ఇలా 12 రకాల నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై సరఫరా చేయడం ద్వారా మరో రూ.40 వేలు చొప్పున మొత్తంగా రూ.2.70 లక్షల చొప్పున అదనంగా లబ్ధిచేకూరుస్తోంది.
- అలాగే, జగనన్న కాలనీల్లో ఉచితంగా నీటి, విద్యుత్ సరఫరా కనెక్షన్లు ఇవ్వడం, డ్రెయిన్లు, రోడ్లు లాంటి సకల వసతులను సమకూరుస్తోంది.
- ఇలా స్థలం, ఇంటితో కలిపి పేదింటి మహిళల పేరిట రూ.10 లక్షలు, ఆపైన విలువైన స్థిరాస్తిని జగన్ సర్కార్ సమకూరుస్తోంది.

అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం

పేదల ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. సంక్రాంతి నాటికి పూర్తిచేయాల్సిన లక్ష్యాన్ని అధిగమించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. దీపావళి, క్రిస్మస్, జనవరి ఫస్ట్ ఇలా వరుస పండుగలు, ప్రత్యేక రోజులు ఉన్నందున.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు సొంతూళ్లకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఈ సమస్యను అధిగమించి పనులు చకచకా పూర్తిచేయడానికి శ్రమిస్తాం.

– అజయ్ జైన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ

జస్టిస్ భాస్కరరావుకు హైకోర్టు ఘన నివాళి

సాక్షి, అమరావతి: ఇటీవల కన్నుమూసిన అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.భాస్కరరావుకు హైకోర్టు శుక్రవారం ఘనంగా నివాళి అర్పించింది. ఈ కార్యక్రమానికి ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ నేతృత్వంలో న్యాయమూర్తులందరూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయవ్యవస్థకు జస్టిస్ భాస్కరరావు అందించిన సేవలను ప్రధాన న్యాయమూర్తి, అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి వి.సాయికుమార్ కొనియాడారు. ఆయన మరణం న్యాయవ్యవస్థకు తీరని లోటని అన్నారు. భాస్కరరావు మృతికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

కులగణనకు కేబినెట్ ఆమోదంపై ఎస్‌జేఎఫ్ హర్షం

సాక్షి, అమరావతి: సమగ్ర కులగణనకు ఆమోదం తెలుపుతూ ఏపీ కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై సోషల్ జస్టిస్ ఫోరం(ఎస్‌జేఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఎస్‌జేఎఫ్ రాష్ట్ర చైర్మన్ యర్రాకుల తులసీరామ్, రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమగ్ర కుల గణనను పారదర్శకంగా నిర్వహించి ఆయా సామాజిక వర్గాలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. సమగ్ర కుల గణన ద్వారానే సమన్యాయం, సామాజిక న్యాయం జరుగుతుందన్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా శిల్పారామాల అభివృద్ధి

పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ

సాక్షి, అమరావతి: పర్యాటకులను ఆకర్షించేలా శిల్పారామాలను అభివృద్ధి చేయనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ తెలిపారు. శుక్రవారం సచివాలయంలో శిల్పారామం సొసైటీ 7వ కార్యనిర్వాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజత్ భార్గవ మాట్లాడుతూ.. శిల్పారామాలు స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయన్నారు. రాష్ట్ర విభజన తర్వాత తొలి సారిగా 2022–23లో అత్యధికంగా టర్నోవర్ సాధించాయని, ఇకపై ప్రతి శిల్పారామం ప్రధాన ద్వారాన్ని గజబోసీ లాండ్‌స్కేపింగ్ ఏర్పాటు చేయాలన్నారు. హస్తకళలు, చేనేత వస్త్రాలు, డ్వాక్రా ఎగ్జిబిషన్ల సంఖ్య పెంచాలని చెప్పారు. ఉద్యాన శాఖ సహాయంతో శిల్పారామాల్లో ప్రకృతి రమణీయతకు పెద్దపీట వేయాలన్నారు.శిల్పారామం సీఈవో శ్యామ్ సుందర్ రెడ్డి పాల్గొన్నారు.

భూగర్భ జలాల సంరక్షణలో ఏపీ ఆదర్శం

- రాష్ట్రంలో వెయ్యి చెరువుల ఆధునికీకరణ
- ఇందుకు రూ.1,600 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులు
- 25వ ఐసీఐడీ సదస్సులో 'కాడా' స్పెషల్ కమిషనర్ రాఘవయ్య



సాక్షి, విశాఖపట్నం: భూగర్భ జలాల సంరక్షణలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ రోల్ మోడల్‌గా నిలిచిందని కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) స్పెషల్ కమిషనర్ పీఎస్ రాఘవయ్య వెల్లడించారు. రాష్ట్రంలో సమీకృత సాగునీరు, వ్యవసాయ అభివృద్ధి పరివర్తన పథకం సత్ఫలితాలిస్తోందని చెప్పారు. విశాఖలో జరుగుతున్న ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజి (ఐసీఐడీ) రెండోరోజు సదస్సు లో రాఘవయ్య వ్యవసాయ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. రాష్ట్రంలో సుమారు 40 వేల చిన్న తరహా సాగునీటి చెరువులున్నాయన్నారు. వీటిలో వెయ్యి చెరువుల ఆధునికీకరణ చేపడుతున్నామని.. ఇందులో భాగంగా చెరువుల లోతు, వాటి గట్లను పటిష్టం చేయడంతోపాటు వీటి కింద పంట కాలువలను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచ బ్యాంకు రూ.1,600 కోట్ల నిధులను ఇందుకు సమకూర్చిందని రాఘవయ్య చెప్పారు. ప్రస్తుతం 568 చెరువుల ఆధునికీకరణ జరుగుతోందని, 102 చెరువుల పనులు పూర్తయ్యాయని, ఇప్పటివరకు రూ.219 కోట్లు ఖర్చుచేశామని ఆయన వివరించారు.

2025 నాటికి వెయ్యి చెరువుల అభివృద్ధి..

రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలవల్ల చెరువులను వాస్తవ స్థితికి తీసుకురావడం,పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందించడం, ఎక్కువ పంటలు పండించడం, అధిక దిగుబడులు సాధించడం, వైవిధ్య పంటల సాగువైపు రైతులను మళ్లించడం, మేలైన వ్యవసాయ పద్ధతులను పాటించడం వంటి మంచి ఫలితాలు సాధిస్తున్నామని రాఘవయ్య వివరించారు. ఒడిశా, మహారాష్ట్రల్లో అమలవుతున్నా అక్కడ మందకొడిగా సాగుతోందన్నారు. ఇక ఈ పథకం కింద రాష్ట్రంలో ఎంపిక చేసిన వెయ్యి చెరువుల ఆధునికీకరణ పనులను 2025 అక్టోబరు నాటికి పూర్తిచేస్తామని చెప్పారు.

మార్కెట్లోకి 'ఐశ్వర్య' బియ్యం

రాజానగరం: మన ఇంట 'ఐశ్వర్య' బియ్యం ఉంటే ఆరోగ్యం మన వెంట ఉన్నట్టేనని ఐశ్వర్య బియ్యం బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న టీవీ యాంకర్ సుమ కనకాల తెలిపారు. ఐశ్వర్య ఫుడ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో కొత్త ప్రాడక్ట్‌గా రూపొందించిన 'ఐశ్వర్య' బియ్యాన్ని శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా నరేంద్రపురంలో ఆమె మార్కెట్‌లోకి విడుదల చేశారు. దీనికి సంబంధించిన రైస్ మిల్లును ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ ద్వారంపూడి భాస్కరరెడ్డి, సార్టెక్స్ 1, 2 రకాలను ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రమోద్‌కుమార్ మిశ్రా, ప్యాకింగ్ మిషన్‌ను రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి బులిమోహనరెడ్డి ప్రారంభించారు. ఐశ్వర్య ఫుడ్ ఇండస్ట్రీస్ మేనేజ్‌మెంట్ ప్రతినిధి జొన్నాడ శ్రీధర్, జొన్నాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రైస్తవులందరికీ మేలు జరిగేలా చూస్తా

క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన జాన్‌వెస్లీ

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో క్రైస్తవుల సంక్షేమానికి నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ అనేక కార్యక్రమాలు చేపట్టారని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను రెండోసారి చైర్మన్‌గా నియమించడంతో తాడేపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తనపై నమ్మకంతో మరోసారి అవకాశం ఇచ్చిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రెండేళ్లలో ఈ పదవిని మరింత సమర్థంగా నిర్వర్తించి క్రైస్తవులందరికీ మేలు జరిగేలా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అమర్లపూడి శేఖర్, డైరెక్టర్లు తదితరులున్నారు.

రియల్ ఎస్టేట్ సంస్థ డాలర్స్ గ్రూప్‌పై ఐటీ దాడులు

సంస్థ అధిపతి దివాకర్‌రెడ్డి ఇళ్లు, ఆఫీస్, బంధువుల ఇళ్లలో ఒకేసారి సోదాలు

తిరుపతి రూరల్: తిరుపతిలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ డాలర్స్ గ్రూప్‌పై ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఒక్కసారిగా దాడులు చేశారు. స్థానిక నలందనగర్‌లోని ఆ గ్రూప్ అధినేత సి.దివాకర్‌రెడ్డి ఇళ్లు, ప్రకాశం రోడ్డులో ఉన్న కార్పొరేట్ కార్యాలయం, తిరుపతి, పెరుమాళ్లపల్లిలోని ఆయన బంధువుల ఇళ్లలో ఒకేసారి ఐదు బృందాలు సోదాలు నిర్వహించాయి. డాలర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట, పాపనాయుడు, రామచంద్రాపురంతో పాటు పలు ప్రాంతాల్లో భారీగా రియల్ ఎస్టేట్ వెంచర్లు వేశారు. అయితే గత కొంతకాలంగా ఆదాయపు శాఖకు సమర్పిస్తున్న లెక్కల్లో భారీగా తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పన్ను ఎగవేసేందుకు ప్రయత్నించినట్లు గుర్తించిన ఢిల్లీ ఐటీ శాఖాధికారులు తెలుగు రాష్ట్రాల్లోని అధికారులను అప్రమత్తం చేశారు. శుక్రవారం రాత్రి తిరుపతిలోని ఆదాయపు పన్నుశాఖ ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేష్ సామ్రాట్ ఆధ్వర్యంలో దాదాపు 30 మంది అధికారులు డాలర్స్ గ్రూప్ కార్యాలయం, ఇళ్లల్లో సోదాలు నిర్వహించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అర్ధరాత్రి వరకు సోదాలు కొనసాగాయి. కాగా, డాలర్స్ గ్రూప్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నట్లు దుర్గేష్ సామ్రాట్ మీడియాకు తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenahalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.